# మనం


జనం కోసం.. అక్షర యజ్ఞం..





HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 64 • పేజీలు:12+16 • వెల: రూ.5 | శుక్రవారం • 2-2-2018 | www.manamnews.com | /manamnews

# ఎన్నికల బడ్జెట్

## వివేచనవైపే విత్తమంత్రి జైట్లీ మొగ్గు.. ప్రభుత్వ.. పార్టీ ప్రాథమ్యాలతో పద్దు

### వ్యవ'సాయం'.. గ్రామీణహితంపై శ్రద్ధ.. జన'జీవన సౌలభ్యం' మెరుగుపై దృష్టి

ప్రజారోగ్యం.. వైద్య విద్యకూ పెద్దపీట


వంటింటి మంటనుంచి 'ఉజ్వల' ఊరట

మహిళా ఔత్సాహిక తోడ్పాటుకు 'ముద్ర'

'కార్పొరేట్'కు 5% పన్ను తగ్గింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:

ఎన్నికల పరీక్ష దగ్గర పడుతున్న వేళ విత్త మంత్రి 'వివేచన' ప్రదర్శించారు. గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రాథమ్యం ప్రకారం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 'ఉభయతారక' పద్దును ప్రకటించారు. దేశానికి అన్నంపెట్టే అన్నదాతకు అగ్ర ప్రాధాన్యమిస్తూ వ్యవసాయానికి పెద్దపీట వేశారు. అదే సమయంలో పార్టీ ప్రయోజనాన్నీ దృష్టిలో పెట్టుకుని ప్రజా క్షేత్రంలో ఓట్ల పంటకు బీజావాపనం చేశారు. ఆ మేరకు పంటలకు కనీస మద్దతు ధరను ఉత్పత్తి వ్యయంకన్నా ఒకటిన్నర రెట్లు అధికం చేస్తామని ప్రకటించారు. ఉజ్వల యోజనద్వారా 8 లక్షల గ్యాస్ కనెక్షన్లతో వంటింటి మంటనుంచి మహిళలకు ఊరటనిస్తూ పోలింగ్ కేంద్రాలకు వారు ఉరికొచ్చే యోచన చేశారు. ఇక ముద్ర **మిగతా 6లో..**



## పేదలకు ఆరోగ్య వరం

మరిన్ని బడ్జెట్ కథనాలు లోపలి పేజీల్లో..

## ఇదీ లోకం!




కలెక్షన్ కింగ్ ఎలక్షన్‌లోనూ కింగ్ అనిపించుకోవాలని ఉబలాటపడుతున్నట్టున్నాడు!

# కొలువుతీరిన సమ్మక్క



చిలకల గుట్ట నుంచి గద్దె పైకి

తుపాకి కాల్పులతో ఘనస్వాగతం

అమ్మలకు భక్తకోటి నీరా'జనం'

తల్లిని తాకేందుకు భక్తుల ఆరాటం

గద్దెలపై వనదేవతల భక్తకోటికి దర్శనం

జాతరలో ఆవిష్కృతమైన మహాఘట్టం

గద్దెల చుట్టూ ఇసుకేస్తే రాలనంత జనం

క్యూలైన్‌లో తోపులాట.. చిన్నారి మృతి

3లో..



## వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి రాత్రి స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. చలిగాలుల తీవ్రత పెరుగుతుంది.

**గరిష్ఠ ఉష్ణోగ్రత: 33 డిగ్రీలు**

**కనిష్ఠ ఉష్ణోగ్రత: 15 డిగ్రీలు**

**గాలిలో తేమ: 34 శాతం**

## ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: విదియ మ.12.54 తదుపరి తదియ; నక్షత్రం: మఖ మ.12.57 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా.8.26-9.55; దుర్ముహూర్తం: ఉ.9.07-9.52, మ.12.52-1.38; రాహుకాలం: ఉ.11.05-12.30; అమృతఘడియలు: ఉ.10.48-12.16; శుభసమయం: మ.1.39-3.00.

**సూర్యోదయం: 6.52**

**సూర్యాస్తమయం: 6.08**



## సుప్రీంలో ఇక కొత్త రోస్టర్

7లో..

కేసుల కేటాయింపులో అమలు

కొత్త విధానానికి ఆమోదం

'పిల్'లన్నీ నా పరిధిలోనే: సీజేఐ



# నేనూ సై...

## కేటీఆర్ సవాల్ స్వీకరిస్తున్నా: ఉత్తమ్

### నువ్వో బచ్చా.. మీ నాయన కూడా చెప్పాలె

ఓడితే మీ కుటుంబమంతా సన్యసిస్తరా

అవినీతి రొచ్చులో టీఆర్ఎస్ ప్రభుత్వం

నీ అహంకారాన్ని ప్రజలు చూస్తున్నారు

కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత లేదు

నిశ్శబ్ద విప్లవం.. జనం తరిమికొడతారు



హైదరాబాద్, ఫిబ్రవరి 1 (మనం ప్రతినిధి):

రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్ పార్టీయేనని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన విలేకరుల తో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తమకు 70 స్థానాలు వస్తాయని సర్వేలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. అధికారంలోకి రాలేకపోతే తాను, తన భార్య రాజకీయాలనుంచి వైదొలగుతామని ప్రకటించారు. అయితే, టీఆర్ఎస్ ఓడిన పక్షంలో కేసీఆర్ కుటుంబం మొత్తం రాజకీయ సన్యాసం చేయాలన్నారు. బుధవారం గద్వాల సభలో ప్రసంగించిన సందర్భంగా ''టీఆర్ఎస్ గెలవకపోతే నేను రాజకీయ సన్యాసం చేస్తా... కాంగ్రెస్ ఓడితే ఉత్తమ్ అందుకు సిద్ధమేనా?'' అని మంత్రి కేటీఆర్ సవాలు విసిరారు. ఈ నేపథ్యంలో ఆ సవాలును బేషరతుగా స్వీకరిస్తున్నప్పటికీ- రాజకీయాల్లో కేటీఆర్ ఓ బచ్చా అని, అందువల్ల ఆయన తండ్రి కేసీఆర్ స్వయంగా తమ సవాలును స్వీకరించాలని డిమాండ్ చేశారు. ''టీఆర్ఎస్ ఓడితే కేసీఆర్‌తోపాటు ఆయన కుటుంబసభ్యులు కేటీఆర్, కవిత, హరీశ్‌రావు కూడా రాజకీయాల నుంచి తప్పుకొంటారా?'' అని ప్రశ్నించారు. తమకు **మిగతా 6లో..**



## ఉద్యోగులకు శుభవార్త

అంతర్రాష్ట్ర బదిలీలకు ఓకే

జూన్ 30 వరకు గడువు

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ సీఎస్‌ల ఉత్తర్వులు

బదిలీ విధివిధానాల వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 1 (మనం ప్రతినిధి):


ప్రభుత్వోద్యోగులకు శుభవార్త. తెలంగాణ, ఏపీ రెండు రాష్ట్రాల ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అంతర్రాష్ట్ర **మిగతా 6లో..**

# నేతలకే అచ్ఛేదిన్..

- వేతన జీవులకు కంటి తుడుపు చర్యలే
- పన్ను రాయితీలో మొండిచేయి

హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం ప్రతినిధి): ముందస్తు ఎన్నికల కోలహలం నేపథ్యంలో బడ్జెట్‌లో అనుకూల ఫలితాలుంటాయని భావించిన వేతన జీవులకు నిరాశే ఎదురైంది. ఎన్నికల ముందు చివరి బడ్జెట్ కాబట్టి వెసులుబాటు ఉంటుందేమో అని వేతన జీవులు ఆశపడ్డారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితిలో ఎలాంటి మార్పులు లేవని జైట్లీ ప్రకటించారు. పార్లమెంటు సభ్యుల జీత భత్యాలకిచ్చే విషయంలో చూపిన చొరవ వేతన జీవుల పట్ల చూపకపోవటం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూలిగే నక్కమీద తాటి పండు పడ్డట్టుగా వేతన జీవులు కట్టే ట్యాక్స్ మీద వేసే విద్య, వైద్య సెస్సు నాలుగు శాతం పెంచారు. పన్ను మినహాయింపుల్లో ఊరటనివ్వకపోవటం పట్ల వేతన జీవులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఎన్ని కష్టాలున్నా సరే నెల గడిచేసరి వచ్చే జీతంలోంచి ఆదాయపు పన్నును బుద్ధిగా కట్టే వారిలో ఉద్యోగులే ముందుంటారు. ప్రతి ఏటా బడ్జెట్‌లో ఎంతో కొంత ఆదాయపు పన్ను రాయితీని ఉదోగులు ఆశిస్తుంటారు. ఉద్యోగులకు వచ్చే జీతానికి, వారు కట్టే ఆదాయపు పన్నుకు సంబంధం ఉండదు. పన్ను కట్టే ఉద్యోగులకు ప్రత్యేక రాయితీలు ఇవ్వటంలో కేంద్ర మంత్రి మొండి చేయి చూపించారు. ఉద్యోగస్తులు ప్రయాణ, వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 40వేలు స్టాండర్డ్ డిడక్షన్‌ను మంత్రి ప్రకటించారు. దీంతో గతంలో వీటి కోసం బిల్లులు పెట్టాల్సి వచ్చేది. ఇప్పుడు ఎలాంటి బిల్లులు లేకుండా ప్రతి ఒక్కరూ క్లెయిమ్ చేసుకునే అవకాశాన్ని మాత్రం కల్పించారు. ఇది కేవలం కంటి తుడుపు చర్యే అని వేతన జీవులు భావిస్తున్నారు. బొగ్గు గనికార్మికులకు ఆదాయపు పన్ను మినహాయింపు విషయంలో జైట్లీ బడ్జెట్ నిరాశ పర్చిందని సింగరేణిలోని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

## సామాన్యుల బడ్జెట్ : కె.లక్ష్మణ్




హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం న్యూస్): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2018-19 బడ్జెట్, పేదల బడ్జెట్ అని, ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా అన్ని వర్గాల వారిని మెప్పించేలా ఈ బడ్జెట్ రూపకల్పన చేశారని డాక్టర్ లక్ష్మణ్ కితాబిచ్చారు. గత మూడు బడ్జెట్లతో పాటు ఈసారి బడ్జెట్ కూడా సంస్కరణలు, అభివృద్ధికి పెద్దపీట వేసేలా ఉందని, ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికి, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ప్రత్యక్ష పన్నుల ప్రయోజనం పేదలకు అందేలా ఈ బడ్జెట్ ఉందని, నగదు బదిలీ పథకం ద్వారా మధ్యలో దళారుల పాత్ర పూర్తిగా తగ్గిపోయి, నేరుగా లబ్ధిదారులకే ప్రయోజనం కలుతుందన్నారు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, ఉజ్వల యోజన పథకం కింద 8 కోట్ల మహిళలకు ఉచిత గ్యాస్, ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నట్లు పేర్కొనడం నిజంగా సంతోషదాయకమని అన్నారు. మౌలిక సదుపాయాల కోసం ప్రాధాన్యత ఇవ్వడం శుభసూచకమని, ఇది ముమ్మాటికీ సామాన్యుల బడ్జెట్ అని ఆయన అన్నారు.

### తెలుగు రాష్ట్రాలకు మొండిచేయి: ఎల్. రమణ



హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం న్యూస్): కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో తెలుగు రాష్ట్రాలకు మొండిచేయి చూపించడం భాదకరమని తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ విమర్శించారు. తెలంగాణలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడంలేదని ఆక్షేపించారు. కేంద్రం నుంచి బడ్జెట్ కేటాయింపులను రాబట్టడంలో టీఆర్ఎస్ ఎంపీలు విఫలమయ్యారని మండిపడ్డారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను బడ్జెట్ కేటాయించే విధంగా ఎంపీలు ఎటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. సింగరేణి కార్మిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిదన్నారు. ఇందుకు నిరసనగా టీఎన్‌టీయూసీ దాని అనుబంధ సంఘాలు ఈ నెల 5 న 72 గంటలపాటు నిరవధిక దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. దీక్షకు సంబంధించిన గోడపత్రిక, కరపత్రాలను ఆయన విడుదలచేశారు.

## ఊహాల పల్లకిలో: సుధాకర్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం న్యూస్): కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఊహాల పల్లకిలో ఉరేగినట్లుగా ఉందని కాంగ్రెస్ విమర్శించింది. తెలంగాణాకు బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని శాసన మండలిలో కాంగ్రెస్ ఉపాధ్యాక్షుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి విమ ర్శించారు. విభజ చట్టంలో పేర్కొన్న ఏ ఒక్క అంశాన్ని కూడా బడ్జె ట్‌లో ప్రస్తావించలేదన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసేలేదన్నారు. అన్ని విషయాల్లో బీజేపీ గట్టిగా సమర్థించిన ముఖ్యమంత్రి రాష్ట్రానికి నిధు లు, ప్రాజెక్ట్‌లు సాధించడంలో ఘోరంగా విఫలమైయ్యారని విమర్శిం చారు. గతంలో మోదీ రాష్ట్రానికి వచ్చినప్పుడు 'మీ ప్రేమ తప్ప మా కు ఏం అవసరంలేదని, మాది ధనిక రాష్ట్రమం' అని సీఎం చెప్పా రని, ఇప్పుడు మరి అదే ప్రేమతో సంతృప్తి పడతారా అని ప్రశ్నించారు.

### ఆశలు వమ్మయ్యాయి: జోగు రామన్న



హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం ప్రతినిధి): రాష్ట్ర ఆశల్ని కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ వమ్ముజేసిందని అటవీ శాఖ మంత్రి జోగు రామన్న అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌లో పారదర్శకత లోపించిందని, రాష్ట్రానికి ఒరిగిందేమీలేదన్నారు. తెలంగాణలో అమలువుతున్న పలు కార్యక్రమాలకు కేంద్రం కనీస సాయం అందించలేదన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం వంటి ప్రతిష్టాత్మాక కార్యక్రమాలకు నిధుల కేటాయింపు ఊసేలేదన్నారు.

## ఈ-వే బిల్ ఓ మైలురాయి

- పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్ కుమార్
- సరుకు విలువ రూ.50వేలు దాటితే వే బిల్లు తప్పనిసరి
- జీఎస్టీ చెల్లించకుంటే వంద శాతం జరిమానా విధిస్తాం

హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం ప్రతినిధి): జీఎస్టీ తర్వాత ఈ-వేబిల్ సిస్టమ్ అమలులోకి రావడం ఒక మైలురాయి అని, ఈ విధానంలో దేశవ్యాప్తంగా ఒకటే బిల్లు ఉంటుందని పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్ కుమార్ చెప్పారు. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌తో కలిసి గురువారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ-వే బిల్ సిస్టం ద్వారా డేటా బేస్ తయారవుతుందని, దీంతో ఎక్కడ నుంచి ఎక్కడకు సరుకు రవాణా అవుతుందో సులభంగా తెలుస్తుందన్నారు. సరుకు విలువ రూ.50 వేలు ఆపైన ఉంటే ఈ-వేబిల్ తప్పనిసరి అన్నారు. జీఎస్టీ అమలోకి వచ్చిన తర్వాత జనవరిలో రూ. 1,656.14 కోట్ల ఆదాయంవచ్చిందన్నారు. జీఎస్టీ చెల్లించని సరుకులు తనిఖీల్లో దొరికితే సరుకు విలువకు వంద శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ-వే బిల్‌తో సరుకు రవాణాకు లాభం అన్నారు.

# తెలుగోళ్లంటే గింత అలుసా?

## తెలంగాణపై కేంద్రం చిన్నచూపు ..పొమ్మనలేక పొగ బెట్టిన కేంద్రం

- ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వ వివక్ష




హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం ప్రతినిధి): తెలుగు రాష్ట్రాలకు అత్తెసరు కేటాయింపులతోనే కేంద్ర వార్షిక బడ్జెట్‌లో కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ సరిపెట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని అంశాల్లో పొగుడుతున్న కేంద్రం బడ్జెట్‌లో మాత్రం నిరాశ పర్చే విధంగా వ్యవహరించటం గమనార్హం! రాష్ట్రంలోని ప్రాజెక్టుల పట్ల కేంద్రం చిన్నచూపు చూసింది. విభజన సమయంలో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీల్లో ప్రధానమైన వాటికి ఇప్పటి వరకు నిధులు దక్కలేదు. పెండింగ్‌లో ఉన్న విభజన హామీలకు మోక్షం లభిస్తుందని ఆశించిన తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం బడ్జెట్‌లో షాకిచ్చింది. తెలంగాణ రాష్ట్రం చేసిన ప్రతిపాదనల్లో ఏ ఒక్కదాన్ని పరిగణలోకి తీసుకున్న దాఖలాలు లేవు. తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపడ్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎంతో కొంత నిధులను కేంద్రం ఇస్తుందనే ఆశలు అడియాశలయ్యాయి. నిధుల కేటాయింపులో ప్రాధాన్యమివ్వాలని నీతి అయోగ్ ఇచ్చిన సూచనలను కేంద్రం పెడచెవిన పెట్టిందని పలువురు ఆరోపిస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు త్వరలో కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలు జరుగనుండటంతో ఆ రాష్ట్రానికి నిధుల కేటాయింపులో జైట్లీ పెద్దపీట వేశారు. బెంగుళూరు మెట్రోకు అధనంగా ఏకంగా రూ.18వేల కోట్ల ను కేటాయించటాన్ని చూస్తే తెలంగాణ పట్ల వివక్ష అర్థమవుతుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. రానున్న ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే అవకాశం ఉన్న క్రమంలో మహారాష్ట్రపై కేంద్రం వీపరీతమైన ప్రేమను కేంద్రం ఒలకబోసింది. ముంబై సబర్మన్‌కు రూ.15వేల కోట్లను కేటాయించటాన్ని చూస్తే ఈ విషయం అర్థమవుతోందంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు నిధులివ్వాలని నీతిఅయోగ్ చేసిన సిఫార్సులను కేంద్రం పెడచెవిన పెట్టింది. ఈ పథకాలకు ఆర్థిక సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరిన దాఖలాలు న్నాయి. నోట్ల రద్దు, జీఎస్టీ విషయంలో తెలంగాణ ప్రభుత్వం మద్దతుగా నిలిచిన విషయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విస్మరించింది. దీంతో కేంద్రం తీరుపై అధికార టీఆర్ఎస్ నేతలు గరంగరంగా ఉన్నారు.

### తెలంగాణ ఆశలపై కేంద్రం నీళ్లు..

ప్రాణహిత-చేవెళ్లను జాతీయ ప్రాజెక్టుగా పరిగణించటం, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, కాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయాలను కేంద్రం పక్కన పెట్టి తెలంగాణ ఆశలపై కేంద్రం నీళ్ల చల్లింది. తెలంగాణలోని భూపాలపల్లి జయశంకర్ జిల్లా ములుగు మండలం జాకారంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు రూ.10 కోట్లను కేంద్రం బడ్జెట్‌లో కేటాయించింది. హైదరాబాద్‌లో ఐటీ ఏర్పాటుకు రూ. 75 కోట్లు, సింగరేణికి రూ. 2వేల కోట్లు, పరిశ్రమలకు వడ్డీ రాయితీ కోసం రూ. 50 కోట్లు, నల్లగొండ-లింగంగుంట మార్గంలో 129 కిలో మీటర్లు, పెద్దపల్లి-లింగంపేట మార్గంలో 83 కిలోమీటర్ల మేర ఎలక్ట్రిఫికేషన్ ఏర్పాటుతో కేంద్రం సరిపెట్టింది. కాగా సింగరేణి విషయంలో నిధుల కేటాయింపు కేవలం రికార్డులకే పరిమితమని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తుండటం గమనార్హం. కాగా, బడ్జెట్‌పై టీఆర్ఎస్ ఎంపీలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

### బడ్జెట్ నిరాశ కలిగించింది:
## పొంగులేటి



ఖమ్మం, ఫిబ్రవరి 1(మనం న్యూస్ బ్యూరో): అరుణ్‌జైట్లీ గురువారం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశను కలిగించిందని ఖమ్మం పార్లమెంటు సభ్యుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న పొంగులేటి గురు వారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగింద న్నారు. బడ్జెట్ కేటాయింపులో జిల్లా ప్రస్తా వన లేకపోవడం బాధాకరమన్నారు. భద్రా ద్రి జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పా టు విషయాన్ని కేంద్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజ లకు ఈ బడ్జెట్ వల్ల ఉపయోగం లేదన్నారు. విజయవాడ నుంచి వరంగల్ వరకు త్రీవే రైల్వే ట్రాక్ ఏర్పాటుతో ప్రయాణికులకు కొంత ఊరట లభిస్తుందని, మిగిలిన విష యాల్లో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. సీతారామ ప్రాజెక్టు జాతీయ హోదా కల్పించ లేదని, కొత్తగూడెం ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న బయ్యారం ఉక్కు పరిశ్రమకు, కొత్తగూడెం విమానాశ్రయానికి నిధులు కేటా యించలేదన్నారు. కొవ్వూరు రైల్వేలైన్ పనులు కేంద్రం గాలికొదిలేసిందన్నారు. బడ్జె ట్‌పై జరిగే చర్చలో ఈ విషయాలను లేవ నెత్తి వాటి సాధనకు కృషి చేస్తామన్నారు.

# రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం సరికాదు

- స్త్రీ, శిశు సంక్షేమానికి బడ్జెట్లో చోటేది
- మద్దతు ధర పెంచి రైతును ఆదుకోండి
- నిజామాబాద్ ఎంపీ కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 1 (మనం ప్రతినిధి): రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం సరికాదని నిజామాబాద్ ఎంపీ కవిత అన్నారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లా డారు. స్త్రీ, శిశు సంక్షేమానికి బడ్జెట్‌లో చోటు లేకపోవటం విచాకరమన్నారు. మధ్య, చిన్న తరహా పరిశ్రమలపై పన్ను భారం మోపడం సరికాదన్నారు. ఢిల్లీలో కూర్చొని గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు ఖాతాల్లో డబ్బులు వేస్తామనడం అన్యాయమన్నారు. ఈ విషయాన్ని రాష్ట్రాలన్ని సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. కేంద్ర బడ్జెట్ పేదల పక్షాన ఉండి ఉంటే బాగుండేదన్నారు. గ్రామీణ ప్రజల అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. విద్య, ఆరోగ్యంపై దృష్టి పెట్టామని చెప్పినా కేటాయింపులు అంతంతమాత్రంగానే ఉన్నాయన్నారు. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విషయంలో మొదటి నుంచి ప్రభుత్వ వైఖరి విచిత్రంగా ఉందన్నారు. తెలంగాణకు రైల్వే లైన్ల ఊసేలే దన్నారు. కనీస మద్దతు ధర పెంపు ప్రకటన లేకపోవడం బాధాకరమన్నారు. కనీస మద్దతు ధరలను 50శాతం పెంచుతా మని ఎన్నికల సమయంలో బీజేపీ ఇచ్చిన హామీని ఈ సంద ర్భంగా ఆమె గుర్తు చేశారు. మద్దతు ధరను పెంచి రైతులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష: ఈటల



హైదరాబాద్, ఫిబ్రవరి 1 (మనం ప్రతినిధి): కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం లోక్ సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపించారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఈమేరకు సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి విషయం లో రాష్ట్రాల మధ్య పోటీ పెంచే విధంగా కేంద్రం నిర్ణయాలు ఉండాలన్నారు. ప్రపంచ మంతా గ్లోబల్ వార్మింగ్ గురించి భూగర్భ జలాల గురించి ఆలోచిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయతో దానికి పరిష్కారం చూపించిం దన్నారు. నాణ్యమైన విద్య అందించడం కోసం 500 రెసిడెన్షియల్ పాఠశాలల ప్రారంభించి వాటి కోసం కేంద్రం నుంచి నిధులు కోరితే మొండిచేయి చూపించారన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యంపై దృష్టి పెట్టినట్టు కనిపించినా బడ్జెట్ గొప్పగా ఉందనే భావన కల గలేదన్నారు. రాష్ట్రంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టు లతో పాటు విభజన చట్టంలో పేర్కొన్న ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, రైల్ కోచ్ ఫ్యాక్టరీ, హార్టీ కల్చర్, ట్రైబ ల్ యూనివర్సిటీలకు గాను రూ.40 వేల కోట్లు తెలంగాణకు కేటాయిం చాలని కోరామని, బడ్జెట్‌లో వాటి ప్రస్తావనే లేదని అన్నా రు. ప్రజల మధ్య అంతరాలు తగ్గించేలా బడ్జెట్‌లో ఎలాంటి చర్యలూ లేవన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలకు ఆలోచించి కేటాయింపులు చేయాలని, ఈ కేటాయింపులు ఆశాజనకంగా లేవన్నారు.

# ఆరోగ్య సిద్దిపేటే లక్ష్యం

## అనుగుణంగా నిర్మాణాలు..రూ.5 కోట్లతో స్విమ్మింగ్ పూల్

- క్రీడలతోనే యువతలో ఆత్మస్థైర్యం
- జాతీయ స్థాయి 'మినీ స్టేడియం'
- 9 నుంచి క్రికెట్ లైవ్ మ్యాచ్‌లు
- 150ఎకరాల ఫారెస్టు రిక్రియేషన్ జోన్
- మరో 4 షటిల్ కోర్టులూ: హరీశ్ రావు



సిద్దిపేట, ఫిబ్రవరి 1(మనం ప్రతినిధి): ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉంటే అన్నీ ఉన్నట్లేనని మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని ఆరోగ్య సిద్దిపేట రూపకల్పనే ధ్యేయంగా ముందుకుసాగుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రూ.5 కోట్లు వెచ్చించి సిద్దిపేటలో అంతర్జాతీ య ప్రమాణాలతో స్విమ్మింగ్‌పూల్ నిర్మించామని చెప్పారు. ఓ వైపు జాతీయ స్థాయి క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు అనువుగా ఉండేలా మినీ స్టేడియం, పిల్లలు ఆడుకు నేందుకు అవసరమైన అడ్వెంచర్ పార్కును ఏర్పాటు చేసుకున్నామన్నారు. గురువారంనాడు కలెక్టరేట్ సమీపం లో నూతనంగా నిర్మించిన పుట్ ఓవర్ బ్రిడ్జి, స్విమ్మిం గ్‌పూల్, అడ్వెంచర్ పార్కులను మంత్రి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని హంగులు ఉండేలా జాతీయ స్థాయిలో సిద్దిపేట మినీ స్టేడియాన్ని నిర్మించామని, ఈ నెల 9, 10, 11 తేదీలలో క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నామని వివరించారు. ఇందులో 5 మ్యాచ్‌లు లైవ్ టెలికాస్ట్ కానున్నాయని, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మ్యాచ్‌లు తిలకించాలన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 50 ఫీట్ల పొడవుతో నిర్మించిన స్విమ్మింగ్‌పూల్ ను కాపాడుకోవడమే గొప్ప అన్నారు. స్విమ్మింగ్‌పూల్ నిర్వహణకు ప్రతినెల రూ.3.5 లక్షలు ఖర్చు అవుతుందని, ఇందుకోసం ప్రతి ఒక్కరి నుండి రూ.1500లను సభ్యత్వ రుసుముగా వసూ లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో బావుల్లో, చెరువుల్లో ఈతను నేర్చుకునే వారని, బావుల్లో నీరులేక చెరువుల్లో నీరు కలుషితం కావడంతో ప్రస్తుత కాలంలో ఈతనే మర్చిపోయారని, అత్యుత్తమ వ్యాయామం స్విమ్మింగ్ మాత్రమే అన్నారు.

### స్విమ్మింగ్‌ను మించిన వ్యాయామంలేదు..

తెరాస ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. ఆరోగ్యంకోసం స్విమ్మింగ్‌ను మించిన మంచి వ్యాయామం మరొకటి లేదని, మెట్రో పాలిటన్ సిటీ హైదరాబాద్ తర్వాత సిద్దిపేటలో లైవ్ మ్యాచ్‌లు నిర్వహి ంచనున్నట్లు తెలిపారు. కోమటిచెరువు వద్ద అడ్వెంచర్ గేమ్స్ ప్రారంభించుకున్నామని, రానున్న రోజుల్లో సిద్దిపేలో మల్టిప్లెక్స్ థియేటర్‌లను నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆరోగ్య సిద్దిపేట, ఆరోగ్య తెలంగాణలో భాగంగానే స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. సిద్దిపేట శివారులో 150 ఎకరాల్లో ఫారెస్టు రిక్రియేషన్ జోన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. మినీ స్డేయంలో అదనంగా నాలుగు షటిల్ కోట్‌ల నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. స్విమ్మింగ్ పోటీలలో పాల్గొని మొదటి స్థానంలో నిలిచిన క్రీడాకారులను అభినందించారు. స్విమ్మింగ్ పూల్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్సీ, బిసి కార్పొరేషన్ ఈడిలు చరణ్‌దాస్, రాంరెడ్డి, ఇరిగేషన్ ఈఈలు రవిందర్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను శాలువాతో సన్మానించారు. ఆ తర్వాత రూ. 1500లు చెల్లించి మొదటి సభ్యత్వాన్ని మంత్రి తీసుకొని వెనువెంటనే మున్సిపల్ కౌన్సిలర్లకు సభ్యత్వం ఇప్పించారు.

# ఇంటి మేడపై చిన్నారి తల

- హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో కలకలం
- మంత్రగాళ్ల పనేమోనని సందేహం
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ఉప్పల్, ఫిబ్రవరి 1 (మనం న్యూస్): హైదరాబాద్‌లోని ఉప్పల్ ప్రాంతంలో దారుణం జరిగింది. స్థానిక చిల్కానగర్ మైసమ్మగుడి ప్రాంతంలోని ఓ ఇంటి మేడపై మూడు నెలల చిన్నారి తల కనిపించింది. క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్న రాజశేఖర్ తన భార్యతో కలిసి చిల్కానగర్‌లో నివాసముంటున్నాడు. ఉతికిన దుస్తులు ఆరవేసేందుకు రాజశేఖర్ భార్య గురువారం ఉదయం 11గంటల పమయంలో మేడ మీదకు వెళ్లింది. అక్కడ దాదాపు మూడు నెలల వయస్సు ఉండే ఓ చిన్నారి తల ఆమెకు కనిపించింది. భయపడిన ఆమె వెంటనే భర్త రాజశేఖర్‌కు ఫోన్ ద్వారా తెలియజేసింది. రాజశేఖర్ ఇచ్చిన సమాచారం మేరకు ఉప్పల్ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. స్థానిక సీఐ వెంకటేశ్వర్లు పరిస్థితిని పరిశీలించి ఉన్నతాధికారులకు సమా చారం ఇచ్చారు. రాచకొండ జాయింట్ సీపీ తరుణ్‌జోషి, డీసీపీ ఉమామ హేశ్వర శర్మ ఆ స్థలాన్ని, చిన్నారి తలను పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సాయంతో ఆధారాలు సేకరించే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా, బుధవారం చంద్రగ్రహణం నేపథ్యంలో మంత్రగాళ్లు ఎవరైనా ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని, పాపను బలి ఇచ్చి ఆమె తలను ఇక్కడికు తెచ్చి పడేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

### వేరుశనగ కొనుగోలుకు
## కేంద్రం అంగీకారం

- మంత్రి హరీశ్‌రావు హర్షం

హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం ప్రతినిధి): తెలంగాణలో వేరుశనగ కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వా నికి గురువారం లేఖ పంపింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 1.28 లక్షల ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ పంట ద్వారా 2.40 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని, పంట కొనుగోలుకు సహకరించాలని కోరుతూ మంత్రి హరీశ్‌రావు జనవరి 9న కేంద్రానికి లేఖ రాశారు. ఈ మేరకు 96000 మెట్రిక్ టన్నుల వరకు సేకరిస్తామని, కేంద్ర ప్రభుత్వ ప్రైస్ సపోర్ట్ స్కీమ్ కింద నాఫెడ్, ఆయిల్ ఫెడ్ సంస్థల ద్వారా కొనుగోలు చేస్తామని చెప్పింది. దీంతో వేరుశనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

### వ్యక్తి ప్రాణం కాపాడిన
## హోంగార్డులకు కేటీఆర్ అభినందన

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (మనం న్యూస్): సమయస్ఫూర్తితో వ్యవ హరించి ఓ వాహనదారుడి ప్రాణాలు కాపాడిన హోంగార్డులకు రాష్ట్ర పరిశ్ర మల, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ట్విటర్ ద్వారా అభినందనలు తెలియజేశా రు. హైదరాబాద్ నగరంలోని పురానాపూల్ మీదుగా జహనుమా వైపు ద్విచ క్రవాహనంపై వెళుతున్న ఓ వ్యక్తి హఠాత్తుగా కింద పడిపోయాడు. బహదూ ర్‌పూర్ స్టేషన్‌కి చెందిన హోంగార్డులు చందన్‌సింగ్, ఇనాయతుల్లా ఖాన్ ఆ వ్యక్తిని గమనించారు. గుండెపోటు వచ్చి ఉంటుందని భావించిన హోంగా ర్డులు ఆ వ్యక్తికి సీపీఆర్(కార్డియో పల్మనరి రెస్క్యూసిటేషన్) చేశారు. ఆ వ్యక్తి ఛాతీపై బలం గా ఒత్తి శ్వాస ఆగిపోకుండా చేశారు. అతను కోలుకోగానే ఆస్ప త్రికి తరలించారు. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనకు సంబంధిం చిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ వీడియోను చూసిన కేటీఆర్ హోంగార్డులను ప్రత్యేకంగా అభినందించారు.


## పంచాయతీరాజ్ ఖాళీల భర్తీకి అనుమతి

హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం ప్రతినిధి): పంచాయతీరాజ్ శాఖలో 151 ఖాళీ పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తెలిపింది. హైదరాబాద్ మినహా మిగతా జిల్లాల్లో పోస్టుల భర్తీ ప్రక్రియ త్వరలోనే జరగనుంది. ఈమేరకు 77 జూనియర్ అసిస్టెంట్, 74 టైపిస్ట్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం తాజాగా అనుమతి ఇస్తూ.. పోస్టుల భర్తీ బాధ్యతను టీఎస్‌పీఎస్‌సీకి అప్పగించింది.

## నన్ను ఓడించడం మీ వల్ల కాదు

- కేటీఆర్ వ్యాఖ్యలపై డీకే అరుణ

హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం న్యూస్): గద్వాల నుంచే తమ జైత్రయాత్ర ప్రారంభమవుతుందన్న కేటీఆర్ మాటలను కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్యే డీకే అరుణ ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్‌కు ఇక్కడి నుంచి జైత్రయాత్ర కాదని పరాజయ యాత్ర మొదలవుతుందని అసెంబ్లీ మీడియా హాల్ లో పేర్కొన్నారు. 'గద్వాల్‌లో నన్ను ఓడించడం నీవల్ల కాదు, మీ నాయన వల్ల కూడా కాదని' ఆమె స్పష్టంచేశారు. జాతర జరుగుతున్న సమయంలో సభ పెట్టి ప్రజలను, భక్తులను ఇక్కట్లకు గురిచేశారన్నారు. కేటీఆర్‌కు రాజకీయాలపై అవగాహన లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న కేటీఆర్ మాటలను ఎలా నమ్మాలన్నారు. మహబూబ్‌నగర్‌లో తుమ్మిళ్ల ప్రాజెక్ట్‌కు పునాదులు వేసిందే కాంగ్రెస్ అన్న విషయం కేటీఆర్ తెలుసుకోవాలన్నారు. తామే జిల్లాను అభివృద్ధి చేశామంటున్న కేటీఆర్ నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లకు ఎన్ని నిధులు ఇచ్చారో, మున్సిపాలిటీలకు ఎన్ని నిధులు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. కేటీఆర్ వచ్చిన సమయంలో గ్రహణం పట్టిందని, టీఆర్ఎస్ కూడా గద్వాల నుంచే గ్రహణం పడుతుందన్నారు.





# కొలువుతీరిన సమ్మక్క

- చిలకల గుట్ట నుంచి గద్దె పైకి
- తుపాకి మోతలతో ఘనస్వాగతం
- అమ్మలకు భక్తకోటి నీరా'జనం'
- తల్లిని తాకేందుకు భక్తుల ఆరాటం
- గద్దెలపై వనదేవతల భక్తకోటికి దర్శనం
- జాతరలో ఆవిష్కృతమైన మహాఘట్టం
- గద్దెల చుట్టూ ఇసుకేస్తే రాలనంత జనం
- క్యూలైన్‌లో తోపులాట.. చిన్నారి మృతి





మేడారం, ఫిబ్రవరి 1(మనం న్యూస్ నెట్‌వర్క్): మేడారం జాతరలో మహాఘట్టం ఆవిష్కృతమైంది. జన దేవత సమ్మక్క వనంలోంచి జనంలోకి చేరింది. భక్తకోటికి దర్శనమిచ్చేందుకు గద్దెలపై నిలిచింది. ఇప్పటికే జంపన్న, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపై కొలువై ఉండగా, సమ్మక్క చేరికతో జాతరకు మరింత శోభ చేకూరింది. దీంతో వన దేవతల జనజాతరలో మహాద్భుత ఘట్టం పూర్తయింది. శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చి శనివారం వనదేవతలు గుట్టకు తిరుగు పయనంకానున్నారు. రెండేళ్లుగా ఎదురుచూస్తున్న తన బిడ్డలకు దర్శనమిచ్చేందుకు వరాల తల్లి, భక్తుల కొంగు బంగారమైన సమ్మక్క తల్లి చిలకలగుట్ట దిగి మేడారం గట్టుపైకి చేరుకుంది. తల్లి రాకతో భక్తజనం పులకించింది.

వనాలన్నీ సమ్మక్క తల్లి నామస్మరణలతో మారుమ్రోగాయి. లక్షలాది మంది భక్తిపారవశ్యం, ఆదివాసీ గిరిజన యువత నాట్యాలు, కోయల డప్పుచప్పుళ్లు, శివసత్తుల శివాలు, భక్తుల పూనకాలు, ప్రభుత్వ అధికారిక లాంచనాల నడుమ ఆదివాసీ పూజారులు (వడ్డెలు) వన దేవత సమ్మక్కను చిలకలగుట్ట నుంచి మేడారం గద్దెలపైకి చేర్చారు. తల్లి రాక కోసం చూస్తున్న లక్షలాది మంది భక్తులతో చిలకలగుట్ట ప్రాంతం కిక్కిరిసిపోయింది. గుట్ట నుంచి మేడారం వరకు ఉన్న దారంతా జనాలతో చిట్టడవిని తలపించింది. ఆమె రాకకు సూచికగా ఎస్పీ భాస్కరన్, ఇంచార్జి కలెక్టర్ కర్ణన్ గాల్లోకి కాల్పులు జరిపారు.

### సమ్మక్క-పగిడిద్దరాజుల కళ్యాణం..

మేడారంలోనున్న ఆ తల్లి గుడిలో సమ్మక్క-పగిడిద్దరాజుల వివాహాన్ని జరిపించడం ఆనవాయితీ. ఈ వివాహ మహోత్సవాన్ని అత్యంత రహస్యంగా కొద్దిమంది పూజారులు జరిపించారు. ఇక్కడ ప్రత్యేక పూజల అనంతరం తల్లిని గద్దెలపైకి తరలించారు.

### ఉదయం నుంచే తల్లి రాకకు ఏర్పాట్లు..

సమ్మక్క తల్లిని గద్దెలపైకి తీసుకొచ్చే ఘట్టాన్ని పూజారులు గురువారం ఉదయం నుంచే ప్రారంభించారు. సమ్మక్క తల్లికి పూజలు చేసేందుకు పూజారులు (వడ్డెలు) గురువారం ఉదయం చిలకల గుట్ట ప్రాంతంలోని అడవి లోనికి వెళ్లి వనాలను(కంక బొంగులు) తీసుకొచ్చి తల్లిని కొలువుంచే గద్దెలపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గద్దెలపై అమ్మవారికి పూజారులు ముగ్గులేశారు. అనంతరం గద్దెలకు సమీపంలోని పూజా మందిరం నుంచి కొత్త కుండలు (వడరాలు) తీసుకొచ్చి గద్దెలపై ఉంచారు. సాయంత్రం అమ్మవారిని గద్దెపైకి తోడ్కొని వచ్చేందుకు పూజారుల బృందం చిలకల గుట్టపైకి బయలుదేరింది. అప్పటికే చిలకలగుట్ట ప్రాంతమంతా భక్త జనసందోహంతో కిక్కిరిసిపోయింది. సమ్మక్క పూనిన పూజారి కుంకుమ భరణి రూపంలో ఉన్న గిరిజనుల ఆరాధ్య దైవాన్ని పట్టుకుని గద్దెలవైపు పయనమ య్యారు. తల్లి రూపాన్ని, తల్లి ఆవహించిన పూజారిని తాకేందుకు జనం ముందుకు రావడంతో తోపులాట జరిగింది. భక్తులను నియంత్రించే క్రమంలో రోప్ పార్టీ పోలీసులు జనాలను వెనక్కి నెట్టేశారు. సమ్మక్క తల్లి నామస్మరణతో ఆ ప్రాంతమంత మోరుమోగింది.

### పెరిగిన రద్దీ..

మొక్కులు చెల్లించుకునేందుకు నెల రోజుల నుంచి భక్తులు మేడారానికి వస్తున్నప్పటికీ, గురువారం భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. సమ్మక్క -సారక్క తల్లులిద్దరూ గద్దెలపై కొలువయ్యాక దర్శించుకుంటే మంచి జరుగుతుందన్న నమ్మకంతో ఆదివాసీ భక్తులు ఈ రెండు రోజుల్లోనే దర్శనానికి వస్తుంటారు. దీంతో గురువారం రద్దీ పెరిగింది. శుక్రవారం మరింత పెరిగే అవకాశముంది. వీవీఐపీ దర్శనం వైపు నుంచి వెళ్లేందుకు జనం తోసుకుని వచ్చారు. వారిని నిలువరించడం పోలీసుల తరం కాలేదు. దీంతో కొంతమందని లోపలికి పంపించి.. తదనంతరం నిలువరించారు.









### క్యూలైన్‌లోనే ప్రాణాలొదిలిన చిన్నారి

భక్తుల రద్దీ పెరగడంతో దర్శనానికి ఐదారు గంటలకుపైగా సమయం పడుతోంది. గురువారం క్యూలైన్‌లో జరిగిన తోపులాటలో ఓ పాప మరణించగా.. మరో మహిళ కాలు విరిగింది. పోలీసుల మధ్య సమన్వయలోపంతో గందరగోళం నెలకొంటోందని భక్తులు ఆరోపిస్తున్నారు. జాతర బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ ఏఎస్పీకి, కానిస్టేబుల్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్టు సమాచారం.

## నేడు మేడారం జాతరకు సీఎం కేసీఆర్

- బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో పయనం

వరంగల్, ఫిబ్రవరి 1(మనం న్యూస్ బ్యూరో): రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు శుక్రవారం నాడు సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో అధికారులు భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 12:30 గంటలకు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రమం నుంచి హెలిక్యాప్టర్‌లో బయల్దేరి మధ్యాహ్నం 1:15 గంటలకు మేడారానికి చేరుకోనున్నారు. సమ్మక్క సారలమ్మలను సందర్శించుకొని మొక్కులు చెల్లించుకోనున్నారు. అనంతరం అక్కడే భోజనంచేసి మంత్రులు, అధికారులతో భేటీ కానున్నారు. జాతర పరిస్థితిని సమీక్షించి మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. ఇప్పటికే ఉపముఖ్యమంత్రి ఇతర ప్రముఖులు మేడారం ఏర్పాట్లలో అధికారులను సమన్వయం చేస్తూ భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చూసేందుకు తలమునకలవుతున్నారు. కాగా, దేశంలోనే అతిపెద్ద జాతరగా పేరొందిన మేడారం జాతరకు హాజరై వనదేవతలను దర్శించుకోవడం పలు రాష్ట్ర ప్రభుత్వాధినేతల సంప్రదాయంగా మారింది. ఈసారి కూడా ఇతర రాష్ట్రాల ప్రముఖులు హాజరై అమ్మలను దర్శించుకుంటున్నారు.

## ఛత్తీస్‌గఢ్ సీఎంకు తప్పిన ముప్పు



వరంగల్, ఫిబ్రవరి 1(మనం న్యూస్): మేడారం మహాజాతరలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. రమణ్ సింగ్ సమ్మక్క గద్దెపైకి రావడం, అదే సమయంలో భక్తులు కొబ్బరికాయలు విసురుతున్నారు. ఈ క్రమంలో భక్తులు విసిరిన ఓ కొబ్బరికాయ రమణ్ సింగ్‌ను తాకనుండగా చివరిక్షణంలో గమనించిన భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ప్రమాదం తప్పింది. మహాజాతర రెండో రోజు గురువారంనాడు మేడారానికి భక్తులు భారీగా తరలివచ్చారు. సాంప్రదాయం ప్రకారం సమ్మక్క గద్దెపై భక్తులు కొబ్బరి కాయలు విసురుతారు. అయితే సీఎం రమణ్ సింగ్ ఆ సమయంలోనే సమ్మక్క గద్దెపైకి వచ్చారు. సీఎం వస్తున్నట్లు ముందే సమాచారం ఇచ్చినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భక్తుల క్యూలైన్‌ను నిలిపివేయలేదని సమాచారం. అయితే సీఎం భద్రతాసిబ్బంది వెంటనే అప్రమత్తం అవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో సమక్కను దర్శించుకున్న ముఖ్యమంత్రి రమణ్ సింగ్ సారలమ్మను దర్శించుకోకుండానే వెనుదిరిగారు.

## మేడారం జాతరకు 1.3 కోట్ల మంది వస్తారని అంచనా

- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి




మేడారం, ఫిబ్రవరి 1(మనం న్యూస్): మేడారం జాతరకు ఈ ఏడాది కోటి ముప్పై లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చెప్పారు. ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం 50 లక్షలకు పైగా భక్తులు వచ్చారని, శుక్రవారం రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించామని, ప్రత్యేక నిర్మాణాలు చేశామని చెప్పారు. 4200 ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా నడుపుతున్నామన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 20వేల మంది ఉద్యోగులు జాతర కోసం పని చేస్తున్నారన్నారు.

# వన దేవతలకు తీరొక్క మొక్కులు

- నిలువెత్తు బంగారం సమర్పణ
- ఒడి బియ్యం.. ఎదురుకోళ్లతో
- గద్దెల దగ్గర భక్తుల కోలాహలం
- పట్నాలు.. బోనాలు.. యాటపోతులు
- జాతరలో మొక్కులు తీర్చే భక్తులు







హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం ప్రతినిధి): కష్టాల నుంచి గట్టెక్కించమని, తమ కుటుంబాన్ని చల్లగా చూడాలని భక్తులు వనదేవతలకు తీరొక్క రకాలుగా మొక్కుకుంటారు. కోరి మొక్కితే చాలు కోటి వరాలిచ్చే తల్లులకు ఆపై వచ్చే జాతరలో తమ తమ మొక్కుబడులు చెల్లించుకుంటారు. జాతరలో మొక్కులు చెల్లించుకునే భక్తులతో సమ్మక్క సారలమ్మల గద్దెలు కిక్కిరిసిపోతాయి. బుధవారం జాతర ప్రారంభమైన సమ్మక్క సారలమ్మ జాతర శుక్రవారంతో ముగియనుంది. ఈ సందర్భంగా అమ్మవార్లకు భక్తులు తమ శక్తి కొద్ది మొక్కులు చెల్లించుకుంటున్నారు. చుట్టూ ఉన్న అడవిని కాపాడాలంటూ ఆదివాసీలు సమ్మక్క సారలమ్మలకు మొక్కుకునే వారట! జీవన విధానంలో మార్పులు చోటుచేసుకున్నాక తమ కుటంబాన్ని కాపాడాలని, పిల్లాపాపలను చల్లగా చూడా లని కోరుకుంటూ మొక్కులు చెల్లించుకునేవారట! క్రమేపీ మైదాన ప్రాంతాల భక్తులు కూడా అమ్మవార్లకు మొక్కుకోవడం, తర్వాత వాటిని చెల్లించుకోవడం ప్రారంభమైంది. వనదేవతలను దర్శించుకునే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది.

### ఎదురుకోళ్ల..

భక్తుల మొక్కుల్లో ఎదురుకోళ్లు కూడా ఒకటి. భక్తులు ఆసక్తి చూపించే కార్యక్రమం కూడా ఇదే. సమ్మక్క- సారలమ్మ గద్దెల ముందు భాగంలో కోళ్లను పైగి ఎగరేస్తారు. తమ బాధలు తీరితే ఎదురుకోళ్లు చేస్తామని భక్తులు మొక్కుకుంటారు. మంచి జరిగిందని భావించినవారు ఎదురుకోళ్లు చేస్తారు. కోళ్లను పైకి ఎగరేసేవారికి కొంత ఇస్తే గద్దెల దగ్గర ఎదురుకోళ్లు చేసి అమ్మవారికి మొక్కు చెల్లిస్తారు. మేడారం జాతర సందర్భంగా పెళ్లి చేసుకొని అక్కడే మూడురోజులు నిద్ర చేస్తామని మరికొంతమంది భక్తులు మొక్కుకుంటారు. ఈ మొక్కు తీర్చుకున్న భక్తులకు సమ్మక్క-సారలమ్మ, జంపన్న లాంటి పిల్లలు పుడతారని నమ్ముతారు. ఆదివాసీల ఈ మొక్కులను ఇప్పుడు మైదాన ప్రాంతాల భక్తులు కూడా పాటిస్తున్నారు.

### అమ్మలకు ఒడి బియ్యం..

ఒడి బియ్యాన్ని సమర్పించుకుంటామని మరికొందరు భక్తులు మొక్కుకుంటారు. ముఖ్యంగా కొత్తగా పెళ్లైనవారుగానీ, వారి తల్లిదండ్రులుగానీ ఈ మొక్కు చెల్లిస్తారు. బియ్యంలో పసుపు కలిపి నడుముకు కట్టుకుంటారు. జాతరకు వచ్చి గద్దెల దగ్గర డబ్బాల్లో ఒడిబియ్యం పోసి మొక్కు చెల్లిస్తారు. ఇలా చేస్తే అమ్మ తమను కాపాడుతుందని, కష్టాలు తీరతాయని భక్తులు నమ్ముతారు. పిల్లలు పుట్టినవారు గద్దెల దగ్గర ఉన్న స్తంభానికి వెండి తొట్టె కట్టి మొక్కు చెల్లిస్తారు. అమ్మలు వస్తున్నప్పుడు వడ్డెల కాళ్ల కింద పడితే జన్మసార్థకం అయిందని భక్తులు భావిస్తారు.

### నిలువెత్తు బంగారం.. బోనాలు..

ఆదివాసీల మొక్కుబడులు రకరకాలుగా ఉంటాయి. తమ శక్తి కొద్ది మొక్కులు చెల్లిస్తారు. ఇందులో ప్రధానమైంది అమ్మలకు బంగారం సమర్పించుకోవడం. తులాభారం వేసి నిలువెత్తు బెల్లాన్ని బంగారంగా సమర్పిస్తారు. ఒడి బియ్యం, తట్టెలు, కొబ్బరికాయలు, పసుపుకుంకుమలు, చీర, బుట్టలు, పట్నాలు, చిలకలు, బోనాలు, ఎదురుకోళ్లు, యాటపోతులు ఇలా పలు రకాల మొక్కులు చెల్లించుకుంటారు. ఒకప్పుడు ఆదివాసీలకు బెల్లం ఖరీదైన వస్తువు కాబట్టి దీన్నే దేవతలకు సమర్పించేవారని చెబుతారు. అలాగే సమ్మక్క భర్త పగిడిద్దరాజు పేరులో పగిడి అంటే బంగారం అని అర్థం ఉంది. అందుకే బెల్లానికి బంగారం అని పేరొచ్చిందని మరికొందరు చెబుతారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శుక్రవారం, ఫిబ్రవరి 2

# 'మోదీకేర్' బడ్జెట్

బడ్జెట్‌లు దేశ భవిష్యత్‌ను నిర్మించే కార్యాచరణ ప్రణాళికలుగా కాక, అవి క్రమంగా ఓటు బ్యాంకు నిర్మాణ సాధనాలుగా మారిపోవడం దురదృష్టకరం. నరేంద్ర మోదీ ప్రభుత్వం 2018 వార్షిక బడ్జెట్‌ను ఒక బలమైన ఎన్నికల ఆయుధంగా వినియోగించుకునేందుకు తీవ్ర కసరత్తు చేసింది. అయితే ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని సకాలంలో సవ్యంగా పరిష్కరించలేని మోదీ ప్రభుత్వ వైఫల్యం రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ప్రతికూల అంశాలుగా మారబోతాయి. మోదీ ప్రభుత్వ చివరి బడ్జెట్ ఎన్నికల బడ్జెట్‌గా సాగింది. ఎస్సీ/ఎస్టీ, రైతులు, వృద్ధులు, మహిళలు ఇలా వివిధ రకాల అణగారిన ప్రజలకు భారీ ఎత్తున సంక్షేమ పథకాలు బడ్జెట్‌లో పొందుపరిచింది. దానికితోడు ఇప్పటికే అమలులో ఉన్న పేద, గ్రామీణ ప్రాంత ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులు పరిమాణాలను ఇబ్బడిముబ్బడిగా పెంచి వేశారు. సాధారణ బడ్జెట్ కేటాయింపుల కంటే ఇవి భిన్నమైనవి. జనరంజక బడ్జెట్‌గా తయారు చేసేందుకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గణాంకాల గారడీ చేశారు.

రాబోయే ఎన్నికల నేపథ్యంలో దేశంలోని 50 కోట్ల మంది లబ్ధిదారులకు కుటుంబానికి రూ. 5 లక్షల రూపాయల చొప్పున ఆరోగ్య బీమా పథకాన్ని మోదీ ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. ఈ ఆరోగ్య బీమా పథకాన్ని వేగంగా అమలులోకి తీసుకురాగలిగితేనే ఎన్నికల్లో ఎన్డీఏ సంకీర్ణ కూటమికి లబ్ధి చేకూరుతుంది. ఈ 'మోదీకేర్' ఆరోగ్య సంక్షేమ పథకాన్ని ఎన్నికల్లో కీలక ప్రచార ఆయుధంగా వినియోగించుకోవాలని బీజేపీ యోచిస్తోంది. ప్రతి బడ్జెట్‌లోనూ స్థూల, సూక్ష్మ ఆర్థికాంశాలు విధిగా ఉంటాయి. అవి ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందే దిశను సూచిస్తాయి. బడ్జెట్‌లో పొందుపరచిన సూక్ష్మ ఆర్థిక నిర్ణయాలు అనుగుణంగా వివిధ రంగాల్లో ఉత్పత్తి, అమ్మకాల వ్యూహాలు రూపొందించేందుకు సంకేతాలుగా నిలుస్తాయి. కేంద్ర బడ్జెట్ ఆర్థిక వ్యవస్థలో వృద్ధి చెందిన లేదా వ్యవస్థీకృతమైన సమస్యలను పరిష్కరించేం దుకు ఒక కార్యాచరణ ప్రణాళికగా ఉంటుంది. మోదీ సర్కార్ ఇచ్చిన పెద్ద నోట్ల రద్దు, సరుకులు, వస్తువుల పన్ను (జీఎస్టీ)అనే రెండు పెద్ద షాక్‌లు, పెరుగుతున్న ప్రపంచ చమురు ధరలు సృష్టించిన ప్రతికూల అంశాలను, సవాళ్ల నుంచి ఏర్పడిన ఆర్థిక సవాళ్లతో వ్యవహరించాల్సిన పరిస్థితి. ద్రవ్య సంబంధమైన సమస్యల నుంచి ఆర్థిక వ్యవస్థను పరిరక్షించవలసిన విధానపరమైన చర్యలను బడ్జెట్‌లో పొందుపరచవలసి ఉన్నది. అయితే జైట్లీ బడ్జెట్ ఈ సవాళ్లపై కాకుండా ఎన్నికల తాయిలాలుగా ఉపకరించే ఆరోగ్య బీమా వంటి సంక్షేమ పథకాలకే నిధుల కేటాయింపులు చేశారు.

'2014 వరకు విధాన లోపంతో దేశం నష్టపోయిందని, ఇప్పుడు సహజ వనరులను పారదర్శకంగా కేటాయిస్తున్నామని, నిజాయితీ, పారదర్శక విధానాల వల్ల మార్పులు వచ్చాయి. విదేశీ పెట్టుబడులు పెరిగాయని, గత కొన్నేళ్లుగా తెస్తున్న సంస్కరణలు ఇప్పుడు ఫలితాలిస్తున్నాయిని, మోదీ సంస్కరణలతో భారత వృద్ధి రేటు తొలి మూడేళ్ళలో 7.5 శాతం సాధించామ'ని జైట్లీ గంభీరంగా ప్రకటించారు. అయితే చాలామంది ఊహించినట్లే రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కేంద్ర బడ్జెట్ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ళ మౌలిక పరిష్కారాలు కనుగొనడంలో విఫలమైందని ఆర్థికవేత్తలు పెదవి విరుస్తున్నారు. కేంద్ర బడ్జెట్ రెండు తెలుగు రాష్ట్రాలకు నిరాశే మిగిల్చింది. విభజన సవాళ్ళను పరిపూర్తికి ఆంధ్రప్రదేశ్‌కు సరైన నిధులు కేటాంపులు బడ్జెట్‌లో లేకపోవడంతో తెలుగుదేశం నేతలు, తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న అనేక అభివృద్ధి పథకాల కోసం కేంద్రం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం అందకపోవడంతో టీఆర్ఎస్ నేతులు కేంద్రంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర వార్షిక బడ్జెట్‌లో భాగంగా ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు పెద్దగా ప్రాధాన్యం లభించలేదు. అత్తెసరు కేటాయింపులు, ప్రాజెక్టులతో కేంద్రం తెలుగు రాష్ట్రాలను నిరాశపరచింది.

రైతు సంక్షేమ బడ్జెట్‌గా నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేస్తున్నా, వ్యవసాయ రంగ అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో లభించిన కేటాయింపులు కూడా నామమాత్రంగానే ఉన్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అయితే కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం వల్ల జీడిపప్పు ధర , వైద్య సేవలు, పెట్రో ఉత్పత్తులు, సోలార్ ప్యానెల్స్ వంటి వస్తువుల ధరలు తగ్గనున్నాయి. విలువైన లోహాలు, ఆభరణాలు, సిగరెట్లు, కార్లు, కూరగాయల తదితర వస్తువుల ధరలు మరింత ప్రియం కానున్నాయి. ఆదాయపన్నుపై వేతన జీవులకు ఊరట కలిగించక పోవడంతో వారు నిరాశకు గురయ్యారు. దూరదృష్టి కొరవడిన ద్రవ్య విధానాల వల్ల ఖజానా ఆదాయానికి గండి పడింది. దాంతో ద్రవ్యలోటు వంద శాతం పెరిగింది. ద్రవ్యలోటును పూడ్చుకునేందుకు ప్రభుత్వం అదనంగా డబ్బు ను ముద్రించవలసిన అగత్యం ఏర్పడింది. దాంతో ద్రవ్యోల్బణం పెరిగి నిత్యా వసరాల ధరలు పెరగడంతో సామాన్యుల నడ్డి విరిగే పరిస్థితి తలెత్తుతుంది. గత ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లకు నకలుగానే ఈసారి బడ్జెట్ కూడా వివిధ ప్రజా సమూహాలకు నిరాశను మిగిల్చింది. 'మోదీకేర్' బడ్జెట్ రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఎలా లాభిస్తుందో చూడాలి!

# ముందస్తు పరిష్కారం?

'కాలయాపన మొత్తానికి చేటు' అన్న నానుడి నాగాలాండ్ ప్రస్తుత సంక్షోభంలో కనిపిస్తోంది. జాతుల తిరుగుబాటును నివారించేందుకు ఎన్నికల ద్వారా స్థానిక ప్రభుత్వ ఏర్పాటు అంశం కీలకమైనప్పటికీ, అందుకు పూర్వావసరంగా ఉద్యమ సంస్థలతో ఒక అవగాహన కుదరవలసిన అవసరం ఉంది. అలాంటి ఏర్పాటు లేకుండా గడువులోపు ఎన్నికలు జరపాలన్న రాజ్యాంగ విధి పేరుతో ఎన్నికలు నిర్వహించే ప్రయత్నం నాగాలాండ్‌లో వికటించింది. ఫిబ్రవరి 27న జరిగే నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని పాలక పీపుల్స్ ఫ్రంట్, బీజేపీ, కాంగ్రెస్ సహా 11 రాజకీయ పక్షాలు, వివిధ గిరిజన మండళ్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న హోహో తదితర ప్రజాసంఘాలు శాంతి చర్చల ప్రక్రియ పరిష్కారమైన తర్వాతనే ఎన్నికల్లో పాల్గొంటామని డిమాండ్ చేస్తూ ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాయి. రాజకీయ పక్షాల అభీష్టాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా ఎన్నికల కమిషన్ బుధవారం నామినేషన్ల ప్రారంభిస్తూ నోటిఫికేషన్‌ను జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. అందుకు నిరసనగా నాగాలాండ్ రాజకీయ పార్టీలు, పౌర సంఘాలు 12 గంటలకు పిలుపిచ్చాయి.

నరేంద్ర మోదీ అధికారంలోకి రాగానే నాగాలాండ్ శాంతి ప్రక్రియ ను వేగవంతం చేసి 2015లో నేషనల్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్, (ఐసాక్ మొయూవా) వర్గంతో ఒప్పందం (ఫ్రేమ్‌వర్క్ రూపంలో) కుదుర్చుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామమే. అనేక దఫాలుగా కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులకు, ఎన్ఎస్‌సీ ఎన్‌కు మధ్య చర్చలు జరిగినా కొలిక్కిరాని అంశం కొద్దిరోజుల్లో తేల్చివేయాలని ఉద్యమ సంస్థలు పట్టుబట్టాయి. ఈ పరిస్థితి వస్తుందన్న విష యాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుగానే ఊహించి, ఆ ఉద్యమ సంస్థలకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించకపోవడంతో సమస్య జటిలంగా మారింది. నాగా ప్రజలు అత్యధికంగా నివసిస్తున్న మణిపూర్, అస్సాం, మణిపూర్ రాష్ట్రాల్లోని ప్రాంతాలనే కాకుండా, మయాన్మార్‌లోని కొన్ని ప్రాంతాలను సైతం కలిపి విశాల నాగాలాండ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న ఎన్ఎస్‌సీఎన్ (ఐఎం)తో కేంద్రం రహస్య ఒప్పందం చేసుకుంది. కేంద్రం చేసుకున్న నాగా ఒప్పందం పారదర్శకంగా ఉండాల్సిన అవసరం ఉంది. బీజేపీ రాజకీయ ప్రయోజనాల సంగతి ఎలా ఉన్నా నాగాలాండ్ సమస్యని పరిష్కరించడంలో దూరదృష్టి, సంయమనం కొరవడితే ఈశాన్య భారతం మరోసారి అగ్నిగుండంగా మారే ప్రమాదం ఉంది.

# స్వప్నం సాకారమవుతున్న వేళ..!

రాష్ట్ర విభజన జరిగి మూడేళ్ళైనా ఆంధ్రా పాలకులు తెలంగాణాపై తమ అక్కసును ఇంకా వెళ్లగక్కుతూనే ఉన్నారు. నాడు అన్యాయం చేసిందే కాకుండా నేడు అర్థంలేని ఆరోపణలతో తెలంగాణ భూముల్లో పంటలు పండవని ఆంధ్రా శాస్త్రవేత్తలు అశాస్త్రీయ వాదనలు వినిపిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి కేటాయింపుల్లో వివక్ష వల్ల తెలంగాణ భూములను బీడుభూములుగా మార్చిందే కాక, ఇప్పుడిలా ఇక్కడ వరి సాగుచేస్తే నీరు వృథా అని అనడం సిగ్గుచేటు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రైతులు అప్పులు చేసి మొక్కవోని ధైర్యంతో సొంత పెట్టుబడులతో బోర్ల ద్వారా వరి సాగు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయతో చెరువులలో జలకళ సంతరించుకొంది. భూగర్భ జలాలు పెరిగాయి. సాగునీరు అందుబాటులోకి రావడంతో వరి ఉత్పాదకత కూడా భారీగా పెరిగింది. ఏపీనీ కాదంటే దేశ ఆహార భద్రతకు ముప్పు అని, తెలంగాణలో కిలో వరి ఉత్పత్తికి అయ్యే ఖర్చులు ఎక్కువని, సాగు నీటి వాడుక సామర్థ్యం తక్కువని, అసలు వాతావరణమే అనుకూలంగా లేదని అర్థంలేని వాదనలు వినిపిస్తున్నాయి. రెండు రాష్ట్రాల్లో దాదాపు ఒకే వ్యవసాయ వాతావరణం ఉన్నది. రెండు రాష్ట్రాల్లో 20కి పైగా వరిరకాలు సాగులో ఉన్నాయి. సాగర్ ఆయకట్టులో పంటకాలం 120 రోజులైతే, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో 150 రోజులు, ప్రకాశం జిల్లాలో 140 రోజులు పడుతుంది. స్వల్పకాలిక వరి రకాలు తక్కువ దిగుబడినిస్తాయి. దీర్ఘకాలిక వరి రకాలు అధిక దిగుబడినిస్తాయి. ఆంధ్రలో ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యేది దీర్ఘకాలిక రకాలే. ఆంధ్రలో డెల్టా భూముల్లో 14 రోజుల పాటు నీరు నిలిచిపోతుందని, అక్కడ వరిసాగు అనుకూలమని, తెలంగాణలో ఎర్ర నేలలు కాబట్టి ఆరుతడి పంటలే వేసుకోవాలని వారి వాదన. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లో వరిసాగు తలకు మించిన భారం. ఆ భారాన్ని భరించలేక రైతులు క్రాప్ హాలిడే కూడా ప్రకటించారు. వీటిని దృష్టిలో పెట్టుకోకుండా తెలంగాణపై ఆరోపణలు చేయడం దేనికి? సాగుకు విపరీతంగా నీటిని వాడుతూ తక్కువ ఉత్పాదకత తీస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో ముందు వరిసాగును నిషేధించాలి. తరతరాలుగా వరిని ఏకపంటగా సాగుచేయడం వల్ల ఆ రాష్ట్రంలో భూములు వ్యాధుల క్షేత్రాలుగా మారాయి. విపరీతంగా ఎరువుల వాడకం వల్ల అక్కడి భూములు ఆమ్లత్వం సంతరించుకున్నాయి. కావున ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ వరిసాగు నుంచి వేరే పంటలకు మారాలి.



> దక్షిణ భారతదేశంలో వరిసాగుకు అత్యంత అనుకూల వాతావరణం ఉన్నది కాబట్టే భారతీయ వరి పరిశోధన సంస్థను తెలంగాణలో ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా అభివృద్ధి పరచిన వరిలో సూటిరకాలు, హైబ్రిడ్ రకాలను విడుదలకు ముందు ఇక్కడే పరీక్షిస్తారు. తెలంగాణ ప్రభుత్వం రైతు ప్రభుత్వం. రైతుల బాగుకోసం భారీ సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తిచేస్తోంది. తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు, తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా, రాష్ట్రంలో ప్రతి ఎకరా సాగుభూమికి సాగునీరు, అన్ని గ్రామాలకు తాగునీరు అందించాలన్న సీఎం కేసీఆర్ కల త్వరలోనే సాకారం కానుంది. ప్రజల ఆశలు నెరవేరనున్నాయి.

ఆంధ్ర ప్రాంతంలో వరి సాగుకు సాగునీటి కాలువలు అందుబాటులో ఉన్నాయి. మొదటి నుంచి ప్రభుత్వ ఆధ్వర్యంలో అవసరం ఉన్నా లేకున్నా అధికంగా నీటిని విడుదల చేయడంతో వృథాగా పోయే నీరే ఎక్కువ. దీనిని బట్టి కిలో వరి ధాన్యం ఉత్పత్తికి వాడబడుతున్న నీటి పరిమాణం చాలా ఎక్కువనే చెప్పాలి. అయితే ఎకరాలో సాగునీటి ఆధారంగా పండించటంలో అవసరమయ్యే నీటితో రెండు ఎకరాల్లో ఆరుతడి వరి వేయవచ్చు. ఆరుతడి పంటకు అవసరమయ్యే నీరు తక్కువ, నీటి వినియోగ సామర్థ్యం ఎక్కువ. అన్ని పంటల్లో బిందు, తుంపర సేద్యాల వాడకంతో అత్యధికంగా 80 – 90 శాతం నీటి వాడుక సామర్థ్యం తెలంగాణ రాష్ట్రం సాధిస్తుంది. ఇప్పటికే తెలంగాణలో కొంతమంది రైతులు వరిలోనూ తుంపర బిందు సేద్యాన్ని అవలంభిస్తున్నారు. నీటిని పొదుపుగా వాడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వరికి ప్రత్యేక పరిశోధనా స్థానాన్ని ఏర్పాటు చేసిన పాపాన పోలేదు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీల ప్రధాన కేంద్రంగా ఉన్న అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ తెలంగాణలో ప్రాంతీయ కేంద్ర ఏర్పాటుకు స్థలం ఇవ్వమని కోరితే, నిరాకరించి అన్యాయం చేశారు. అత్యంత వైవిధ్యమైన వరి రకాలు తెలంగాణలో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అంతగా అనుకూలం కాని సన్నరకం బియ్యాన్నిచ్చే బీపీటీ 5204ను బలవంతంగా ఇక్కడి రైతులపై రుద్దారు. ఈ రకానికి సోకని రోగమంటూ లేదు. సగానికిపైగా పెట్టుబడి ఖర్చులు వాటి నివారణకే వాడాల్సి వస్తుంది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన తెలంగాణ సోన రైతులకు సిరులు కురిపిస్తున్నది. ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ రకాన్ని భారీగా సాగుచేస్తున్నారు. ఈ రకం వరి సాగుకు ఆంధ్ర రైతులు కూడా క్యూ కడుతున్నారు. యాసంగిలో ఎక్కువ చలిలో తాలు గింజలు ఏర్పడి ధాన్యం నష్టం జరుగుతుంది. అటువంటి పరిస్థితుల్లోనూ దిగుబడిని ఇవ్వగలిగిన రకాలు జగిత్యాల, వరంగల్‌లోని పరిశోధనా సంస్థల్లో సిద్ధంగా ఉన్నాయి. తెలంగాణ అంతా విత్తనోత్పత్తికి అత్యంత అనుకూలం. వరిలో సూటి రకాలు, హైబ్రిడ్ రకాల విత్తనోత్పత్తి భారీగా తెలంగాణలోని వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో జరుగుతోంది. దేశంలో ప్రత్యేకించి దక్షిణ భారతదేశంలో వరిసాగుకు అత్యంత అనుకూల వాతావరణం ఉన్నది కాబట్టే భారతీయ వరి పరిశోధన సంస్థను తెలంగాణలో ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా అభివృద్ధి పరచిన వరిలో సూటిరకాలు, హైబ్రిడ్ రకాలను విడుదలకు ముందు ఇక్కడే పరీక్షిస్తారు. తెలంగాణ ప్రభుత్వం రైతు ప్రభుత్వం. రైతుల బాగుకోసం భారీ సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తిచేస్తోంది. తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు, తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా, రాష్ట్రంలో ప్రతి ఎకరా సాగుభూమికి సాగునీరు, అన్ని గ్రామాలకు తాగునీరు అందించాలన్న సీఎం కేసీఆర్ కల త్వరలోనే సాకారం కానుంది. ప్రజల ఆశలు నెరవేరనున్నాయి.

◆ శీలోజు యాదగిరి


## మన లేఖలు

### పవన్‌తో నడిచేందుకు సిద్ధం...కానీ...?

దేశంలో సేనలు అనే పేరుతో అనేక రకమైన పేర్లతో వాడుకలోకి వచ్చాయి. ముఖ్యంగా మహారాష్ట్రలో శివసేన అనే పేరుతో పెద్ద ఎత్తున ఉద్యమం లేవనెత్తడం జరిగింది. ఇది ముఖ్యంగా మహారాష్ట్రలో స్థానికులకే ఉద్యోగాలు అన్న వినాదంతో ముందుకు వచ్చింది. ఇది ప్రజలలో ఉన్న అశాంతి పెద్ద ఎత్తున హింసాయుత కార్యక్రమాలు చేపట్టింది. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఇతర ప్రాంతాలలో నుంచి వచ్చిన వారిని వెనక్కి వెళ్ళాలని డిమాండ్‌చేసింది. ఆ విధంగా దేశంలో సేన పేరుతో వచ్చిన పదాలు విస్తృతం అయ్యాయి. అల్లాఉద్దీన్ మధ్యయుగంలో సేనల పేరుతో దేశంలోకి వచ్చి, సంపదను దోచకున్నాడు. 1991లో కూడా కరసేన అనే పేరుతో పెద్ద ఎత్తున హింసాయిత కార్యక్రమాలు చేపట్టినట్టు వార్తలు వచ్చా యి. ఈ మధ్య తెలుగు రాష్ట్రాలలో ప్రజలలో వాడుకలలోకి వచ్చిన పదం జనసేన. ఈ జనసేన అనే పదం ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో ప్రత్యామ్నాయ పార్టీగా ఏర్పడడానికి ప్రయత్నిస్తుంది. దీని వ్యవస్థాపకుడు పవన్‌కళ్యాణ్. కేంద్ర, రెండు తెలుగు రాష్ట్రాల మద్దతుతో కార్యచరణను నడిపారు. ఇతర రాష్ట్రాలలో కూడా సినీ పరిశ్రమలకు చెందిన వ్యక్తులు రాజకీయాలలోకి వస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో అనేక రకమైన సమస్యలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో బహుళ ప్రచారంలోకి వచ్చిన పార్టీ జనసేన. 2014లో పవన్ కళ్యాణ్ స్థాపించారు. ఆయనకు అంతకుముందు ఎలాంటి రాజకీయ పరిజ్ఞానం కానీ, సామాజిక పరిజ్ఞానంకానీ లేదు. ప్రజల భావోద్వేగాలను ప్రసరింపజేయడంలో నైపుణ్యం కలవాడు. మానవీయ విలువలపైగాని, ఆర్థిక విషయాల పైనగాని ఎలాంటి పరిజ్ఞానం లేదు. కేవలం సినీ గుర్తింపు వల్లనే ప్రాచుర్యంలోకి వచ్చారు. ప్రస్తుతం తెలుగు సమాజంలో అనేక రకమైన సమస్యలు వెంటాడు తున్నాయి. ఆకలి, అవిద్య, అజ్ఞానం తెలుగు సమాజంలో నేటికి కొనసాగుతున్నాయి. ఉత్తర తెలంగాణలో ఓపన్‌కాస్ట్ పేరిట పర్యావరణ విధ్వంసం జరుగుతోంది. దక్షిణ తెలంగాణలో నల్లగొం డలో ఫ్లోరైడ్ బారిన పడుతున్నారు. రెండు ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంక్‌కు సహజ వనరులను తాకట్టుపెడుతున్నాయి. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, ఆరోగ్యం రోజురోజుకు అనేక షరతులతో చాలీచాలని సౌకర్యాలు కలిపిస్తూ మాత్రం కనిపిస్తోంది. 60 సంవత్సరాలలో తెలంగాణ 60 వేల కోట్లు అప్పులు అయితే మూడున్నర సంవత్సరాల లోపల 80 వేల కోట్లు అప్పులు చేయాల్సివచ్చింది. ఈ 80 వేల కోట్లను అనుఉత్పాదక రంగాలవైపు, ఇతర రంగాలకు మళ్ళించడం ఎంతవరకు సబబు. ఈ రోజు తెలంగాణలో పవన్ కళ్యాణ్‌కు కొన్ని ప్రశ్నలు ఎదురవుతున్నాయి. 1. ప్రపంచ బ్యాంక్ ఎజెండాపై మీరు శ్వేతపత్రాన్ని విడుదల చేయమని డిమాండ్ చేయండి. 2. తెలంగాణలో ఉన్న 4 లక్షల ఉద్యోగాలకు సంబంధించిన ప్రకటనను విడుదల చేయించండి. 3. పర్యావరణ విధ్వంసాలపై మీరు ఎందుకు ప్రశ్నించడం లేదు? 5. కార్పొ రేట్ వ్యవసాయంపై మీ అభిప్రాయం ఏమిటి? పోలవరం ప్రాజెక్ట్‌పై మీ అభిప్రాయం ఏమిటి? ప్రైవేట్ విశ్వవిద్యాలయాలపై మీ ఆలోచన ఏమిటి? పరుపతులపై మీ అభిప్రాయం ఏమిటి? రైతు ల గిట్టుబాటు ధరపై మీ అభిప్రాయం ఏమిటి? కామన్ స్కూల్ విధా నం పై మీ అభిప్రాయం ఏంటి? ఇవన్నీ ప్రజలలోకి వచ్చి విశ్వ విద్యా లయంలో మాలాంటి పరిశోధక విద్యార్థులమైన మేము పై ప్రశ్నలకు సరైన శాస్త్రీయ సమాధానం చేప్తె మేము మీతో వస్తాం! మీ అడుగులో అడుగై మీ పార్టీ విజయం సాధించే వరకు నిరంతరం కృషి చేస్తాం.

– ముత్తన్న గారి రాజేందర్ రెడ్డి
పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం,
9908240768

## మంచిమాట



'స్వీయ గౌరవం స్వావలంబనతో కలుగుతుంది.'

– మౌలానా అబుల్ కలాం ఆజాద్

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com
చిరునామా : Manam Telugu Daily, D.No. 6-3- 864/4/B, SBN Acrade 4th & 5th floor, Green lands, opp. Green park Hotel, Hyderabad, 500016, Telangana.

# సంపన్నుల కోసమే సంస్కరణలు

ప్రపంచీకరణ నూతన ఆర్థిక విధానాలు, సంస్కరణలు ఫలాలు నేటి ప్రపంచంలో అత్యధిక సంపద కొద్దిమందికే పరిమితమవుతుంటే, పేద మధ్య తరగతి ప్రజానీకం ఆదాయాలు భారీగా తగ్గిపోతున్నాయి. అక్స్‌ఫామ్ సర్వే చేదునిజాలు వెల్లడించింది. కేంద్ర ఆర్థిక విధానాల్లో తప్పిదాలను ఎత్తిచూపింది. దావోస్‌లో మోదీ ప్రసంగానికి కొన్ని గంటల ముందే వాస్తవాలు చెప్పింది. పాలకులు ఇప్పుడైనా కళ్లు తెరవాల్సిందే. ఈ నివేదిక ప్రకారం మోదీ ప్రభుత్వం దేశంలో అత్యధికులుగా ఉన్న పేద మధ్య తరగతి ప్రజలకు కాకుండా సంపన్నులకే మేలు చేస్తోందని ఆందోళన కలుగుతోంది. ఆర్థిక అసమానలు పెరిగిపోతున్నాయి. భారత్‌లోని ఒక్క శాతం ధనికుల సంపద 2017లో రూ.20.9 లక్షల కోట్లు పెరిగింది. ఇది ఒకే సంవత్సరం కేంద్ర బడ్జెట్‌తో సమానం. ఒక్కశాతం మంది వద్ద దేశంలో దాదాపు 73 శాతం సంపద పోగవటం ఆందోళన కల్గిస్తోంది. ఇదే సమయంలో 67 కోట్ల మంది భారతీయుల సంపద కేవలం ఒక్క శాతం మాత్రమే పెరగటాన్ని సర్వే గుర్తించింది. 2017లో భారత్‌లో లక్షాధికారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపింది. 2010 నుంచి భారత్‌లో బిలియనీర్ల సంపద ఏడాదికి సగటున 13 శాతానికి పెరిగిందని విశ్లేషించింది. పాశ్చాత్య దేశాలతో పాటు భారత్, పశ్చిమాసియా, బ్రెజిల్, బంగ్లాదేశ్, సోమాలియా, లిబియా, సిరియా ఆయా దేశాల లోనూ ఆదాయపరమైన ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. బ్లూమ్‌బర్గ్ తెలిపిన వివరాల ప్రకారం 500 మంది అంతర్జాతీయ కుబేరుల జాబితాలో ఇరవైఐదు మంది భారతీయులున్నారు. అంతర్జాతీయ జాబితాలో 20వ స్థానంలో రిలయన్స్ అంబానీ నిలిచారు. ఒక్క సంవత్సరంలో 76.3 శాతం 1704 కోట్ల డాలర్లు పెరిగి 4,001 కోట్ల డాలర్లకు చేరింది. బ్లూమ్ బర్గ్ భారతీయుల సంపన్నుల జాబితాలో ముఖేష్ అంబానీ తరువాత వరసగా లక్ష్మీమిత్తల్, ప్రేమ్‌జీ, శివనాదర్, పలోంజీ మిస్త్రీ, అజీంషంఘ్వీ గౌతమ్, దీలీప్ అంబానీ లున్నారు. అత్యంత ధనికులు కావడానికి ముఖ్య కారణం స్టార్ మార్కెట్లు పెరిగిపోవడమే అని బ్లూమ్ బర్గ్ విశ్లేషించింది, లబ్ధి పొందింది కూడా వీరే. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్, అలీబాబా టెన్సెంట్ కంపెనీల అధిపతులు, సాఫ్ట్‌వేర్ స్మార్ట్‌ఫోన్ సహాయంతో తమ వస్తువులను విస్తృతంగా ప్రచారం నిర్వహించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా కొనుగోలు చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. అమెజాన్ అధినేత జెఫీ బెజూసీ 3.402 కోట్ల డాలర్లు పెరిగాయి. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌ను రెండో స్థానానికి నెట్టి ప్రపంచ సంపన్నుడిగా ముందు వరసలో నిలిచారు. 2016లో బెజోసీ నికర విలువ 9.906 కోట్ల డాలర్లు. గట్స్ విలువ 9.013 కోట్ల డాలర్లు. టెకీ సంస్థల ఆదాయం పెరిగిపోతోంది. పేద సంపన్న దేశాల్లో ప్రజల తలసరి



ఆదాయాలు క్షీణించిపోతున్నాయి. కోట్లకు పడగలెత్తిన టెక్నాలజీ కంపెనీలు ఉద్యోగాల కొరత సృష్టిస్తున్నాయి. దీంతో నిరుద్యోగం అంతులేకుండా పెరిగిపోతుంది. టెక్నాలజీ మారినప్పుడల్లా పాత వారి ఉద్యోగాలు కోల్పోవడం అనవాతిగా మారిపోయింది. 1979లో జనరల్ మోటర్స్ సంస్థ అమెరికాలో 8,50,000 మంది ఉద్యోగులను నియమిస్తే నేడు మైక్రోస్టాఫ్ట్ ప్రపంచ వ్యాప్తంగా నియమించిన ఉద్యోగుల సంఖ్య గూగుల్‌లో 50 వేల మంది ఫేస్‌బుక్‌లో ఐదువేల మంది పని చేస్తున్నారు. మెకిన్సె గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అంచనా ప్రకారం కార్మిక శాఖలో 40 కోట్ల మంది 2030 వరకు ఉద్యోగాలు ఉడిపోయి నిరుద్యోగులుగా మారుతారు. 2017లో బిలియనీర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. 17 మంది కొత్తగా బిలియనీర్ల అవతరించారు. దీనిమూలంగా అపర కుబేరుల సంఖ్య 101 నుంచి 118 చేరింది. దేశంలో ధనికుల సంపద 4.89 లక్షల కోట్లలో పెరిగింది. విద్య, వైద్యం ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 85 శాతం ఉపాధి కార్మిక రంగాల్ని భారత్ నమ్ముకుంటే ఎన్నో ఉద్యోగాలు కొత్తగా ఏర్పడుతాయని సర్వే సూచించింది. సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడటం, వ్యవసాయాన్ని పరిరక్షించడం ద్వారానే ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు దోహద పడుతుందని సర్వే వివరించింది. ప్రపంచ వ్యాప్తంగా సంపదలో 82 శాతం ధనవంతులైన ఒక్క శాతం మంది వద్దకు కేవలం చేరిందని సర్వే అంటుంది. ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారు. పేదలు మరింత పేదవాళ్లుగా మారుతున్నారని నివేదిక చేదునిజాన్ని వెల్లడించింది. ప్రధాని నరేంద్రమోడీ గెలుపును విదేశీ, స్వదేశీ సామ్రాజ్యావాదులు తమ దోపిడీకి దర్జాగా వాడుకుంటున్నారు. ప్రజల దోపిడికి ప్రపంచ కార్పొరేట్ సామ్రాజ్య వాదానికి భారత్ కోటీశ్వరులకు ప్రధాని కావాలి. భారత్‌దేశంలో 70 శాతం ప్రజల్ని బిచ్చగాళ్లను చేశారు. రేషన్ షాపులలో బ్యాంకులలో పెన్షన్ల కోసం ప్రభుత్వ దయా దక్షిణాల కోసం క్యూ కడుతున్నారు. ప్రజల్ని పాలకులు బిచ్చగాళ్లగా మార్చివేసి తమ దోపిడీకి తెరలేపారు. 2017లో సాంకేతిక పరిజ్ఞాని అగ్రస్థానంలో ఉంది. రైతులు, నిరుద్యోగులు కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి చావులు పెరిగి పోతున్నాయి. సంస్కరణల పుణ్యమా నేడు ఆర్థిక వ్యత్యాసాలు పెరుగుతుంటే పాలకులు కులాల పేరిట డబ్బు వెదజల్లుతున్నారు. దేవుళ్ల పేరుతో ముడుపులు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు గాఢ నిద్ర నుంచి మేల్కొని కార్పొరేట్లకు కొమ్ముకా యడం కాదు పేదరికాన్ని నిర్మూలించడానికి అడుగులు వేయాలి.

◆ దామరపల్లి నర్సింహారెడ్డి
9581358696

## కవిత



### బడ్జెట్ బిక్ష!

అంచనాలు
భారీగా ఉన్నప్పుడల్లా
బడ్జెటెప్పుడు అందని ద్రాక్షలే!

ఎడం చేత్తో విదిలిస్తూ
కుడి చేత్తో లాగేసుకోవడం
పాలకుల హస్త లాఘవమే!

కేటాయింపులూ లెక్కలూ
అన్నీ అద్భుతాలే ఆకర్షణీయాలే
వినియోగ చరిత్రే అంతా అస్తవ్యస్తం!

ఎన్నికల గంట మోగందే
తాయిలాల ప్రకటనలు రాలవు
అధికార దాహం అంతాయింతా కాదు!

అన్నీ ఉచితం
ప్రజా రాజ్యంలో పాలకుల దయ
ఎంత సముచితమో!

తరాలు గడుస్తున్నా
ప్రజలకిట్లా 'భిక్షాం దేహీ' మంత్రోపదేశం
ఇంకెంత కాలం బోధిస్తారో!!

– కొట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261.




# తెలుగు రాష్ట్రాల ఆశలు ఆవిరి

## కేటాయింపులు అంతంత మాత్రమే.. నిరాశ మిగిల్చిన జైట్లీ బడ్జెట్


- విభజన హామీల మాటే కరువు
- ఎన్నికల ముందు కీలక పద్దు
- ఏపీ రాజధాని నిధులు ఊసేలేదు
- ద్రవ్యలోటు.. పోలవరం కనుమరుగు
- తెలంగాణపైనా కరుణ చూపని కేంద్రం
- ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలు చేసిన వైనం
- బయ్యారం ఉక్కు.. ప్రాణహిత-చేవెళ్లకూ సున్నా
- 2 వర్సిటీలకు నిధులు తప్ప ఒరిగింది శూన్యం

న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి 1: తెలుగు రాష్ట్రాల ఆశలపై విత్త మంత్రి అరుణ్ జైట్లీ నీళ్లు చల్లేశారు. ఎన్నికల ముందు వస్తున్న పూర్తిస్థాయి బడ్జెట్‌లో కొత్త ఏర్పడిన రాష్ట్రాల ఆకాంక్షలు, అభివృద్ధికి పెద్దపీట వేస్తారని ఇరు ప్రభుత్వాలు ఆశించాయి. ఇరు రాష్ట్రాలకూ అత్యంత కీలకమైన ఈ బడ్జెట్‌లో విభజన హామీలకు పెద్ద ఎత్తున నిధులు వస్తాయని ఎదురుచూశాయి. కానీ అరుణ్ జైట్లీ తెలుగు నేలపై కొంచెం కూడా కరుణ చూలేదు.

విభజన హామీల మాట దేవుడెరుగు.. సాధారణ కేటాయింపుల జాడ కూడా లేదు. రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లు గడుస్తోంది.. ఇంకో ఏడాదిలో మళ్లీ ఎన్నికల వచ్చేస్తున్నాయి. ఈ తరుణంలో వచ్చిన కేంద్ర బడ్జెట్‌పై ఇరు తెలుగు రాష్ట్రాలు గంపెడాశలు పెట్టుకున్నాయి. నాలుగేళ్లుగా కేంద్రం అంతంత మాత్రంగానే నిధులిస్తున్నా.. ఈ సారి ఓటర్ల ఆకర్షణ కోసమైనా మరిన్ని కేటాయింపులు ఉంటాయని ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా ఆశించారు. కానీ ఈ బడ్జెట్‌లోనూ అరుణ్ జైట్లీ ఉసూరుమనిపించారు. ఏపీలో విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ప్రకటన ఉంటుందని భావించినా.. ఆ ఊసేలేకపోవడం నిరాశపరిచింది. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం, విభజన హామీల్లో భాగంగా రావాల్సిన నిధుల కేటాయింపు కనబడలేదు. ఏపీకి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన పోలవరం నిర్మాణం 2019లోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో దానికి నిధుల కోసం పంపిన ప్రతిపాదనలకు మోక్షం కలుగుతుందని ఆశించినా ఫలితం లేకపోయింది. రాజధాని నిర్మాణానికి నిధులు, ఆర్థిక సంఘం నిధులు, ద్రవ్యలోటును భర్తీ చేసేందుకు సాయం, పారిశ్రామిక ప్రోత్సహకాలు... ఇలా గంపెడు ఆశలు పెట్టుకున్న ఏపీ ప్రభుత్వానికి నిరాశ కలిగింది. మరోవైపు అమరావతి, విశాఖ మెట్రో.. ఊసులేని బడ్జెట్‌లో ఈ ఏడాదిలో ఎన్నికలు రాబోతున్న కర్ణాటక రాజధాని బెంగళూరు మెట్రోకు ఏకంగా రూ.17 వేల కోట్లు ఇవ్వడం గమనార్హం. ఏవో 4 కేంద్ర విద్యాసంస్థలకు అరకొర నిధులు రాల్చిన జైట్లీ.. రాష్ట్రం పంపిన ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలు చేయడంతో ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు గుర్రుగా ఉన్నారు.

**తెలంగాణ ఆశలకూ గండి**

కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ పెట్టుకున్న ఆశలకూ గండిపడింది. ఏపీతో పోలిస్తే తెలంగాణకు కనీసం మొత్తంలో కూడా నిధులు రాలేదు. ప్రాణహిత-చేవెళ్లను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని, బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎయిమ్స్ హామీలకు ఈ బడ్జెట్ మోక్షం కలిగిస్తారనుకుంటే నిరాశే మిగిలింది. ఇక మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు నిధుల కేటాయింపు పైనా చాలా కాలంగా తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్నికోరుతూ వస్తున్నా బడ్జెట్‌లో ఆ దిశగా ఎలాంటి చర్యలూ లేకపోవడంతో నిరాశ ఎదురైంది. రూ.36 వేల కోట్లతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా.. అందులో పావువంతు నిధులు కూడా దక్కలేదని నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం గా బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా తెలుగు రాష్ట్రాల పేర్లు వినిపించకపోవడంపై తెలుగు ప్రజలు కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





### రూపాయి రాక (పైసల్లో)

1) అప్పులు : 19
2) కార్పొరేషన్ పన్ను : 19
3) ఆదాయపు పన్ను : 16
4) కేంద్ర ఎక్సైజ్ పన్ను : 8
5) జీఎస్టీ, ఇతర పన్నులు : 23
6) పన్నేతర ఆదాయం : 8
7) కస్టమ్స్ : 4
8) రుణేతర మూలధన వసూళ్లు : 3

### రూపాయి పోక(పైసల్లో)

1) ఇతర ప్రణాళికేతర వ్యయాలు: 8
2) పెన్షన్లు : 5
3) పన్నులు, డ్యూటీల్లో రాష్ట్రాల వాటా: 24
4) రక్షణ రంగం: 9
5. సబ్సిడీలు: 9
6.రాష్ట్రాలు, యూటీలకు ప్రణాళిక సహకారం : 24
7. కేంద్రం అందించే పథకం : 9
8. కేంద్ర రంగ పథకం : 10
9. వడ్డీ చెల్లింపులు : 18
10. ఫైనాన్స్ కమిషన్ ఇతర ట్రాన్స్‌ఫర్స్ : 8




## కేటాయింపులు ఇలా

### ఏపీలో కేంద్ర వర్సిటీలకు నిధులు

బడ్జెట్‌లో విశాఖ రైల్వే జోన్ ఊసెత్తకుండా ఏపీ ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిన జైట్లీ పలు విద్యాలయాలకు నిధులు కేటాయించి కొంత ఊరటనిచ్చారు. ఏపీలో సెంట్రల్ యూనివర్సిటీకి రూ.10 కోట్లు, నిట్‌కు రూ.54 కోట్లు, ఐఐటీకి రూ.50 కోట్లు, ఐఐఎంకు రూ.42 కోట్లు, ట్రిపుల్ ఐటీకి రూ.30 కోట్లు, ఐఐఎస్‌సీఆర్‌కు రూ.49 కోట్లు, గిరిజన వర్సిటీకి రూ.10కోట్లు కేటాయించారు. అలాగే ఇండియన్ ఇన్‌స్టిట్యూ ట్ ఆఫ్ ప్యాకేజింగ్‌కు రూ.5కోట్లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియంకు రూ.32 కోట్లు నిధులు ఇచ్చారు. ఇక డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు రూ.19.62 కోట్లు, విశాఖ పోర్టుకు రూ.108 కోట్లు నిధుల ఇచ్చి సరిపెట్టారు.

## తెలంగాణకు కేటాయింపులు

తెలంగాణలోనూ నీటి పారుదల, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులు ఇవ్వని జైట్లీ పలు వర్సిటీలకు కేటాయింపులు జరిపారు. గిరిజన యూనివర్సిటీకి రూ. 10 కోట్లు, హైదరాబాద్ ఐఐటీకి రూ.75 కోట్లు కేటాయించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు సమీపంలోని జాకారంలో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నారు. కాగా తెలంగాణ ప్రాజెక్టులు, డిమాండ్ల గురించి జైట్లీ ఎలాంటి ప్రకటన చేయలేదు.



### ధరలు పెరిగే ఉత్పత్తులు/సేవలు

కార్లు, మోటార్ సైకిళ్లు
మొబైల్ ఫోన్లు
వెండి
బంగారం
సన్ స్క్రీన్
పాదరక్షలు
సన్ గ్లాసెస్
సోయా ప్రోటీన్ కాని ఇతర ఆహార పదార్థాలు
సుగంధాలు
రంగు రత్నాలు
వజ్రాలు
స్మార్ట్ గడియారాలు
ఎల్‌సీడీ/ఎల్ఈడీ టీవీ ప్యానెల్లు
దంత ఉత్పత్తులు
సిల్క్ ఫ్రాబిక్స్
పర్నీచర్
పరుపులు
లాంప్స్
అన్ని రకాల గడియారాలు
ట్రై సైకిల్, స్కూటర్లు, పెడల్ కార్లు, చక్రాల బొమ్మలు
స్విమ్మింగ్ పూల్ సామగ్రి
సిగరెట్, లైటర్లు, కొవ్వొత్తులు
వంట నూనెలు

### ధరలు తగ్గే ఉత్పత్తులు/సేవలు

జీడిపప్పు ముడి పదార్థాలు,
కాంక్లియర్ ఇంప్లాంట్స్ తయారీలో ఉపయోగించే భాగాలు, ఉపకరణాలు
సోలార్ ప్యానెల్స్/మాడ్యూల్స్ కోసం ఉపయోగించే సౌర స్వభావిత గాజు
కొన్ని క్యాపిటల్ గూడ్స్,
ఎలక్ట్రానిక్ ఉత్పతులు



# ఉద్యోగులకు తీవ్ర నిరాశ

## ఆదాయపన్ను శ్లాబ్‌లు యథాతథం

**రూ. 40వేల స్టాండర్డ్ డిడక్షన్ అదనం.. సీనియర్ సిటిజన్ల వైద్యఖర్చుకు రాయితీ**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బీజేపీ ఈసారికి ప్రవేశపెడుతున్న చిట్టచివరి బడ్జెట్.. అది కూడా ఎన్నికల సంవత్సరానికి ముందు వస్తోంది కాబట్టి ఆదాయపన్ను పరిమితిని భారీగా పెంచుతారని ఆశలు పెట్టుకున్న ఉద్యోగులకు తీవ్ర నిరాశ ఎదురైంది. వేతనజీవుల ఆశలపై జైట్లీ నీళ్లు చల్లారు. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితులను ఏమాత్రం మార్పు చేయకుండా.. యథాతథంగా ఉంచారు. ప్రయాణ, వైద్య ఖర్చులకు మాత్రం రూ.40వేల వరకు స్టాండర్డ్ డిడక్షన్ అదనంగా ఇస్తామన్నారు. దాంతో పాటు.. సీనియర్ సిటిజన్ల వైద్య ఖర్చులకు పెట్టే మొత్తం మీద అదనపు రాయితీ అందిస్తామని తెలిపారు. ఈ నిర్ణయంతో రెండున్నర కోట్ల మంది వేతన జీవులు, ఉద్యోగులు, పింఛనుదారులకు లబ్ధి కలుగుతుందని ఆయన అన్నారు. వ్యక్తిగత పన్ను మినహాయింపుల పరిమితులను ఈ బడ్జెట్‌లో పెంచబోతున్నారని, దీంతో తమకు ఎంతో మేలు కలుగుతుందని వేతనాలు పొందే ఉద్యోగులు ఈసారి బాగా ఆశించారు. కానీ పన్ను పరిమితులను అలాగే ఉంచడం దారుణమని ఉద్యోగ సంఘాల నేతలు తీవ్రంగా మండిపడ్డారు. అసలు ఆదాయపన్ను పరిమితిని 5 లక్షలు చేస్తామని కూడా బీజేపీ మొదట్లో చెప్పిందని.. ఇప్పుడు మాత్రం ఆ ప్రస్తావన లేకపోవడం దారుణమని అన్నారు.

# సాగుకు ప్రాధాన్యం

ఉత్పాదక వ్యయానికి ఒకటిన్నర రెట్లు ఎక్కువ ఉండేలా కనీస మద్దతు ధరలను నిర్ణయిస్తామని, అది ఈ రబీ నుంచే అమలు చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ ప్రకటించారు. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చే చర్యలను కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు. వచ్చే ఏడాది రూ. 11 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలను అందచేస్తామని జైట్లీ వెల్లడించారు. గత బడ్జెట్‌లో రైతులకు రూ. 10 లక్షల కోట్లు వ్యవసాయ రుణాలు ప్రకటించగా, 2018-19 బడ్జెట్‌లో రూ. లక్ష కోట్ల మేర రుణ వితరణ పెంచారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే చర్యలు చేపడతామన్నారు. వ్యవసాయం, గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతమే తమ ప్రాధాన్యతలని స్పష్టం చేశారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కేంద్రం కట్టుబడిఉందని అరుణ్ జైట్లీ ప్రకటించారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలకు పలు పథకాలను ఆయన ప్రకటించారు. ఆపరేషన్ గ్రీన్‌తో పాటు పాడి పరిశ్రమ, మత్స్యపరిశ్రమ కోసం పలు కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. మార్కెట్ ధరలు మద్దతు ధరల కంటే తక్కువ ఉంటే ప్రభుత్వమే ఆయా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందన్నారు. గ్రామీణ వ్యవసాయ మార్కెట్లకు రూ.2000 కోట్లు, మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖలకు రూ.10,000 కోట్లు కేటాయించారు. ఇక గ్రామీణ పారిశుద్ధ్య పథకానికి రూ.16,713 కోట్లు, జాతీయ జీవనోపాధి కార్యక్రమానికి రూ.5,750 కోట్లు కేటాయించారు. వృద్ధి రేటును నిలకడగా కొనసాగిస్తూ రాబోయే సంవత్సరాల్లో 8 శాతానికి పైగా వృద్ధి సాధించే దిశగా వ్యవస్థాగత సంస్కరణలను చేపడుతున్నట్టు తెలిపారు.






## బడ్జెట్ స్వరూపం


(రూ.కోట్లలో)

| | 2016-17 వాస్తవాలు | 2017-18 బడ్జెట్ అంచనాలు | 2017-18 సవరించిన అంచనాలు | 2018-19 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| రెవెన్యూ ఆదాయం | 1374203 | 1515771 | 1505428 | 1725738 |
| మూలధన ఆదాయం | 600991 | 630964 | 712322 | 716475 |
| మొత్తం ఆదాయం | 1975194 | 2146735 | 2217750 | 2442213 |
| మొత్తం వ్యయం | 1975194 | 2146735 | 2217750 | 2442213 |
| రెవెన్యూ లోటు | 316381 | 321163 | 438877 | 416034 |
| విత్త లోటు | 535618 | 546531 | 594849 | 624276 |
| ప్రాథమిక లోటు | 54904 | 23453 | 64006 | 48481 |

# రైల్వే జోన్ ఊసే లేదు

హైదరాబాద్, ఫిబ్రవరి 1: కేంద్ర వార్షిక బడ్జెట్‌లో భాగంగా రైల్వే లైన్లు, ప్రాజెక్టులకు సంబంధించి తెలుగు రాష్ట్రాలకు పెద్దగా ప్రాధాన్యం లభించలేదు. అత్తెసరు కేటాయింపులు, ప్రాజెక్టులతో కేంద్రం తెలుగు రాష్ట్రాలను నిరాశపరిచిందనే విమర్శలు వచ్చాయి. విశాఖ రైల్వే జోన్ అంశాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఇక హైదరాబాద్ ఎంఎంటీఎస్ రెండో దశ పనులకు 641 కోట్ల రూపాయలు అంచనా వ్యయం కాగా, బడ్జెట్‌లో రూ. 100 కోట్లు కేటాయించారు. అయితే ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న కర్ణాటకలో బెంగళూరు మెట్రోకు 17 వేల కోట్లు కేటాయించారు. తెలుగు రాష్ట్రాలకు కేంద్రం ప్రకటించిన కొత్త లైన్లు, ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టులకు చేసిన కేటాయింపులు

- కోటిపల్లి-నర్సాపూర్ కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుకు రూ. 430 కోట్లు
- విజయనగరం-స్తంభాలపూర్ మూడో రైల్వే లైన్‌కు రూ. 90 కోట్లు
- నడికుడి-కాళహస్తి కొత్త రైల్వే లైన్‌కు రూ. 340 కోట్లు
- కాజీపేట-విజయవాడ మూడో రైల్వే లైన్‌కు రూ. 100 కోట్లు
- నల్లపాడు-గుంతకల్లు లైను విద్యుదీకరణకు రూ. 150 కోట్లు
- విజయవాడ-గుడివాడ, మచిలీపట్నం-భీమవరం, నర్సాపూ ర్- నిడదవోలు రైల్వే లైన్ల డబ్లింగ్ పనులకు రూ. 122 కోట్లు
- విజయనగరం-రాయగడ-రాయపూర్ విద్యుదీకరణకు రూ. 120 కోట్లు
- విజయవాడ-గూడూరు మూడో లైన్‌కు రూ. 100 కోట్లు
- ఓబులవారి పల్లె-కృష్ణపట్నం కొత్త రైల్వే లైన్‌కు రూ. 100 కోట్లు
- గుంతకల్లు-బళ్లారి విద్యుదీకరణకు రూ. 70 కోట్లు
- కడప-బెంగళూరు రైల్వే లైన్ ప్రాజెక్టుకు రూ. 240 కోట్లు
- కాకినాడ-పిఠాపురం కొత్త రైల్వే లైన్‌కు రూ. 150 కోట్లు
- మునీరాబాద్-మహబూబ్‌నగర్ కొత్త రైల్వే లైన్‌కు రూ. 300 కోట్లు
- మనోహరాబాద్ (మేడ్చల్)-కొత్తపల్లి (కరీంనగర్) లైన్‌కు రూ. 350 కోట్లు
- అక్కన్నపేట-మెదక్ మధ్య 17 కిలోమీటర్ల రైల్వే లైన్‌కు రూ. 196 కోట్లు
- భద్రాచలం- సత్తుపల్లి కొత్త రైల్వే లైన్‌కు రూ. 300 కోట్లు
- కాజీపేట-బళ్లారి మూడో లైన్‌కు రూ. 160 కోట్లు
- సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులకు రూ. 50 కోట్లు
- హైదరాబాద్ ఎంఎంటీఎస్ రెండో దశకు రూ. 100 కోట్లు
- రూ. 5 కోట్లతో చర్లపల్లి స్టేషన్‌లో శాటిలైట్ టర్మినల్
- తెలంగాణలో నిర్మాణం కానున్న ఏ-1 స్టేషన్లు
- కాజీపేట, మంచిర్యాల, ఖమ్మం, వరంగల్



**ఏపీలో ప్లాట్‌ఫాం విస్తరించనున్న స్టేషన్లు**

రాయనపాడు, గుంతకల్లు, పలాస, మర్కాపూర్, పాకాల, పానపాకం, నక్కనదొడ్డి, పుల్లంపేట, సాలూరు, కొత్తవలస, లక్కవరపు కోట, ఎస్ కోట, శివలింగాపురం, బొద్దవర, బొర్రా గుహలు, అరకు, సిమిలిగూడ

### తెలంగాణలో ఆదర్శ స్టేషన్లు

రఘునాథపల్లి, బాసర, గద్వాల, కేసముద్రం, శంకర్‌పల్లి

తెలంగాణలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్న స్టేషన్లు

వనపర్తి, డోర్నకల్, లింగంపల్లి, కాజీపేట, ఆదిలాబాద్, నిజామాబాద్

### ఏపీలోని ఆదర్శ రైల్వే స్టేషన్లు

వినుకొండ, గుంటూరు, మంత్రాలయం రోడ్, మచిలీపట్నం, మర్కాపూర్ రోడ్, రాజమండ్రి, ఒంగోలు, దొనకొండ, ఆదోని, విశాఖ, దువ్వాడ, బొబ్బిలి, పార్వతీపురం, కడప, తిరుపతి, విజయవాడ, విశాఖ

**ఏపీలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్న స్టేషన్లు**

రేణిగుంట, ధర్మవరం, రాజమండ్రి, తుని, బేతంచర్ల




## అన్ని రైళ్లు, స్టేషన్లలో వై-ఫై

బడ్జెట్‌లో రైల్వే నెట్‌వర్క్ బలోపేతానికి, ప్రయాణికుల సామర్థ్యం పెంచడానికి ప్రాధాన్యం ఇచ్చారు. 2018-19 ఏడాదికి గాను రైల్వేకు 1,48,528 కోట్లు కేటాయించారు. 18 వేల కిలో మీటర్ల డబ్లింగ్ పనులు చేపట్టనున్నారు. భద్రతకు మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. 600 మేజర్ రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయనున్నారు. అన్ని రైల్వే స్టేషన్లు, రైళ్లలో వై-ఫై సౌకర్యం కల్పించనున్నారు. అలాగే సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ముంబై రైల్వే రవాణ వ్యవస్థకు 11 వేల కోట్లు, బెంగళూరు మెట్రోకు 17 వేల కోట్లు కేటాయించారు.

# నేనూ సై...

(మొదటి పేజీ తరువాయి)

వంద సీట్లు వస్తాయంటున్న కేటీఆర్... అన్ని స్థానాల్లో గెలవకపోతే ఏం చేస్తారో చెప్పాలన్నారు. రాజకీయమంటే అవకాశవాదం, విలాసవంతమైన జీవితం, మీడియా మేనేజ్‌మెంట్ వంటివేనని కేటీఆర్ భావిస్తున్నట్లుందని వ్యాఖ్యానించారు. సోనియాగాంధీ కుటుంబం గురించి, కాంగ్రెస్ గురించి మాట్లాడే నైతిక అర్హత ఆయనకు లేదన్నారు. రాహుల్ గాంధీ మూడు సార్లు ఎంపీగా ఉన్నా, పదేళ్లు కేంద్రంలో కాంగ్రెస్ పరిపాలించినా ఏనాడూ, ఏ పదవినీ ఆయన ఆశించలేదని గుర్తుచేశారు. దేశం కోసం ఇందిర, రాజీవ్ ప్రాణాలర్పించారని, నెహ్రూ తన ఆస్తులన్నీ దేశానికి రాసిచ్చారని చెప్పారు.

**అందినకాడికి దోపిడీయే కేసీఆర్ విధానం**

తెలంగాణ ఉద్యమం సందర్భంగా తన పిల్లలిద్దరూ అమెరికాలో ఉద్యోగాలు చేసుకుంటున్నారని, వారు రాజకీయాల్లో రారని కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. కానీ, జరిగిందేమిటని ఉత్తమ్ ప్రశ్నించారు. సోనియా దృఢసంకల్పం, వందలాది ప్రజల బలిదానం వల్లే తెలంగాణ వచ్చిందన్నారు. అహంకారంతో కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్న కేటీఆర్ తీరును ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. అధికారం ఉన్నది ఎంజాయ్ చేయడానికి, అందినకాడికి దోచుకోవడానికేనన్నదే కేసీఆర్ విధానమని విమర్శించారు. కేటీఆర్ తనపై అదే పనిగా విమర్శలు గుప్పిస్తున్నాడని, తాను ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్‌గా ప్రాణాలు పణంగా పెట్టి దేశ సరిహద్దులో పోరాడిన సైనికుడినని గుర్తుంచుకోవాలని సూచించారు. కేసీఆర్, కేటీఆర్‌లాగా దోచుకోవడానికి రాజకీయాల్లోకి రాలేదన్నారు. తనకు పిల్లలు కూడా లేరని, ప్రజా సేవ చేసేందుకే వచ్చానని స్పష్టం చేశారు.

**రాష్ట్రంలో దారుణంగా హక్కుల ఉల్లంఘన**

తెలంగాణలో మానవ హక్కుల ఉల్లంఘన దారుణంగా ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన కోదండరామ్, గద్దర్, విమలక్క వంటివారంటే పాలకులకు గౌరవం లేదని విమర్శించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మందకృష్ణను జైలుకు పంపారని, విమర్శించే వారిపై ఉక్కుపాదం మోపేందుకు 506, 507 సెక్షన్లను సవరిస్తున్నారని పేర్కొన్నారు. వారి పాలన నిజంగా అద్భుతమైతే విమర్శలను ఎందుకు సహించలేకపోతున్నారో చెప్పాలని నిలదీశారు. తమ హయాంలో అదే సెక్షన్లను కేసీఆర్‌పై ప్రయోగిస్తే ఎన్ని సంవత్సరాలు జైల్లో ఉండేవారో చెప్పాలన్నారు. ఇదో బూటక ప్రభుత్వమని, రాష్ట్రంలో 99 శాతం ప్రజలకు ఎలాంటి ప్రయోజనం




కలగడంలేదని చెప్పారు. రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం నడుస్తోందని, కేసీఆర్‌ను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోందని, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను పోలీసులను ఉపయోగించి బెదిరిస్తున్నారని, వ్యాపారాలు చేసుకోనివ్వడం లేదని చెప్పారు. నాలుగు కోట్లమంది ప్రజలకు బదులు నలుగురు మాత్రమే బాగుపడితే చాలన్నట్లు పాలన ఉందన్నారు. మొత్తం తెలంగాణ సమాజాన్ని అణచివేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మిషన్ భగీరథ, ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల్లో కేసీఆర్ కుటుంబానికి ఆరు శాతం కమీషన్ ముట్టనిదే పనులు ముందుకు సాగడం లేదని ఉత్తమ్ ఆరోపించారు. ఖమ్మంలో కాంగ్రెస్ కార్యకర్త హత్య కేసుల ప్రధాన నిందితుడు హోంమంత్రితో తిరుగుతున్నాడని, ఫోటోలు ఫేస్‌బుక్‌లోనూ పెట్టాడని చెప్పారు. టీఆర్ఎస్‌లో చేరని కారణంగానే నల్లగొండ జిల్లాలో శ్రీనివాస్‌ను హత్య చేయించారన్నారు. అధికారం ఉందని ఇష్టం వచ్చినట్లు చేస్తే తాము చూస్తూ ఉరుకోబోమని ఉత్తమ్ హెచ్చరించారు.

# వైవాలో వికృత చేష్టలు!

**ఎంటెక్ విదార్థినులపై లైంగిక వేధింపులు**

**జేఎన్టీయూ కాకినాడ ప్రొఫెసర్ అరెస్టు**

కాకినాడ, ఫిబ్రవరి 1 (మనం న్యూస్ బ్యూరో):

వైవాలో మంచి మార్కులు కావాలంటే తాను చెప్పినట్లు వినాలంటూ విద్యార్థినులపై జేఎన్టీయూ కాకినాడ ప్రొఫెసర్ వికృత చేష్టలకు దిగాడు. వారిని లైంగికంగా, మానసికంగా వేధించాడు. దీనిపై ఆ విద్యార్థినులు ఫిర్యాదు చేయడంతో అతడిని పోలీసులు అరెస్టు చేశారు. జేఎన్టీయూ-కాకినాడలో వీఎల్ఎస్ఐ, సీఎస్ విభాగాల్లో ఎంటెక్ ఫస్టియర్ చదువుతున్న 21 మంది విద్యార్థినులకు జనవరి 29, 30 తేదీల్లో ప్రొఫెసర్ కె.బాబులు వైవా నిర్వహించాడు. మధ్యాహ్నం 2 గంటలలోపే ముగించవలసిన పరీక్షలను నిబంధనలకు విరుద్ధంగా సాయంత్రం 5.30 గంటలకు చేపట్టాడు. మధ్యాహ్నం నుంచి 21 మంది విద్యార్థినులను నిరీక్షింపజేసి ఒక్కక్కొరిని తన చాంబర్‌లోకి పిలిపించుకుని వ్యక్తిగత విషయాలు అడుగుతూ లైంగిక వేధింపులకు దిగాడు. చేతులు నొక్కుతూ, శరీరంలోని వివిధ భాగాలను తాకుచూ ఇబ్బందికి గురిచేశాడు. అంతేకాకుండా విద్యార్థినుల ఫోన్ నంబర్లు తీసుకుని వారికి కాల్ చేసి వ్యక్తిగతంగా కలవాలని లేకుండా పరీక్షల్లో మార్కులు పడవని బెదిరించాడు. దీనిపై విద్యార్థినులు బుధవారం సర్పవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ప్రొఫెసర్ కె.బాబులుపై నిర్భయ కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని రాజమహేంద్రవరంలో అరెస్టు చేసి కాకినాడ స్పెషల్ మొబైల్ కోర్టు హాజరు పరిచగా.. కోర్టు రిమాండు విధించింది.



# ఎన్ని'కల' బడ్జెట్




(మొదటి పేజీ తరువాయి)

యోజన కింద 76 శాతం రుణాలు మహిళల పేరిటే ఉన్నాయి. అందులోనూ 50 శాతం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలే కావడంతో వారికి రుణవితరణ కోసం రూ.3 లక్షల కోట్లు కేటాయించి మురిపించారు. గ్రామీణ మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయ సంఘాల మహిళలకు రుణాలను 37 శాతం పెంచారు. వేతన జీవులైన మహిళలను కూడా ఆర్థిక మంత్రి మరచిపోలేదు. ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్)కి తమ వాటాకింద వేతనం నుంచి వారు జమచేయాల్సిన మొత్తాన్ని మూడేళ్లపాటు 12 శాతం నుంచి 8 శాతానికి తగ్గించారు. ప్రతి రాష్ట్రంలో ఒకటి వంతున 24 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మొత్తంమీద ప్రతి మూడు లోక్‌సభ నియోజకవర్గాలకు ఒకటి వంతున ఏర్పాటవుతాయని తెలిపారు. దీంతో దేశంలో వైద్యవిద్య డిమాండ్ తీరడమేగాక, ప్రభుత్వానికి విద్యార్థి లోకం మార్కులు కూడా పడతాయన్నది స్పష్టం. దేశంలోని 10 కోట్ల పేద కుటుంబాలకు ఏటా కేవలం రూ.330 రుసుముతో ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ.5 లక్షల బీమా కల్పించారు. దీనివల్ల దాదాపు 50 కోట్ల మందికి ప్రయోజనం.. సర్కారుకు ఓట్ల ధీమా కూడా తథ్యమేననడంలో సందేహం లేదు. అంతేగాక ప్రతి ఒక్కరికీ వైద్య సదుపాయం అందుబాటు దిశగా వెల్‌నెస్ సెంటర్లను నెలకొల్పుతామని, ఇందుకోసం రూ.1200 కోట్లు కేటాయిస్తున్నామని ప్రకటించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి కార్పొరేట్ పన్నును 5 శాతం తగ్గించి బీజేపీవైపు ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. మొత్తంమీద ఇది ఎన్నికల బడ్జెట్టేనన్నది ఆర్థికరంగ నిపుణుల విశ్లేషణ.

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది మొదలు ప్రభుత్వం అనేక వ్యవస్థాగత సంస్కరణలు చేపట్టిందని అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. దీనివల్ల ప్రపంచంలో అత్యంత వేగంగా పురోగమిస్తున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ ముందంజ వేసిందన్నారు. ఆ మేరకు నేడు 160 లక్షల కోట్ల స్థాయికి చేరిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) ద్వితీయార్థంలో 7.2 నుంచి 7.5 శాతం మధ్య వృద్ధి నమోదు కాగలదని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలో ఇప్పుడు ఏడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా పరిగణనలో ఉండగా త్వరలోనే ఐదో స్థానానికి దూసుకెళ్లగలదన్న ఆశాభావం వెలిబుచ్చారు. వాణిజ్య సౌలభ్యం




మెరుగు ఫలితంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గణనీయంగా పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడిక 'జీవన సౌలభ్యం' మెరుగుపై దృష్టి సారించామని తెలిపారు. దేశానికి సుపరిపాలన అందించడమే తమ ప్రథమ ప్రాథమ్యమని, వస్తుసేవల పన్నుద్వారా పరోక్ష పన్నుల వ్యవస్థను సరళీకరించామని గుర్తుచేశారు. దేశానికి నిజాయితీగల, పారదర్శక ప్రభుత్వాన్ని ఇస్తామని శపథం చేశామని, దీంతోపాటు పేదరిక నిర్మూలించి శక్తిమంతమైన భారతాన్ని నిర్మిస్తామని వాగ్దానం చేశామని తెలిపారు.

తయారీ రంగం కూడా మళ్లీ గాడిలో పడిందని, 2017-18లో ఎగుమతులు 15 శాతం పెరుగుతాయని అంచనా వేశామని చెప్పారు. వస్తుసేవల పన్ను (జీఎస్టీ)తో పరోక్ష పన్నుల వ్యవస్థ మరింత సరళంగా మారిందన్నారు. దీంతోపాటు పెద్దనోట్ల రద్దువంటి చర్యలతో ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలంలో మరింత బలం పుంజుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.



# ఉద్యోగులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)



బదిలీలకు ముహూర్తం కుదిరింది. దీనికి సంబంధించిన విధి విధానాలు ప్రకటిస్తూ.. ఉభయ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధానకార్యదర్శులు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్‌కు, అలాగే ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు తమ సొంత రాష్ట్రానికి వెళ్లాలని ఎంతో కాలంగా చూస్తున్నారు. వారికి ఊరట కల్పిస్తూ ఈ ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి దినేష్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి సంయుక్తంగా జారీచేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం ఎవరైనా ఉద్యోగులు అంతర్రాష్ట్ర బదిలీ కావాలనుకుంటే తమ జీవిత భాగస్వామి అక్కడ చేస్తున్నట్లు చూపించాలి. లేదా, అక్కడ పనిచేసే వేరే ఉద్యోగుల పరస్పర అంగీకారం (మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ )తో అయినా బదిలీ చేస్తారు. ఇందుకు సంబంధించి ఉద్యోగులు దరఖాస్తులు చేస్తే వాటిని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉద్యోగులు తమ బదిలీ దరఖాస్తులను ఆయా శాఖాధిపతులు ద్వారా సమర్పించాలి. దరఖాస్తులను 2018 జూన్ 30వ తేదీ వరకూ స్వీకరిస్తారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

తెలంగాణలో కుటుంబ సభ్యులు ఉండటం, వారి ఉద్యోగం అమరావతిలో (ఆంధ్రప్రదేశ్)లో చేయడం వల్ల తాము తమ కుటుంబ సభ్యులకు దూరం అవుతున్నామన్న భావన చాలాంది ఉద్యోగుల్లో ఉంది. అదే పరిస్థితి తెలంగాణలో పనిచేస్తూ ఎంతో కాలంగా తమ కుటుంబాలు ఆంధ్రప్రదేశ్‌లో స్థిరపడిన వారికి దూరం అయ్యామన్న ఉద్దేశంతో అక్కడి ఉద్యోగులు ఉన్నారు. తమను సొంత రాష్ట్రానికి పంపండి మహాప్రభో అంటూ ఎంతోకాలంగా వారు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఉత్తర్వులు వెలువడటం వారికి ఊరట కల్పించే అంశమే.

# పేదలకు ఆరోగ్య వరం

**ప్రతి కుటుంబానికి 5 లక్షల కవరేజీ**

**ఏడాదికి ప్రీమియం రూ. 330 మాత్రమే**

**10 కోట్ల కుటుంబాలకు వైద్య సదుపాయం**

**ప్రపంచంలో అతి పెద్ద ప్రభుత్వ వైద్యపథకం**

**ప్రతి రాష్ట్రంలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ**

**3 పార్లమెంటు స్థానాల పరిధిలో ఒక్కొక్కటి**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:

ఇన్నాళ్లూ పేద ప్రజలకు అందని ద్రాక్షగా ఉన్న వైద్య సదుపాయం వారందరికీ అందుబాటులోకి రానుంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతిపాదించిన 'ఆయుష్మాన్ భవ' పథకం ఇందుకు మార్గం సుగమం చేస్తోంది. ఏడాదికి రూ. 330 ప్రీమియం చెల్లిస్తే కుటుంబం మొత్తానికి కలిపి ఏడాది పాటు రూ. 5 లక్షల వరకు ఖర్చయ్యే వైద్యాన్ని ఉచితంగా అందిస్తారు. ఇంతకుముందు కేవలం రూ. 30 వేల విలువైన వైద్యం మాత్రమే ఇలా అందేది. రాను రాను వైద్య ఖర్చులు బాగా పెరిగిపోవడం, వ్యాధులు కూడా విస్తరిస్తుండటంతో ఏదైనా పెద్ద అనారోగ్యం చేస్తే వైద్య ఖర్చులు భరించలేక పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలు అల్లాడిపోతున్నాయి. వాళ్లందరికీ ఇది నిజంగానే పెద్ద ఊరట కానుంది. బీమా సంస్థలలో ఆరోగ్య బీమాకు రూ. 5 లక్షల కవరేజి ఇవ్వాలంటే వయసును బట్టి ఏడాదికి దాదాపు రూ. 10 వేల వరకు కూడా చెల్లించాల్సి వస్తోంది. అలాంటిది రోజుకు దాదాపు రూపాయి కంటే కూడా తక్కువ ఖర్చుతోనే రూ. 5 లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందుతుందంటే.. అది పేదలకు ఊరట కలిగిస్తుంది. దేశవ్యాప్తంగా దాదాపు 10 కోట్ల పేద కుటుంబాలకు ఇది అందుతుందని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. అంటే దాదాపు 50 కోట్ల మంది ప్రజలకు ఇది ఉపయోగపడుతుందన్న మాట. ప్రపంచంలోనే ప్రభుత్వ రంగంలో అందిస్తున్న వైద్య పథకాలలో ఇది అతిపెద్దదని జైట్లీ అభివర్ణించారు.

భారతదేశంలో గ్రామీణ ప్రాంతాలలో వైద్యం గగనకుసుమంగానే ఉంది. ప్రైవేటు వైద్యానికి అయ్యే ఖర్చు చుక్కలనంటుతుండగా, ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యం నాసిరకంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయడం ఇప్పట్లో సాధ్యమయ్యే పని కాదని.. కేంద్రం కూడా ఈ వైద్యబీమావైపే మొగ్గు చూపుతోంది. భారతదేశంలో కేవలం రూ. 330 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుండగా, అమెరికాలో ప్రస్తుతం వై ద్యబీమాకు ప్రజలు రూ. 84వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. అక్కడ మొత్తం దాదాపు 3.8 కోట్ల మంది ప్రజలు మాత్రమే వైద్యబీమా పొందుతున్నారు.

**వైద్య రంగానికి ఇంకా....**

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 600 కోట్లు కేటాయించింది. ఈ నిధుల్లోంచి క్షయకు చికిత్స పొందుతున్నంత కాలం ఆహార ఖర్చుల కింద ఒక్కో రోగికి నెలకు రూ. 500 చొప్పున ఇస్తారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద ప్రతి పౌరుడికి వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటుచేస్తున్నారు. దీనికోసం రూ. 1200 కోట్లను కేటాయించారు. ప్రతి మూడు పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఒక వైద్య కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తారు.

# కమలంతో సైకిల్ తెగదెంపులే!

- **అధిష్ఠానానికి బీజేపీ నేతల సూచన**
- **అమిత్ షాతో ముఖ్య నాయకుల భేటీ**
- **వీలైనంత త్వరగా విడిపోవడమే మేలు**
- **మెజారిటీ నేతల అభిప్రాయం ఇదే..**
- **నేడు ముఖ్యులతో వన్ టు వన్ మీట్**
- **బడ్జెట్ అనంతర పరిణామాలపై షా ఆరా**

అమరావతి, ఫిబ్రవరి 1 (మనం ప్రతినిధి):

ఆంధ్ర ప్రదేశ్‌లో ఈసారి ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేయాలా.. వైఎస్ఆర్‌సీపీతో పొత్తు పెట్టుకుని బరిలోకి దిగాలా అనే విషయమై బీజేపీలో తర్జన భర్జనలు జరుగుతున్నాయి. ఏమైనాసరే టీడీపీతో మాత్రం వీలైనంత త్వరగా తెగతెంపులు చేసుకోవాలని పార్టీలో మెజారిటీ వర్గం జాతీయ అధ్యక్షుడు అమిత్ షా వద్ద వెల్లడించినట్టు తెలిసింది. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యనేతలతో గురువారం సాయంత్రం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా భేటీ అయ్యారు. ఈ భేటీకి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యనేతలంతా హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ముఖ్య నేతలంతా ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ ఏడాది నవంబర్-డిసెంబర్‌లోనే ముందస్తు ఎన్నికలు వస్తాయన్న సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. రెండు రాష్ట్రాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ఈ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. పార్టీ ఈ భేటీని మూడు విభాగాలుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. దక్షిణాది నేతలందరితో ఉమ్మడి సమావేశం నిర్వహించిన తర్వాత.. రాష్ట్రాలవారీగా మరో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ముఖ్యనేతల అభిప్రాయాలను తెలుసుకునేందుకు 'వన్ టు వన్' భేటీ కూడా ఉంటుందని పార్టీ వర్గాల సమాచారం. అందులో మాత్రం ఎంపిక చేసిన ముఖ్య నేతలతోనే అమిత్ షా మాట్లాడనున్నారు. ఏపీ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు, మంత్రులు కామినేని శ్రీనివాస్, పైడికొండల మాణిక్యాలరావు, బీజే ఎల్పీ నాయకుడు విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పార్టీ నేతలు దగ్గుబాటి పురందేశ్వరి, కన్నా లక్ష్మీనారాయణ, కావూరి సాంబశివరావు భేటీ కానున్నట్టు తెలిసింది. దక్షిణాదిలో పార్టీ వ్యూహం, ప్రభుత్వాల పనితీరు, ఆ రాష్ట్రాల్లో బీజేపీకి సంస్థాగతంగా ఉన్న బలం, మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో అభిప్రాయాలకే గురువారం నాటి సమావేశం పరిమితం కానున్నట్టు తెలిసింది.

ఏపీలో అనుసరించాల్సిన వ్యూహంపై బీజేపీ అధిష్ఠానం ఇప్పటికే రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకుందని విశ్వసనీయ సమాచారం. టీడీపీతో పొత్తుకు స్వస్తి పలికేందుకు కొత్త పొత్తులపై ఇప్పటికే రేఖామాత్రంగా అవగాహన కుదుర్చుకున్నట్టు తెలిసింది. అమిత్ షా భేటీలో పార్టీ నేతలకు ఈ సంకేతాలను అందిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పనితీరుపైనా, తమ పార్టీ పట్ల వ్యవహరిస్తున్న తీరుపైనా ఇప్పటికే కారాలు మిరాయాలు నూరుతున్న బీజేపీ నాయకులు సవివరమైన నివేదికలతో అమిత్ షా భేటీకి హాజరయ్యారు. పొత్తు కొన సాగితే తీవ్రంగా నష్ట పోతామనీ, ఏపీలో పార్టీ పునాదులను పటిష్ఠ పర్చుకోవాలంటే టీడీపీతో పొత్తుకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉందని పార్టీలోని మెజారిటీ నాయకులు అమిత్ షాతో స్పష్టం చేయనున్నట్టు తెలిసింది. షా ఆలోచనల మేరకే పార్టీలో కొందరు తమ పాత్ర నిర్వహిస్తున్నారనీ, పొత్తుకు స్వస్తి పలకటం వారి అంతిమ లక్ష్యమని.. టీడీపీతో పొత్తు వల్ల లాభపడుతున్న కొందరు నేతలు అంటున్నారు. ముఖ్యంగా మంత్రి కామినేని శ్రీనివాస్ టీడీపీతో పొత్తుకే ఇష్టపడుతున్నారు. రానున్న ఎన్నికల్లో 2014 కన్నా ఎక్కువ సీట్లలో పోటీ చేసేందుకు టీడీపీని ఒప్పించి మైత్రిని కొనసాగించాలని, వైఎస్ఆర్‌సీపీతో పొత్తు పెట్టుకుంటే నష్టం జరుగుతుందన్న అభిప్రాయంతో ఆయన ఉన్నారు. విశాఖ ఎంపీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు తటస్థ వైఖరితో ఉన్నట్టు సమాచారం. ఏపీలో అనుసరించాల్సిన వ్యూహంపై జాతీయ నాయకత్వం ఇప్పటికే స్పష్టమైన అభిప్రాయంతో ఉన్నందున పార్టీ నిర్ణయమే శిరోధార్యమనే ధోరణి అవలంబించటమే మంచిదన్న అభిప్రాయంతో ఉన్నట్టు తెలిసింది.

కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందనీ, ఎంపీలంతా నిరసన స్వరాన్ని వినిపించాలని సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్సులో చెప్పడం.. తదితర పరిణామాలపై అమిత్ షా ఆరా తీసినట్టు తెలిసింది. బడ్జెట్ నేపథ్యంలో బాబు వ్యూహం ఎలా ఉండబోతుందన్న విషయమై ఏపీలోని ఇద్దరు బీజేపీ ముఖ్య నేతలతో మాట్లాడినట్టు తెలిసింది. అనంతపురం ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి, అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాసరావు బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై తీవ్రస్వరంతో మాట్లాడారు. టీడీపీ ఎంపీలు రాజీనామా వ్యూహాన్ని కూడా అమలు చేస్తారని సమాచారం రావడంతో అమిత్ షా ఏపీ నేతలను పిలిచి మాట్లాడినట్టు తెలిసింది. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రానికి అర్థమయ్యేలా స్పందించాలని టెలికాన్ఫరెన్స్‌లో ఎంపీలను ఆదేశించటంతో పాటు అందుబాటులో ఉన్న రాష్ట్ర మంత్రులతో సమావేశమై బడ్జెట్ నేపథ్యంలో ఎలాంటి వ్యూహం అనుసరిస్తే బాగుంటుందనే విషయమై చర్చించడం.. ఒకటి రెండు రోజుల్లో కీలక నిర్ణయాలుంటాయని మంత్రి సోమిరెడ్డి బయటకు వచ్చి మీడియాతో వ్యాఖ్యానించడం లాంటి అంశాలపై కూడా అమిత్ షా వద్ద చర్చ జరిగినట్టు సమాచారం. బడ్జెట్ సమావేశాలు ముగిసేదాకా వేచి చూద్దామని చంద్రబాబు ఆలోచిస్తుండగా, బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నపుడే రాజకీయ నిర్ణయాలు తీసుకుంటే ప్రజల్లో క్రేజ్ వస్తుందనీ, అందరి చూపు తమ వైపు తిప్పుకున్నట్టు అవుతుందని టీడీపీ ఎంపీలలో కొందరు భావిస్తున్నట్టు తెలిసింది.


## బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..

### హితం... హితం... అమితం!




''ఇది సర్వ జనహిత బడ్జెట్... నవ భారత పునాది హితం... రైతుహితం, సామాన్య హితం, వ్యాపార హితం ప్రగతి హితం. వ్యవసాయం నుంచి మౌలిక వసతులదాకా; ఆరోగ్యం నుంచి అభివృద్ధివరకూ... అన్ని రంగాలపైనా శ్రద్ధా స'హితం'. మొత్తంమీద బడ్జెట్‌తో ప్రయోజనాలు అమితం'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహర్ష వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడిన ఆయన, అరుణ్ జైట్లీ అద్భుతమైన బడ్జెట్‌ను రూపొందించారని ప్రశంసించారు. ఒక్కమాటలో చెబితే ఇది దేశ సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తున్న బడ్జెట్‌గా అభివర్ణించారు. రైతు కష్టానికి తగిన ఫలితం దక్కేవిధంగా సాగు వ్యయానికి 1.5 రెట్లు అధికంగా మద్దతు ధర ఇస్తామని ప్రకటించినందుకు జైట్లీని అభినందిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ భారతంలో కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు.

### మధ్యతరగతి చేతిలో మరింత డబ్బు



మూడేళ్లుగా మధ్యతరగతి వ్యక్తిగత పన్ను చెల్లింపుదారుల చేతిలో మరింత డబ్బు పెడుతున్నానని చెబుతూ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఓ చిట్టా విప్పారు. బడ్జెట్ సమర్పణ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. ''ప్రతి బడ్జెట్‌లో అంచెలంచెలుగా మధ్యతరగతి పన్ను చెల్లింపుదారుల చేతిలో అదనపు ధనం పెడుతున్నాను. నిరుడు రూ.5 లక్షల్లోపు ఆదాయం ఉన్నవారిపై పన్నును 5 శాతానికి తగ్గించాను. ప్రపంచంలో ఎక్కడా ఇంత తక్కువ శాతం పన్ను లేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో తొలిసారిగా వేతనజీవుల తోడ్పాటును గుర్తించాం. అందుకే రవాణా భృతి, వైద్య భత్యాల స్థానంలోప్రామాణిక తగ్గింపును మళ్లీ ప్రవేశపెట్టి రూ.40వేలుగా నిర్ణయించాం. ఇది పెన్షనర్లకూ వర్తిస్తుంది. సీనియర్ సిటిజన్లకు డిపాజిట్లపై వడ్డీమీద పన్ను రాయితీ పరిమితిని రూ.10 వేల నుంచి రూ.50వేలకు పెంచాం. అలాగే ఆరోగ్య బీమా ప్రీమియం పరిమితిని కూడా రూ.50వేలకు పెంచాం'' అన్నారు.

**అణగారిన వర్గాలకు అభివృద్ధి చేకూర్చేలా ఉంది: అమిత్ షా**



'సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ అనే స్ఫూర్తిని కొనసాగించేలా బడ్జెట్ ఉంది, నిరుపేదలకు, అణగారిన వర్గాలకు అభివృద్ధి చేకూర్చేలా ఉంది. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దత ధర ఒకటిన్నర రెట్లు పెంచడంతో, 2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేయాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం నెరవేరేలా చేస్తుంది'

**పథకాలకు సరిపోయే కేటాయింపులు లేవు: రాహుల్ గాంధీ**



'నాలుగేళ్లు గడిచాయి.. ఇంకా రైతులకు గిట్టుబాటు ధర అంటున్నారు, నాలుగేళ్లు గడిచాయి.. ఇంకా ఫ్యాన్సీ పథకాలకు సరిపోయే బడ్జెట్ కేటాయించడం లేదు, నాలుగేళ్లు గడిచాయి.. యువతకు ఉద్యోగాలు లేవు.. హమ్మయ్య ఇక మిగిలింది కేవలం ఒక్క ఏడాదే'

**పన్ను చెల్లింపుదారుకు ఏ ఊరటా లభించలేదు: చిదంబరం**




'జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం ఓ పెద్ద బూటకం, వ్యవసాయ రంగంలో ఒత్తిడి కొనసాగుతోంది, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సాహించేందుకు ఈ బడ్జెట్‌లో ఏమీ లేదు, సగటు పన్ను చెల్లింపుదారుడికి ఏ ఊరట లభించలేదు'

**ప్రధానికి శుభాకాంక్షలు: స్మృతి ఇరానీ**



ఈ బడ్జెట్ పేదల అభివృద్ధి కోసం, రైతులు, వృద్ధులు, మహిళల ఆదాయం పెంచేందుకు తోడ్పడే బడ్జెట్ అన్న కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, 'ప్రపంచంలోనే అతిపెద్ద దేశంలో ఆరోగ్య సంరక్షణ పథకాన్ని ప్రకటించినందుకు ప్రధాని నరేంద్ర మోదికి శుభాకాంక్షలు' అన్నారు.



**బడ్జెట్‌పై నితీశ్ ప్రశంసల జల్లు**

'జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం కింద 10 కోట్ల మంది కుటుంబాలకు లబ్ది చేకూరుతుంది, ఇది చాలా పెద్ద విషయం, ఇందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నా' అంటూ బీహార్ సీఎం నితీశ్ కుమార్ బడ్జెట్‌పై ప్రశంసల జల్లు కురిపించారు.

**రైతులకు మొండిచెయ్యి: కాంగ్రెస్**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: అరుణ్‌జైట్లీ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు ఒరిగిందేమి లేదని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. మాటల గారడితో రైతులను, సామాన్య ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని ఆ పార్టీనేత మనీష్ తివారీ అన్నారు.



**మధ్యతరగతికి లాభం లేదు: థరూర్**

కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపయోగపడేవిధంగా బడ్జెట్‌లో ఏమి లేదని, ఈ బడ్జెట్ వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఏ విధమైన లాభం చేకూరేలా లేదని కాంగ్రెస్ నేత శశి థరూర్ అన్నారు. ఆరోగ్య బీమా పథకం బాగుందన్నారు.

**సరిపోదు: దేవెగౌడ**

బడ్జెట్‌లో రైతు సంక్షేమపై కేంద్రం దృష్టి పెట్టినప్పటికీ ఆ బడ్జెట్ వారికి సరిపోదని మాజీ ప్రధాని, జనతాదళ్(ఎస్) నేత దేవెగౌడ అన్నారు. రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయాలు సరిపోవన్నారు.

**ఢిల్లీపై సవతి తల్లి ప్రేమ: కేజ్రీవాల్**



కేంద్ర ప్రభుత్వం ఢిల్లీపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌పై ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఢిల్లీలో మహిళల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

**పెట్టుబడిదారులకు కొమ్ము కాసే బడ్జెట్**

కేంద్ర బడ్జెట్‌పై దేశంలోని పలు రాజకీయ పార్టీలు స్పందించాయి. కేంద్ర బడ్జెట్‌పై తన స్పందన తెలిపిన బీఎస్పీ అధినేత్రి మాయావతి, మోదీ ప్రభుత్వ గత బడ్జెట్‌లలానే 'ఇది కూడా పేదలకు వ్యతిరేకంగా, పెట్టుబడుదారులకు కొమ్ము కాసే బడ్జెట్' అన్నారు.

# కాస్త ఉత్తేజం... కొంత నిస్తేజం

**తాజా బడ్జెట్‌తో కొన్ని వర్గాలకు లబ్ధి.. మరి కొన్నిటికి పలు విధాల భారం.. మొత్తంమీద మోదంతోపాటు ఖేదం**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఎన్నికల సంవత్సరానికి ముందు కేంద్ర బడ్జెట్ అందరూ ఊహించినట్లే ఆవిష్కృతమైంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆకాంక్షలకు తగినట్లే ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన పద్దును రూపొందించారు. దేశవ్యాప్తంగా రైతుల నిరసన వెల్లువెత్తుతున్న సమయంలో ఆరుగాలం కష్టానికి అధిక ప్రయోజనం చేకూరుస్తామని ఆయన వాగ్దానం చేశారు. సాగు ఖర్చుకన్నా ఒకటిన్నర రెట్లు అధికంగా పంటలకు కనీస మద్దతు ధర ప్రకటిస్తామని హామీ ఇచ్చారు.

దాంతోపాటు వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి భారీగా ఖర్చు చేస్తామని ప్రకటించారు. దీంతోపాటు నీటిపారుదల, ఆక్వా కల్చర్ ప్రాజెక్టులకు కేటాయింపులవల్ల గ్రామీణ ప్రాంతాలకు నిధుల ప్రవాహం పెరుగుతుంది. అంతేకాకుండా సౌరశక్తి పంపుల వినియోగంద్వారా రైతులు ఉత్పత్తిచేసే అదనపు విద్యుత్ కొనుగోలు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ఇక ఆరోగ్య సేవల ప్రదాతలకూ ఈ బడ్జెట్‌తో మేలు కలగనుంది. జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం కింద 50 కోట్ల మందికి బీమా సదుపాయం కల్పిస్తున్నందువల్ల ఆరోగ్య సేవలందించే సంస్థలు లబ్ధి పొందే అవకాశం మెండుగా ఉంది. రవాణాకు సంబంధించి రహదారులు, రైల్వే రంగాల్లో మౌలిక సదుపాయాలకు భారీగా నిధులు ఖర్చు చేయనున్నట్లు బడ్జెట్‌లో మంత్రి ప్రకటించారు. దీంతో నిర్మాణ సంస్థలు, రైలు బోగీలు తదితర ఉపకరణాల ఉత్పత్తి సంస్థలకు చేతినిండా పని ఉంటుంది. మెగా ఫుడ్ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించినందువల్ల ఆహార తయారీ సంస్థల్లో ఉత్పత్తి జోరందుకుంటుంది. దీనివల్ల రోజువారీ కూలీలకు పని లభిస్తుంది. బంగారానికి గ్రామీణ ప్రాంతాలనుంచే 60 శాతం డిమాండ్ ఉన్నందువల్ల పెరిగే గ్రామీణ ఆదాయం నగల తయారీదారులవైపు ప్రవహిస్తుందని అంచనా. ఇక హవాయి చెప్పులు ధరించే స్థాయిలోని వారికీ 'హవాయీ జహాజ్ (విమానం) ప్రయాణం అందుబాటులోకి తెస్తామని విత్తమంత్రి ప్రకటించారు.

దీంతో ఇప్పటిదాకా వినియోగంలేని విమానాశ్రయాల అభివృద్ధి మొదలవుతుంది. తద్వారా ఆయా పనులు చేపట్టే సంస్థలుసహా నిర్మాణ రంగం కూడా లబ్ధి పొందుతుంది. కాగా, ఈ బడ్జెట్ వల్ల కొన్ని రంగాలపై దెబ్బ పడుతుంది. ఇందులో భాగంగా దేశీయ తయారీ రంగానికి ప్రోత్సాహం ఇస్తూ మొబైల్ ఫోన్లపై కేంద్ర సుంకాన్ని 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తున్నట్లు జైట్లీ ప్రకటించారు. దీంతో విదేశీ కంపెనీల ఉత్పత్తులపై దెబ్బ పడుతుంది. ద్రవ్యలోటును 3.2 శాతానికి పరిమితం చేయాలన్న లక్ష్యం చేరుకోలేని పరిస్థితి ఏర్పడటంతో దీన్ని 3.5 శాతంగా నిర్ణయించాల్సి వచ్చింది. దీనివల్ల బాండ్లలో భారీగా పెట్టుబడులు పెట్టే ప్రభుత్వ రంగ బ్యాంకులపై దెబ్బ పడనుంది. ఇక ఈక్విటీలలో పెట్టుబడులపై దీర్ఘకాలిక మూలధన లాభాలమీద పన్ను విధించాలన్న నిర్ణయం మదుపుదారులు వెనక్కు తగ్గేట్లు చేస్తుంది. ఫలితంగా ఆర్థిక సేవల కంపెనీలు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు కొంత ప్రతికూలతను ఎదుర్కోవాల్సి ఉంటుంది. రక్షణ రంగానికి సంబంధించి సైనిక బలగాల సేవలను జైట్లీ ప్రశంసల్లో ముంచెత్తినా రక్షణ వ్యయంలో పెద్దగా పెరుగుదల లేకపోవడం గమనార్హం. దీనివల్ల ఈ రంగంలోని పరిశ్రమలకు నిరుత్సాహమే మిగిలింది. లక్షలాది పేదల కోసం ఉద్దేశించిన ప్రతిష్ఠాత్మక ఆరోగ్య పథకాలకు దన్నుగా ఆరోగ్యం, విద్యపై సెస్సును 3 శాతం నుంచి 4 శాతానికి పెంచింది. దీనికి సంబంధించిన అన్నిరకాల వస్తుసేవలు ప్రియమవుతాయి.

## పెరగనున్న మొబైల్ ధరలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: 'మేక్ ఇన్ ఇండియా'ను ప్రోత్సహిస్తూ దేశంలో ఉద్యోగ కల్పనను పెంపొందించేందుకు మొబైల్ ఫోన్ల దిగుమతులపై కస్టమ్ డ్యూటీని జైట్లీ పెంచారు. గతంలో వీటిపై 15 శాతంగా ఉన్న కస్టమ్ డ్యూటీని ప్రస్తుతం 20 శాతానికి పెంచారు. దీంతో మొబైల్ ఫోన్ల ధరలు మరింత ప్రియంకానున్నాయి. దీంతో పాటు టీవీల విడిభాగాలలో కొన్నింటిపైనా దిగుమతి సుంకాన్ని పెంచారు. ఇప్పటివరకు వీటిపై 7.5% నుంచి 10%గా ఉన్న పన్నురేటును ప్రస్తుతం 15%నికి పెంచారు. దీంతో టీవీలు, వీడియో గేమ్‌ల ధరలు కూడా పెరగనున్నాయి. దేశీయంగా తయారయ్యే మొబైల్, టీవీల ధరలపైన ఈ పన్ను ప్రభావం ఉండదు.

## రక్షణ రంగానికి 7.81 శాతం పెంపు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బడ్జెట్‌లో రక్షణ శాఖకు ప్రాధాన్యం దక్కింది. సైనిక శక్తిని ఆధునికీకరించే ప్రక్రియలో భాగంగా కేటాయింపులను పెంచారు. గత ఏడాది 2,74,114 కోట్లుగా ఉన్న బడ్జెట్ ను 7.81% పెంచి 2,95,511 కోట్లు చేశారు. 2018-19 ఏడాదికి సంబంధించి అంచనా జీడీపీలో సైన్యానికి వెచ్చించే మొత్తం 1.58% మాత్రమే! ఈ కేటాయింపులు ఏటేటా తగ్గుతూ వస్తున్నాయని, 1962లో జరిగిన చైనా యుద్ధం తర్వాత ఈ కేటాయింపులే కనిష్ఠమని నిపుణులు చెబుతున్నారు. సైనిక రంగానికి వెచ్చించే మొత్తం ఎల్లప్పుడూ జీడీపీలో 2.5%గా ఉండాలని వారు అభిప్రాయపడుతున్నారు. పైగా రక్షణ బడ్జెట్‌లో మూలధన వ్యయం 99,563.86 కోట్లు మాత్రమే కావడం, కొత్త ఆయుధ వ్యవస్థ, ఆధునికీకరణకు సంబంధించిన వ్యయాలకు ఈ మొత్తాన్ని వెచ్చిస్తారు. ఇక రోజువారీ నిర్వహణ ఖర్చులు, జీతాలు తదితరాలకు వెచ్చించే రెవెన్యూ వ్యయం 1,95,947.55 కోట్లు. మాజీ సైనికులు, అధికారుల కుటుంబాలకు చెల్లించే పెన్షన్ల చెల్లింపులు 1,08,853 కోట్లను ఈ బడ్జెట్‌లో కలపలేదు.

## పేదలను విమానం ఎక్కిస్తాం

**ఏడాదికి వంద కోట్ల ప్రయాణాలు లక్ష్యం**

ఢిల్లీ, ఫిబ్రవరి 1: 'విమానాశ్రయాల సామర్థ్యాన్ని పెంచి హవాయి చెప్పులు తొడిగే వాళ్లు కూడా హవాయి జహాజ్ ఎక్కిస్తానని' మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. 2016లో ప్రారంభించిన ఉడాన్ పథకం పరిధిని పెంచుతూ ఏడాదికి వందకోట్ల ప్రయాణాలు లక్ష్యంగా విమానాశ్రయాలను విస్తరిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న 124 ఎయిర్‌పోర్టులకు అదనంగా మరికొన్ని ఎయిర్‌పోర్టులు ప్రారంభిస్తామన్నారు. నిరుపయోగంగా ఉన్న 56 ఎయిర్‌పోర్టులు, 31హెలీప్యాడ్‌లు వినియోగించుకుంటామన్నారు. వీటిలో 16 విమానాశ్రయాల్లో ఇప్పటికే సేవలు ప్రారంభించామన్నారు. 900 కొత్త విమానాల కొనుగోలు చేస్తామన్నారు.



## వాహనదారుకు ఊరట!

- **తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: పెద్దగా మెరుపులు లేకుండా సాగిన కేంద్ర బడ్జెట్.. వాహనదారులకు మాత్రం కొంత ఊరటనిచ్చింది. బ్రాండెడ్, అన్ బ్రాండెడ్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. దీంతో లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రెండు రూపాయల చొప్పున తగ్గే అవకాశం ఉంది. బ్రాండెడ్ పెట్రోల్‌పై ప్రస్తుతం ఉన్న రూ.7.66 ఎక్సైజ్ సుంకం రూ.5.66కు, అన్ బ్రాండెడ్ పెట్రోల్‌పై ఉన్న సుంకం రూ.6.48 నుంచి రూ.4.48కి తగ్గనుంది. అదే విధంగా బ్రాండెడ్ డీజిల్‌పై ఉన్న ఎక్సైజ్ సుకం రూ.10.69 నుంచి రూ.8.69కి, అన్‌బ్రాండెడ్ డీజిల్‌పై లీటర్‌కు రూ.రూ.8.33 నుంచి రూ.6.33కు తగ్గనుంది. మొత్తం మీద రోజురోజుకూ పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో బెంబేలెత్తిపోతున్న సామాన్యుడికి ఇది కొంత ఊరట కలిగించే అంశమే!

## రాష్ట్రపతికి రూ.5 లక్షలు

**ఉప రాష్ట్రపతికి 4 లక్షలు.. పెరగనున్న ఎంపీల వేతనాలు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతితో పాటు గవర్నర్లు, ఎంపీల వేతనాలను ఈ బడ్జెట్‌లో పెంచారు. హోదాల వారీగా వారు అందుకుంటున్న వేతనాన్ని అలవెన్సులకు అనుగుణంగా జైట్లీ పెంచారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వేతనం 1.5 లక్షలు పెరిగి ప్రస్తుతం రూ.5 లక్షలకు చేరింది. ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు 1.25 లక్షలు పెరిగి రూ.4 లక్షలకు చేరింది. ఇక రాష్ట్రాల గవర్నర్లకు 1.1 లక్షలు పెరిగింది..ఈ పెంపుతో గవర్నర్లు నెలకు రూ.3.5 లక్షల వేతనాన్ని అందుకోనున్నారు. కాగా, ఎంపీల వేతన పెంపునకు సంబంధించిన విధానాన్ని జైట్లీ సవరించారు. ఇకపై ప్రతీ ఐదేళ్లకు ఒకసారి ద్రవ్యోల్బణం ఆధారంగా వేతనాన్ని పెంచేలా మార్పులు చేశారు. దీంతో ప్రతిసారీ వేతన పెంపునకు ఎంపీలు ప్రత్యేకంగా పార్లమెంట్‌కు ప్రతిపాదనలు చేసి చర్చించాల్సిన అవసరం ఉండబోదు. ఈ సవరణలో భాగంగా వేతనంతో పాటు నియోజకవర్గ అలవెన్సులు, ఎంపీలకు చెల్లించాల్సిన ఇతర ఖర్చులలో కూడా మార్పులు జరుగుతాయి. ఈ సవరణ ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందని జైట్లీ పేర్కొన్నారు.

## 'ఎన్నికల మెట్రో' పరుగు!

**ముంబై, బెంగళూరుకు వరాలు**




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో 'ఎన్నికల మెట్రో' పరుగుపెట్టింది. ఈ ఏడాది మే నెలలో ఎన్నికలు జరిగే అవకాశాలున్న కర్ణాటక రాజధాని బెంగళూరు మెట్రోకు విత్త మంత్రి వరాలు కురిపించారు. నిర్మాణంలో ఉన్న మెట్రో పనులను వేగవంతం చేసేందుకు రూ.17 వేల కోట్లు నిధులు కేటాయించారు. మరోవైపు బీజేపీ అధికారంలో ఉన్న మహారాష్ట్ర రాజధాని ముంబై సబర్బన్ రైల్వేకూ రూ.15వేల కోట్ల నిధులు ఇవ్వబోతున్నారు. వాస్తవాని మహారాష్ట్రలో వచ్చే ఏడాది నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే బీజేపీ ముందస్తు ఎన్నికలకు వచ్చే అవకాశం ఉందని, మరోవైపు ఆ రాష్ట్రంలో మిత్రపక్షం శివసేనతో ఉప్పు నిప్పులా ఉన్న నేపథ్యంలో సొంత ఇమేజ్ కోసం బీజేపీ ప్రయత్నిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


## కేంద్ర బడ్జెట్‌లో ప్రధానాంశాలు 2018-19

**కేటాయింపులు, రాయితీలు, ప్రతిపాదనలు**

- రోడ్లు, మౌలిక వసతులకు రూ.9.64 లక్షల కోట్లు
- గ్రామీణ పారిశుధ్య పథకానికి రూ.16,713 కోట్లు
- వ్యవసాయ రుణాలకు రూ.11 లక్షల కోట్లు
- జాతీయ జీవనోపాధి కార్యక్రమానికి రూ.5,750 కోట్లు
- పదికోట్ల కుటుంబాల్లోని 50 కోట్ల మందికి లబ్ధి చేకూరేలా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం
- ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ప్రకటించిన ఈ పథకం కింద రూ.5,00,000 విలువైన వైద్యసేవలు
- దీనికోసం వినియోగదారుడు రూ.330 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకం ఇదే
- 900 కొత్త విమానాల కొనుగోలు. వంద కోట్ల ప్రయాణాలకు వీలుగా విమానాశ్రయాలు విస్తరణ
- క్రియాశీలకంగా లేని 56 విమానాశ్రయాలు ఉడాన్ పథకం కింద అభివ ద్ధి
- ప్రధాని సౌభాగ్య పథకంలో భాగంగా నాలుగు కోట్ల గృహాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు. సౌభాగ్య పథకానికి రూ.16వేల కోట్లు
- అన్ని పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర
- విద్యారంగంలో మౌలిక సౌకర్యాలకు రూ.లక్ష కోట్లు
- గృహ నిర్మాణానికి ప్రత్యేక గృహ నిర్మాణ నిధి. దేశవ్యాప్తంగా 55లక్షల గ హాల నిర్మాణానికి చర్యలు
- ప్రధానమంత్రి గ్రామసడక్ యోజనతో మరిన్ని గ్రామీణ రోడ్ల అనుసంధానం. 2022 నాటికి అన్ని గ్రామాల్లో పక్కా రోడ్ల నిర్మాణం
- మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖలకు రూ.10,000 కోట్లు.
- జాతీయ వెదురు పరిశ్రమల కోసం రూ.1,290 కోట్ల కేటాయింపు
- గ్రామీణ వ్యవసాయ మార్కెట్లకు రూ.2000కోట్లు. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం
- వ్యవసాయం దేశంలో ప్రధాన రంగం. క్లస్టర్ విధానంలో భాగంగా వ్యవసాయాభివృద్ధికి చర్యలు. హార్టీకల్చర్‌కు ప్రాధాన్యం
- వ్యవసాయం, మౌలిక సౌకర్యాలు, ఆరోగ్య సంరక్షణలకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం
- 2022కు రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయాలన్న ఆశయం. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు
- సులభతర వాణిజ్యం విధానంలో ఆర్థికవృద్ధి వేగంగా జరుగుతుంది
- సంస్థాగత సంస్కరణల్లో పేదలకు లబ్ధి. ఈ సంస్కరణలతో బలీయమైన ఆర్థికశక్తిగా భారత్
- ప్రపంచంలో ఏడో ఆర్థికశక్తిగా ఎదిగాం. త్వరలోనే ఐదో ఆర్థికశక్తిగా త్వరలో మీ భారత్ అవతరించనుంది. 7.2-7.5 జీడీపీ ఎదుగుదల ఉంటుంది
- పన్నుల విధానం జీఎస్‌టీలో సులభతరమైంది. పెద్దనోట్ల రద్దులో భారీగా ధనం వినియోగంలోకి వచ్చింది
- గత నాలుగేళ్లలో తీసుకొన్న చర్యల ఫలితంగా ఎఫ్‌డీఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగాయి
- 2017-18లో ఎగుమతులు 15 శాతం పెరుగుతాయని అంచనా



## సుప్రీంలో ఇక కొత్త రోస్టర్



**కేసుల కేటాయింపులో అమలు.. పిల్‌లు సహా అన్ని కీలక కేసులు విచారిస్తా: సీజేఐ**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు కేసుల కేటాయింపునకు కొత్త రోస్టర్ విధానాన్ని అమలు చేయనున్నట్లు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా వెల్లడించారు. ఈమేరకు సుప్రీం కోర్టులో అమలుచేసే రోస్టర్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. రోస్టర్ విధానాన్ని బయటికి వెల్లడించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ కొత్త విధానం ఈ నెల 5వ తేదీ నుంచి సుప్రీం విచారణకు వచ్చే కేసులలో అమలు చేయనున్నట్లు అందులో పేర్కొన్నారు. తదుపరి ఆదేశాలు వెలువరించే వరకూ ఇదే విధానం అమలుకానుందని వివరించారు. ఈ రోస్టర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఈ నెల 5 నుంచి విచారణకు వచ్చే కొత్త కేసులను ఈ విధానం కింద కేటాయిస్తారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు(పిల్), ఎన్నికల వివాదాల కేసులు, నేర సంబంధిత కేసులు, సామాజిక న్యాయానికి సంబంధించిన కేసులను విచారిస్తారు. అవసరమైన సమయంలో రాజ్యాంగ బెంచ్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక విచారణల నిమిత్తం విచారణ కమిషన్లను కూడా ఏర్పరుస్తారు. జస్టిస్ దీపక్ మిశ్రా తర్వాత సుప్రీం కోర్టులో సీనియర్ జడ్జి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ కార్మిక, పరోక్ష పన్నులు, నేర సంబంధిత అంశాలు, వినియోగదారుల రక్షణ కేసులను విచారించనున్నారు. న్యాయమూర్తుల సీనియారిటీ ప్రకారం 12 మంది జడ్జిల జాబితాను, వారికి కేటాయించే కేసుల వివరాలను సీజేఐ ఈ రోస్టర్‌లో పొందుపరిచారు. కాగా, రోస్టర్ విధానాన్ని తొలిసారి బయటికి వెల్లడించడం వెనక ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలే కారణమని తెలుస్తోంది. రోస్టర్ విధానంపై జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలో నలుగురు న్యాయమూర్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఆ నలుగురు న్యాయమూర్తులు మీడియా ముందుకు రావడంతో దేశ అత్యున్నత న్యాయస్థానంలో సంక్షోభం ఏర్పడిన విషయం తెలిసిందే!

## ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ హవా

- **రాజస్థాన్‌లో 2 లోక్‌సభ.. ఒక అసెంబ్లీ సీటు కైవసం**
- **ఆ మూడు స్థానాలూ బీజేపీ ఖాతాలోనివే..**
- **పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ విజయం**
- **ఒక ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు కైవసం**

జైపూర్/ కోల్‌కతా, ఫిబ్రవరి 1: సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఏడాది రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు జరగుతాయనగా జరిగిన ఉప ఎన్నికల్లో అధికార బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. విపక్ష కాంగ్రెస్ విజయ దుందుభి మోగించింది. రాజస్థాన్‌లో ఒక అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. మండల్‌గఢ్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ దాకడ్ బీజేపీ అభ్యర్థిపై 13,000 ఓట్లతో ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి ధాకడ్‌కు 70,146 ఓట్లు పోలవగా.. బీజేపీ అభ్యర్థికి 57,146 ఓట్లు వచ్చాయి. వాస్తవానికి మండల్‌గఢ్ కాంగ్రెస్‌కు పెట్టని కోట. కానీ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే కృతి కుమారు కన్నుమూయడంతో ఉప ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. అలాగే.. అజ్మీర్, అల్వార్ పార్లమెంటరీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఈ రెండు స్థానాల్లోనూ బీజేపీ సిట్టింగ్ అభ్యర్థులు హఠాన్మరణం చెందడంతో ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. అజ్మీర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి రఘు శర్మ 22 ఓట్ల మెజారిటీ, అల్వార్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కరం సింగ్ 60 వేల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. పశ్చిమబెంగాల్‌లో నౌపారా అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార టీఎంసీ ఘన విజయం సాధించింది. ఇక్కడ. టీఎంసీ అభ్యర్థి బీజేపీ అభ్యర్థిపై 63,018 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. సీపీఎం అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. టీఎంసీ అభ్యర్థి సునీల్ సింగ్ 1,01,729 ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థికి అతి తక్కువగా 38,711 ఓట్లు వచ్చాయి ఇక, ఉలుబేరియా లోక్‌సభకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ టీఎంసీ అభ్యర్థి ఘన విజయం సాధించారు. ఈ స్థానంలో గతంలో టీఎంసీ ఖాతాలోనే ఉంది. సిట్టింగ్ ఎంపీ మధుసూదన్ ఘోష్ మృతి చెందడంతో ఇక్కడ ఎన్నికలు నిర్వహించారు.





# అ!... ట్రెండ్ సెట్టర్

## – రాజమౌళి

నాని సమర్పణలో వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రం 'అ!'. కాజల్ అగర్వాల్, రెజీనా కసండ్ర, ఈషా రెబ్బా, శ్రీనివాస్ అవసరాల, నిత్యామీనన్, మురళీశర్మ, ప్రియదర్శి తదితరులు నటించారు. ప్రశాంత్ వర్మ దర్శకుడు. ప్రశాంతి త్రిపిరినేని నిర్మాత. ఈ సినిమా ఫిబ్రవరి 16న విడుదలవుతుంది. ఈ సందర్భంగా బుధవారం ప్రీ రిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్.రాజమౌళి, ఎం.ఎం.కీరవాణి, నాని, నిత్యామీనన్, రెజీనా, ఈషా రెబ్బా, ప్రశాంత్ వర్మ, అవసరాల శ్రీనివాస్, ప్రియదర్శి తదితరులు పాల్గొన్నారు. 'ట్రైలర్ చూసిన వెంటనే సినిమా చూడాలనే ఆసక్తి ఏర్పడింది. అది కూడా ఒకరోజు ముందుగానే. సినిమా సూపర్‌హిట్ అవుతుందనే ఫీలింగ్ కలిగింది. నాని వరుసగా హిట్స్ మీద హిట్స్ కొట్టేస్తున్నాడు. నాని సినిమా అంటే డెఫనెట్ హిట్టేనని అందరికీ ఫీలింగ్ కలిగింది. ఈ సినిమాలో నటించిన అందరినీ చూస్తుంటే, చాలా ఆసక్తిగా అనిపిస్తుంది. ఈ సినిమా ట్రెండ్ సెట్టర్ అవుతుందని భావిస్తున్నాను' అని రాజమౌళి తెలిపారు. 'వాల్‌పోస్టర్ అనే బ్యానర్ పేరే నాకు బాగా నచ్చింది. ప్రశాంత్ అండ్ టీంకి, నిర్మాతలు ప్రశాంతి, నాని సహా అందరికీ ఆల్ ది బెస్ట్' అని కీరవాణి తెలిపారు. 'ఇదొక తిక్క సినిమా. మన అందరిలో కాస్త తిక్క ఉంటుంది. ఆ తిక్కను శాటిస్‌పై చేసే సినిమా ఇది. హీరోగా నాని సినిమా చేస్తున్నాడు కదా! ఇప్పుడు సినిమాలెందుకు అన్నవారున్నారు. ఈ సినిమాను ప్రొడ్యూస్ చేయడం వల్ల నాకు నిర్మాతలపై గౌరవం పెరిగింది. నిర్మాతలందరికీ హ్యాట్సాఫ్. ఈరోజు వరకు నేను సినిమాలోనే సంపాదించాను. ఈ మొత్తాన్ని సినిమాపై పెట్టడానికి నేను రెడీ. ఇలాంటి ఐడియాను నేను సపోర్ట్ చేయకపోతే మంచి కథలు తెలుగులో రావనిపించి నేనే సినిమాకు నిర్మాతగా మారాను.దర్శకుడు ప్రశాంత్ సినిమా చేసిన విధానం చూస్తే.. ఇది తన తొలి సినిమా అంటే ఎవరూ నమ్మరు. ఇలాంటి డైరెక్టర్‌ని నేను ఇంట్రడ్యూస్ చేస్తున్నానని గర్వంగా ఉంది. సినిమా మొన్ననే చూశాను, చాలా గర్వంగా ఫీలయ్యాను. కార్తీక్ ప్రతి ఫ్రేమ్‌తో అందరినీ డామినేట్ చేస్తాడు. ఎడిటర్ గౌతమ్ సహా అందరికీ థాంక్స్' అని హీరో నాని అన్నారు. అనుష్క మాట్లాడుతూ 'ఇందులో చేసిన 11 క్యారెక్టర్స్ అన్నీ సినిమాపై ఆసక్తిని క్రియేట్ చేసింది' అని చెప్పారు. 'చేప క్యారెక్టర్ వాయిస్ ఓవర్ కోసం నానిగారిని కలిశాను. ఏదో చిన్నగా చేద్దామని అనుకున్న సినిమా నానిగారు ఫీల్డ్‌లోకి రాగానే చాలా పెద్దదైంది. ఇదొక సిన్సియర్, నిజాయతీతో కూడిన ప్రయత్నమున్న సినిమా. కథ వినప్పుడు వచ్చిన రెస్పాన్స్‌నే టైటిల్‌గా పెట్టాను. సినిమా ఫిబ్రవరి 16న విడుదలవుతుంది. ఈ ప్రయత్నాన్ని సపోర్ట్ చేస్తే మరిన్ని ఒరిజినల్ కాన్సెప్ట్ మూవీస్ చేయడానికి ప్రయత్నిస్తాను'' అని దర్శకుడు ప్రశాంత్ అన్నారు.



# ప్రతిభకు సాయిధరమ్ సాయం

సూర్యాపేట జిల్లాకు చెందిన రంగుల నరేష్ యాదవ్ దివ్యాంగుడు. అంతర్జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టుకు ఎంపికైనా అక్కడికి వెళ్లేందుకు డబ్బులు లేక పారా అథ్లెట్ నరేష్ అనేక ఇక్కట్లు పడుతున్నాడు. ఈ నెల 31న ఓ ప్రముఖ పత్రికలో వచ్చిన కథనం చదవి వెంటనే హీరో సాయిధరమ్ తేజ్ స్పందించారు. గురువారం నరేశ్ యాదవ్‌కు లక్ష రూపాయిల చెక్కును స్వయంగా అందజేశారు. అనంతరం నరేష్ గురించిన వివరాలు, వాలీబాల్ ప్రాక్టీస్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో విజయం సాధించాలని కోరుతూ నరేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# బిజీగా ఉన్నా.. అది తప్పదు

షూటింగ్స్ లేని సమయాల్లో కొంతమంది సినీ తారలు విదేశాల్లో తమకు నచ్చిన ప్రదేశాల్లో విహరిస్తూ ఉంటారు. కానీ, బాలీవుడ్ హీరోయిన్ పరిణీతి చోప్రా మాత్రం కాస్త భిన్నంగా ఆలోచిస్తుంది. ప్రకృతిని ఆరాధిస్తూనే కొన్ని సాహసాలు చేస్తూ మరింత ఆనందాన్ని పొందుతోంది. పరిణీతికి స్కూబా డైవింగ్ అంటే చాలా ఇష్టం. ఈ డైవింగ్‌లో సర్టిఫికెట్ కూడా పొందింది. స్కూబా డైవింగ్‌లో కొత్తగా ట్రై చేసేందుకు మాల్దీవులకు వెళ్ళిందీ సుందరి. అక్కడ రకరకాల డైవ్స్ చేస్తూ తెగ ఎంజాయ్ చేస్తోంది. విదేశాల్లో ఎంజాయ్ చేసేంత ఖాళీగా వుందా పరిణీతి? ఇప్పుడీమె చేతిలో చాలా సినిమాలు ఉన్నాయి. అర్జున్ కపూర్‌తో కలిసి 'సందీప్ ఔర్ పింకీకీ ఫరార్ చిత్రంలో నటిస్తోంది. విశాల్ షా దర్శకత్వంలో 'నమస్తే లండన్' సినిమా చేయనుంది. ఇందులోనూ అర్జున్ కపూరే హీరో. ఈ సినిమా వేలంటైన్స్ డేకి సెట్స్‌పైకి వెళ్తుంది. ఇవికాక అక్షయ్‌కుమార్ హీరోగా అనురాగ్ సింగ్ దర్శకత్వంలో 'కేసరి' చిత్రంలోనూ నటిస్తోంది. ఇన్ని సినిమాలు చేస్తూనే వీలు చిక్కితే చాలు తన కిష్టమైన స్కూబా డైవింగ్ కోసం పరుగులు తీస్తుంటుంది పరిణీతి.



• పరిణీతి చోప్రా

# కాలేజీ రోజులు గుర్తుకొచ్చాయి



ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న చిత్రం 'కిరాక్ పార్టీ'. నిఖిల్ సిద్ధార్థ్, సిమ్రన్ పరీన్జా, సంయుక్తా హెగ్డే, బ్రహ్మాజీ, సిజ్జు, రఘు కారుమంచి, సాయాజీ షిండే, హనుమంత గౌడ, రాఘవ, ప్రమోదిని, రాకేందు మౌళి, రాఘవేంద్ర, ఆర్.జె. హేమంత్, సమీర్, నవీన్, కార్తిక్, మౌర్య కీలక పాత్రధారులు. షరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. రామబ్రహ్మం సుంకర నిర్మాత. ఈ చిత్రం టీజింగ్ ట్రైలర్ బుధవారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్ లో విడుదలైంది. తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''టీజర్ చూస్తే చాలా బావుంది. ఇంకోసారి చూడాలనిపించింది. గడ్డంతోనూ, మామూలు గానూ నిఖిల్ బావున్నాడు. ఇందులో నిఖిల్ ఫ్రెండ్స్ అందరూ నేచురల్‌గా కనిపించారు'' అని తెలిపారు. నిఖిల్ మాట్లాడుతూ ''కాలేజీ నేపథ్యంలో 'హ్యాపీడేస్' చేశాను. ఆ తర్వాత చేస్తున్న సినిమా ఇదే. ఇందులో నేను హీరో కాదు. కాలేజీలో ఒక కుర్రాడిగా కనిపిస్తాను. ఇది ప్రతి ఒక్కరికి తమ కాలేజీ రోజులను గుర్తుచేస్తుంది'' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ''కన్నడలో పెద్ద హిట్ అయిన సినిమా ఇది. మనకు తగ్గట్టు కథను మౌల్డ్ చేశాం. బాగా ఆడుతుందనే నమ్మకం ఉంది'' అని అన్నారు.



• పూజా హెగ్డే

# మహేష్‌తో పాటు ఎన్టీఆర్

ఒక లైలా కోసం, ముకుంద చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన పూజా హెగ్డే బాలీవుడ్ సినిమాలో హృతిక్ రోషన్ సరసన నటించే ఛాన్స్ రావడంతో బాలీవుడ్‌లో వాలిపోయింది. ఆ సినిమా కాస్తా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టడంతో మళ్ళీ టాలీవుడ్‌లో తన ప్రయత్నాలు ప్రారంభించింది. డిజె చిత్రంతో ప్రేక్షకులకు మళ్ళీ దగ్గరైంది. ప్రస్తుతం బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న 'సాక్ష్యం' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదిలా ఉంటే మహేష్, కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'భరత్ అనే నేను' చిత్రం తర్వాత మహేష్, వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో రూపొందే చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా ఎంపికైంది. ఏప్రిల్‌లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్ళనుంది. మహేష్, వంశీ కలిసి చేస్తున్న సినిమాలో తను హీరోయిన్‌గా ఎంపికైనట్టు పూజా ట్వీట్ చేసింది. దీనికి స్పందించిన వంశీ పైడిపల్లి... పూజాతో వర్క్ చేయడం తనకూ హ్యాపీగానే ఉందని సమాధానమిచ్చాడు. ఈ సినిమాతో పాటు ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందనున్న చిత్రంలో కూడా పూజా హెగ్డే హీరోయిన్‌గా ఓకే అయిందట. ఇలా వరసగా టాప్ హీరోల సినిమాలు చేస్తున్న పూజా టాప్ హీరోయిన్ అయ్యేందుకు ఎక్కువ కాలం పట్టదేమో!

# ఈ ఫిబ్రవరి.. కొత్త దర్శకుల అడ్డా

**కొత్తదనం అంటే అందరికీ ఇష్టమే. ఎందుకంటే.. అందులోనే విజయం దాగి ఉంటుంది. అలాగే ఈ నవ్యతతోనే తెలియని నూతన ఉత్తేజం వస్తుంది. అందుకే కొత్తదనానికి అంత ప్రాముఖ్యత. మరి ఆ కొత్తదనాన్ని సినిమాలకి ఆపాదిస్తే...థియేటర్లకి వచ్చే కళే వేరు...ప్రేక్షకులకు వచ్చే ఉత్సాహమే వేరు. ఇక బాక్సాఫీస్ సందడికి ఆకాశమే హద్దు అన్నట్టుగా ఉంటుంది. పాత సినిమాల ద్వారా నేర్చుకున్న అనుభవాలనుంచి కొత్తదనంతో సినిమాలని తెరకెక్కిస్తే.. అటువంటి సినిమాలకి విజయం కూడా దాసోహం అంటోంది. ఇటువంటి కొత్తదనాన్ని తమ చిత్రాలకు ఆపాదించి.. కొంతమంది నూతన దర్శకులు ఈ ఫిబ్రవరి నెలలో సందడి చేయబోతున్నారు. ఈ నెలలో విడుదలకి సిద్ధంగా ఉన్న సినిమాల్లో అత్యధిక శాతం వీరివే కావడం విశేషం. ఓ సారి ఆ నూతన దర్శకుల వైపు దృష్టిసారిస్తే..**

ఈ శుక్రవారం రెండు సినిమాలు విడుదల కాబోతున్నాయి. ఆ రెండు చిత్రాలు కూడా కొత్త దర్శకులు తెరకెక్కించనవే కావడం విశేషం. ఆ చిత్రాలే 'టచ్ చేసి చూడు', 'ఛలో'. రవితేజ కథానాయ కుడిగా నటించిన 'టచ్ చేసి చూడు' ద్వారా విక్రమ్ సిరికొండ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. పాతబస్తీ నేపథ్యంలో తెరకెక్కించిన యాక్షన్ ఎంటర్ టైనర్ ఇది. 'ఠాగూర్', 'సాంబ' 'బన్నీ', 'స్టైల్' వంటి చిత్రాలకి అసోసియేట్ డైరెక్టర్‌గాను, 'కొంచెం ఇష్టం కొంచెం కష్టం', 'మిరపకాయ్', 'రేసుగుర్రం'



• విక్రమ్ సిరికొండ

సినిమాలకి స్క్రీన్ రైటర్‌గానూ పనిచేసిన అనుభవం విక్రమ్‌కుంది. క్లారిటీ ఉన్న దర్శకుడిగా ఇప్పటికే రవితేజ కితాబులను అందుకున్న విక్రమ్.. సినిమాలోనూ ఆ క్లారిటీని చూపిస్తే.. విజయం ఖాయమే. ఇక 'ఛలో' విషయానికొస్తే.. నాగశౌర్య, రష్మిక మండన్నా నాయకానాయికలుగా తెరకెక్కిన ఈ చిత్రం ద్వారా వెంకీ కుడుముల దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆంధ్ర, తమిళనాడు సరిహద్దుల మధ్య పగ ప్రతీకారాలతో నలిగిపోతున్న ఒక గ్రామం నేపథ్యంలో ఈ సినిమాని తెరకెక్కించాడు దర్శకుడు. అలాగే చక్కటి ప్రేమకథని ముడిపెట్టి మూవీపై మంచి హైప్‌ని క్రియేట్ చేసారు దర్శకుడు వెంకీ. సినిమాలపై ఆసక్తితో ఫిలిం ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ఈ అగ్రికల్చర్ బిజినెస్ మేనేజ్మెంట్ విద్యార్థి.. తేజ, త్రివిక్రమ్ దగ్గర సహాయకుడిగా పనిచేశారు. వినోదమే ప్రధానంగా ఈ సినిమాని తెరకెక్కించారని ప్రచార చిత్రాలని చూస్తే ఇట్టే అర్థమైపోతుంది.



• వెంకీ కుడుముల

20 ఏళ్ళ క్రితం పవన్ కల్యాణ్ కెరీర్‌ను మార్చేసిన చిత్రం 'తొలిప్రేమ'. ఆ పేరుతో సినిమా అంటే.. అంచనాలు భారీగానే ఉంటాయి. మొదటి సినిమా తోనే ఇటువంటి చాలెంజ్‌ని స్వీకరించి చాలా బాధ్యతతో సినిమాని తెరకెక్కించారు వెంకీ అట్లూరి. వరుణ్ తేజ్, రాశి ఖన్నా జంటగా నటించిన ఈ చిత్రానికి తమన్ అందించిన పాటలు ఇప్పటికే శ్రోతలను ఆకట్టుకున్నాయి. పవన్ కల్యాణ్ కెరీర్‌లో బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన నాటి 'తొలిప్రేమ' ద్వారా ఎ.కరుణాకరన్ దర్శకుడుగా పరిచయమవ్వగా.. వరుణ్



• వెంకీ అట్లూరి

తేజ్ 'తొలిప్రేమ' ద్వారా వెంకీ అట్లూరి మొదటిసారిగా మెగాఫోన్ పట్టుకోవడం విశేషం. ఫిబ్రవరి 10న ఈ సినిమా తెరపైకి రానుంది.

ఒకప్పుడు వరుస విజయాలతో దూసుకుపోయిన యువ కథానాయకుడు తరుణ్. తరువాత ఆ జోరు తగ్గినా.. లవర్ బాయ్‌గా అతనికున్న ఇమేజ్ ఇంకా చెదిరిపోలేదు. అందుకే చాలా కాలం తరువాత మళ్ళీ ప్రేమకథతో పలకరించబోతున్నారు తరుణ్. ఆ చిత్రమే..'ఇది నా లవ్ స్టోరి'. నూతన దర్శకులు రమేష్ గోపి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా.. 2013లో ఘన విజయం సాధించిన కన్నడ చిత్రం 'సింపుల్ అగి ఒందు లవ్ స్టోరి'నికి రీమేక్ వెర్షన్. ఆసక్తికరమైన కథనంతో, ఆకట్టుకునే మాటలతో...తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా చిత్రాన్ని మలిచినట్టు చిత్ర వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రేమికుల దినోత్సవం సందరంగా ఫిబ్రవరి 14న ఈ సినిమా విడుదల కానుంది.



• ప్రశాంత్ వర్మ

ఇక ఇదే నెలలో విడుదల కానున్న ఐదవ నూతన దర్శకుడి సినిమా 'అ!'. ఈ సినిమాకి సంబంధించినంత వరకు రెండు కొత్త విషయాలున్నాయి. ఒకటి ప్రశాంత్ వర్మ ఈ చిత్రంతో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కావడం. రెండోది నేచురల్ స్టార్ నాని నిర్మాతగా మారడం. దర్శకుడు చెప్పిన కథకి నాని ముగ్ధుడైపోయి.. ''వాల్ పోస్టర్ సినిమా'' పతాకంపై స్నేహితురాలు తిపిర్నేని ప్రశాంతితో కలిసి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. కాజల్ అగర్వాల్, నిత్యా మీనన్, అవసరాల శ్రీనివాస్, ఈషా రెబ్బా, రెజీనా, ప్రియదర్శి, మురళీశర్మ తదితరులు ఇందులో ప్రధాన తారాగణం కాగా...ఈ సినిమాలోని బోన్సాయ్ చెట్టు పాత్రకి రవితేజ, చేప పాత్రకి నాని వాయిస్ ఓవర్ ఇవ్వడం విశేషం. ప్రచార చిత్రాలతో ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం ఫిబ్రవరి 16న తెరపైకి రానుంది.

అదే రోజున ఓ మహిళా దర్శకురాలు కూడా అదృష్టాన్ని పరీక్షించు కోనున్నారు. ఆమె మరెవరో కాదు.. కృష్ణ తనయగా ఇండస్ట్రీలో అడుగుపెట్టి.. నటిగా, నిర్మాతగా మంచి గుర్తింపు తెచ్చుకున్న మంజుల ఘట్టమనేని. మొదటిసారి దర్శకురాలిగా మారి ఆమె తన మనసుకు నచ్చిన సినిమాని తీశారు. సందీప్ కిషన్, అమైరా దస్తుర్, త్రిధా చౌదరి నాయకానాయికలుగా ఆమె రూపొందించిన ఆ చిత్రమే 'మనసుకు నచ్చింది'. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి సంజయ్ స్వరూప్, కిరణ్ నిర్మాతలు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలతో సినిమా ఎంత ఆహ్లాదకరంగా ఉంటుందో దర్శకురాలు మంజుల చెప్పకనే చెప్పారు. ఈమె దర్శకత్వంతో పాటు రవియాదవ్ సినిమాటోగ్రఫీ, రథన్ సంగీతం సినిమాకి కలిసొచ్చే అంశాలుగా చెప్పుకోవచ్చు.



• మంజుల

వైవిధ్య భరిత చిత్రాలతో ఆకట్టుకున్న యువ కథానాయకుడు నిఖిల్ నుంచి వస్తున్న తాజా చిత్రం 'కిరాక్ పార్టీ'. కన్నడంలో ఘనవిజయం సాధించిన 'కిరిక్ పార్టీ'కి రీమేక్‌గా రూపొందిన ఈ సినిమా ద్వారా శరణ్ కొప్పిశెట్టి దర్శకుడిగా పరిచయమవుతున్నారు.



• శరణ్ కొప్పిశెట్టి

కళాశాల రాజకీయాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో సిమ్రన్ పరీంజా, సంయుక్తా హెగ్డే కథానాయికలుగా నటించారు. విడుదల తేది ఇంకా ఖరారు కాకపోయినా.. ఈ నెలలోనే ఈ సినిమా విడుదల కానుందని తెలుస్తోంది.

---

**గతేడాది ఇదే ఫిబ్రవరిలో వచ్చిన 'ఘాజీ' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన సంకల్ప్ రెడ్డి విజయంతో పాటు విమర్శకుల నుంచి ప్రశంసలు సైతం పొందారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏకంగా ఏడు చిత్రాలతో ఎనిమిది మంది దర్శకులు పరిచయమవుతుతుండడం విశేషం. బహుశా.. ఒకే నెలలో ఇంతమంది దర్శకులు పరిచయం కావడం అనేది అరుదైన విషయమే. ఆ అరుదైన విషయానికి విజయాలు కూడా వరిస్తే.. ఈ ఫిబ్రవరి ఎప్పటికీ గుర్తుండిపోతుంది.**

## పూర్తిగా ఎన్నికల బడ్జెట్

- పారిశ్రామికవేత్తలకు ఒరిగిందేంలేదు
- పల్సస్ గ్రూప్ సీఈవో శ్రీనుబాబు



అమరావతి, ఫిబ్రవరి 1: ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిస్థాయిలో రాబోయే సార్వత్రిక ఎన్నికల కోణంలోనే ఉందని పల్సస్ గ్రూప్ సీఈవో గేదెల శ్రీనుబాబు అన్నారు. ఈ బడ్జెట్లో పన్నుచెల్లింపుదారులకు ఎటువంటి ప్రయోజనం లేదని చెప్పారు. పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులకు ఈ బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదని అభిప్రాయపడ్డారు. కార్పొరేట్ టాక్స్ తగ్గించటం కొంత ఊరనిచ్చే అంశమన్నారు. ఐటీ, సేవ రంగానికి, ఎగుమతులకు ఈ బడ్జెట్ పూర్తిగా నిరాశ మిగిల్చిందన్నారు. వ్యవసాయం, గ్రామీణ భారతానికి అనుకూ లంగా కేటాయింపులు ఉన్నాయని శ్రీనుబాబు చెప్పారు. కొన్ని కేటా యింపులు, రాయితీలు గ్రామీణభారతానికి మేలు చేసేలా ఉన్నా.. వాస్తవ రూపం దాల్చేసరికి.. ఈ ప్రయోజనాలు ఎంత మేరకు అందుతాయో? అమలు ఎలా ఉంటుందో చూడాల్సి ఉందని ఆయన అన్నారు.

## పార్లమెంట్‌లో లేవనెత్తుతా..


- కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం
- ప్యాకేజీకి చట్టబద్ధత రాకపోవడం బాధాకరం: ఎంపీ గీత



విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (మనం న్యూస్ బ్యూరో): కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందంటూ అరకు ఎంపీ, కొత్తపల్లి గీత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక ప్యాకేజీకి చట్టబద్దత వస్తుందని ఆశించి భంగపడ్డామన్న గీత, బడ్జెట్‌లో పోలవరం ప్రస్తావన లేకపోవడం భాదాకరమన్నారు. పోలవరం ప్రాజెక్టు పునరావాస నష్టపరిహారం ప్రస్తావన బడ్జెట్‌లో లేదని, నిధులు లేకుండా పోలవరం ప్రాజెక్టు ఎలా పూర్తి చేస్తారని ఆమె ప్రశ్నించారు. రైల్వే జోన్ ప్రకటన బడ్జెట్‌లో లేనేలేదని, రెల్వేలో కూడా ఏపీని చిన్న చూపు చూశారని ఆమె వాపోయారు. గిరిజన ప్రాంతంలో గిరిజన విశ్వవిద్యాలయం పెట్టాలని తాము కోరామని, దీనిపై స్పష్టత ఇవ్వలేదని, మహిళలకు బడ్జెట్‌లో న్యాయం జరగలేదని, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందాలన్నారు. బడ్జెట్ కేటాయింపులకు రాజకీయ కారణాలు కూడా ఉండొచ్చని, పార్లమెంటులో ఏపీకి జరిగిన అన్యాయాన్ని తాను లేవనెత్తనున్నట్టు వివరించారు.

## ఆంధ్రప్రదేశ్‌కు ఒరిగిందేంలేదు

- బడ్జెట్‌పై వైసీపీ ఎంపీల విమర్శ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి అన్యాయం జరిగిందని వైసీపీ అభిప్రాయపడింది. ఈ బడ్జెట్ పూర్తి నిరాశాజనకంగా ఉందని, దీనితో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేసింది. న్యూఢిల్లీలో వైసీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, వైఎస్ అవినాష్ రెడ్డి, విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఏపీకి సంబంధించి బడ్జెట్‌లో కేంద్రం కొత్తగా ఒరగబెట్టిందేమీ లేదని వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు. బడ్జెట్ చూసి నిరాశకు గురయ్యామని, విభజన చట్టంలోని హామీలు అమలవుతాయని ఆశించినా ఫలితం లేకపోయిందని అన్నారు. ప్రత్యేక హోదా ప్రస్తావన లేకపోవడం బాధాకరమని, తాము రాజీనామా చేస్తే హోదా వస్తుందంటే అందుకు తాము సిద్ధమేనని ఆయన చెప్పారు. దీనిపై అధికార టీడీపీ కూడా సమాధానం చెప్పాలన్నారు. వైఎస్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీని దేశవ్యాప్తంగా అమలు చేసేలా రూ.5 లక్షల బీమా కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. బడ్జెట్‌లో ఏపీ గురించి ప్రస్తావనే లేకపోవడం బాధాకరమని ఎంపీ విజయసాయిరెడ్డి చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో వెనుకడుగు వేశారని ఆయన ఆక్షేపించారు. విశాఖ రైల్వే జోను అంశంపైనా కదలిక లేకపోవడం అన్యాయమని అన్నారు.

## మీడియాను ఆహ్వానించాల్సిందే!

- మున్సిపల్ శాఖకు కోర్టు సూచన
- 'హలో షాద్ నగర్' రిట్ పై స్పందన

హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం ప్రతినిధి): మున్సిపాలిటీ సాధారణ సమావేశాలకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలను హాజరుకాకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వేసిన రిట్ పిటిషన్ పైన హైకోర్టు అనుకూలంగా స్పందించింది. షాద్ నగర్ సీనియర్ జర్నలిస్టు, హలో షాద్ నగర్ తెలుగు దినపత్రిక ఎడిటర్ ఎం.డి ఖాజాపాషా వేసిన రిట్ పిటిషన్‌పై గురువారం హైకోర్ట్ న్యాయస్థానం స్పందిస్తూ.. షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌తో పాటు రాష్ట్ర శాఖకు ఉత్తర్వులు వెలువరించారు. మున్సిపాలిటీ సాధారణ సమావేశాలకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాను అనుమతించాల్సిందేనని హైకోర్టు న్యాయమూర్తి బి.శివ శంకర్ రావ్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఖాజాపాష తరపు న్యాయవాది సుదర్శన్ స్పష్టంచేశారు. ప్రభుత్వం తరుపున మున్సిపల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మిన్ టి.కె శ్రీదేవి 2017లో ఏప్రిల్ 27న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలపైన ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. మున్సిపాలిటీ సమావేశాలకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలను అనుమతించలేదు. ఈ వ్యవహారం పట్ల షాద్ నగర్ సీనియర్ జర్నలిస్టు ఎం.డి ఖాజాపాష హైకోర్టును ఆశ్రయించినట్టు న్యాయవాది సుదర్శన్ తెలిపారు. పిటిషన్ స్వీకరించిన న్యాయస్థానం సమావేశాలకు మీడియాను అహ్వానించాల్సిందేనని ఉత్తర్వులు జారీచేశారని న్యాయవాది తెలిపారు.

## డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం భేష్

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ జాయింట్ సెక్రటరీ అపరాజిత సారంగి

గజ్వేల్, ఫిబ్రవరి 1 (మనం న్యూస్): తెలంగాణలో అమలు చేస్తున్న ప్రజాసంక్షేమపథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయని ఎన్‌ఆర్‌ఈజీఎస్ జాయింట్ సెక్రటరీ అపరాజిత సారంగి అన్నారు. గజ్వేల్ పట్టణంలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను గురువారం ఆమె పరిశీలించారు. పేదవారి సొంతింటి కలను నిజం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావడం గొప్ప విషయ మన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తున్నారని, ఇక్కడ నిర్మించే గృహసముదాయాలు రోల్‌మోడల్‌గా ఉన్నాయని, అత్యాధునిక వసతులతో ఇండ్లు కట్టించడం అభినందనీయమని ఆమె అన్నారు. అనంతరం ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామాల్లో నిర్మించిన ఇళ్లను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పేదల భూమి లాక్కుంటున్నారు: కాంగ్రెస్

హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం ప్రతినిధి): రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేయనున్న ఫార్మా సిటీ కోసం ప్రభుత్వం పేదల భూములను బలవంతంగా లాక్కునేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. దీని కోసం 19 వేల ఎకరాలను సేకరిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మర్రి శశిధర్ రెడ్డి, ఎమ్మెల్యే వంశీచందర్ రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు కోదండ రెడ్డి గురువారం గాంధీభవన్‌లో పేర్కొన్నారు. ఇందిరాగాంధీ కాలంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను బలవంతంగా లాక్కుంటున్నారని, వీరికి కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వాల్సిన అవసరంలేదని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# అందరికీ ఆరోగ్యం

**ప్రభుత్వ ధ్యేయం ఇదే: చంద్రబాబు.. టెలి ఆప్తమాలజి సేవలు ప్రారంభం.. 115 ముఖ్యమంత్రి 'ఈ-ఐ' కేంద్రాలు**

- వీటితో వంద శాతం ఆన్‌లైన్ సేవలు
- ఉచితంగా కంటి పరీక్షలు.. కళ్లజోళ్లు




అమరావతి, ఫిబ్రవరి 1 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండటమే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వైద్య రంగంలో సంస్కరణలు చేపట్టి సామాన్య, మధ్య తరగతి వారికి మెరుగైన వైద్యం అందిస్తున్న రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ మాత్రమే అని స్పష్టం చేశారు. గురువారం ఉండవల్లిలో నివాసంలోని ఫిర్యాదుల సేవా విభాగం నుంచి 'టెలి ఆప్తమాలజీ' సేవలను చంద్రబాబు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 115 'ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలను' ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ సాధించిన విజయనగరం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, ఒంగోలు ఆసుపత్రులకు ధృవీకరణ పత్రాలను ముఖ్యమంత్రి అందజేశారు. మాతృ మరణాల సంఖ్యను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున సేవలకు కొనసాగింపుతో పాటు 'తల్లి సంరక్షణ' పేరుతో ఒక మొబైల్ అప్లికేషన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పీపీపీ పద్ధతిలో ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, టెండర్ల పోటీలో ఎంపికైన అపోలో ఆసుపత్రి వీటి నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. 13 జిల్లాల్లో తొలుత 115 కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా 100 శాతం ఆన్‌లైన్ సేవలు అందిస్తారు. రోగికి సంబంధించిన వివరాలన్నింటినీ డిజిటల్ విధానంలో భద్రపరుస్తారు. రోగి వేలి ముద్ర ఆధారంగా ఆ ప్రక్రియ జరుగుతుంది. రోగికి ఆ వివరాలు అవసరమైనప్పుడు తిరిగి అందిస్తారు. కంటి పరీక్షలన్నిటినీ ఉచితంగా నిర్వహిస్తారు. అవసరమైన కళ్లజోళ్లను ఉచితంగా ఇవ్వనున్నారు. చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి, తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట ఆసుపత్రుల వైద్యులతో ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 2020 నాటికి రాష్ట్రంలో అంధత్వం శాతాన్ని 0.3 కి తగ్గించడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు. ఆరోగ్య పరిరక్షణలో సరైన అవగాహన లేకపోవడంతో చాలామంది బాధపడుతున్నారని, వారి సంపాదనలో అత్యధిక భాగం ఆసుపత్రులకు, మందులకు ఖర్చు అవుతోందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుస్థితిని గమనించి అధికారంలోకి రాగానే వైద్యరంగంలో అనేక సంస్కరనలు ప్రవేశపెట్టి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. 'ఎన్టీఆర్ వైద్యసేవ' ద్వారా రూ.2.5 లక్షల విలువైన వైద్యసేవలను అందిస్తున్నామని వివరించారు. రూ.1400లకే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ఆరోగ్య రక్ష, తల్లీబిడ్డ, ఎక్స్‌ప్రెస్, మహాప్రస్థానం వంటి అనేక కార్యక్రమాలు సమర్థతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. దారిద్ర్యరేఖ దిగువన ఉన్న వారు నెలకు రూ.100 కడితే ఆరోగ్య రక్ష పథకం ద్వారా రూ.2 లక్షల వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో తగిన అవగాహన లేక ఆరోగ్య సమస్యలు తెచ్చుకుంటున్న వారి కోసం 28 కేటగిరీలలో 365 రోజులు వైద్య సేవలు అందించాలని నిర్ణయించామన్నారు. 30 సంవత్సరాలు పైబడిన మహిళలకు మాస్టర్ హెల్త్ కార్డులు అందించి కేన్సర్, కంటిచూపు సమస్యలపై వైద్యసేవలను అందిస్తున్నామని చంద్రబాబు వివరించారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరమే లేకుండా ఏరియా, జిల్లా వైద్య విశ్వవిద్యాలయాల ఆసుపత్రులలో సూపర్ స్పెషాలిటీ సేవలను అందిస్తున్నట్లు గుర్తు చేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్థుల కోసం 18 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, రూ.2500 పెన్షన్ అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖా మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమ్మె చేస్తున్న సీనియర్ రెసిడెంట్లు, పీజీ మెడికల్ స్టూడెంట్ల కోసం రూ. 7 కోట్లు, రూ. 4కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వుల జారీ చేశామని చెప్పారు.

### 'పీస్' సందేశం ప్రపంచానికి వెళ్లాలి



బ్రహ్మకుమారీ సేవలు అభినందనీయం: సీఎం

అమరావతి ఏర్పాటు చేయనున్న పీస్ రిట్రీట్ సెంటర్ నుంచి ఇచ్చే సందేశాలు ప్రపంచానికి తెలియాలని చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లు సమీపంలో బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో విశ్వ వ్యాప్త రిట్రీట్ సెంటర్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. అమరావతి గడ్డకు రాజయోగిని డా.దాది జానకి జీ రావడం చరిత్రకు నాంది పలుకుతుందన్నారు. రాష్ట్ర ప్రజలకు దాదాజీ ఆశీస్సులు అందించినందుకు అందరూ ఆమెకు అభినందనలు, కృత జ్ఞతలు తెలిపాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలతో తెలుపు రంగుతో ప్రకాశిస్తోందని, ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. ఒక పవిత్రమైన కార్యక్రమానికి అమరావతి వేదిక కావడం మరింత సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది బ్రహ్మకుమారీలు నిస్వార్థంగా ప్రేమతో ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. అందుకే ఐక్యరాజ్యసమితి పీస్ మెసెంజర్ అవార్డును ఈ సంస్థకు ఇచ్చిందన్నారు. అమరావతిలో బ్రహ్మకుమారీ సంస్థకు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. ఏడాదిలోగా తమ సంస్థ కార్యకలాపాలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి కోరారు. మహిళలు, చిన్నపిల్లల అభివృద్ధికి, సాఫ్ట్ స్కిల్ శిక్షణతో పాటు అన్ని రకాలుగా, అన్ని రంగాలలో అన్ని కార్యక్రమాలను నిర్వహించగలిగేది కేవలం బ్రహ్మకుమారీలేనని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మౌంట్ అబులోని బ్రహ్మకుమారీ సంస్థల చీఫ్ రాజయోగిని డా.దాదీ జానకి జీ, మంత్రులు అయ్యన్నపాత్రుడు, పత్తిపాటి పుల్లారావు, నారాయణ, నక్కా ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో కీలక నిర్ణయం

- కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి న్యాయం జరగలేదు
- బెంగళూరు, ముంబైలా.. అమరావతి కాదా?
- చంద్రబాబు రాజీపడేది లేదు: సోమిరెడ్డి



అమరావతి, ఫిబ్రవరి 1 (మనం ప్రతినిధి): కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి న్యాయం జరగలేదని, రెండు రోజుల్లో కేంద్రంపై ఓ నిర్ణయం తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బడ్జెట్‌పై చర్చించేందుకు గురువారం సీఎం చంద్రబాబు సమక్షంలో మంత్రులు సమావేశమయ్యారు. అనంతరం సోమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. విభజన సమస్యలకు బడ్జెట్‌లో పరిష్కారం లభిస్తుందని అనుకున్నా.. అలాంటిదేం జరగలేదని అన్నారు. బడ్జెట్ తీవ్ర నిరాశకు గురిచేసిందని చెప్పారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వానికి చివరి పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో ఏపీకి రావాల్సిన నిధులు, సంస్థలపై ప్రకటన ఉంటుందని ఆశించామని.. రాకపోవడంపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. విభజన తర్వాత ప్రత్యేకంగా చూడాల్సిన ఏపీని కేంద్ర పట్టించుకోలేదని నిరాశ, బాధ వ్యక్తం చేశారని పేర్కొన్నారు. శుక్రవారం జరిగే కేబినెట్‌లోనూ, ఆదివారం జరగబోయే పార్లమెంట్ సభ్యుల సమావేశంలోనూ కూలంకుషంగా చర్చిస్తామన్నారు. తీవ్ర రెవెన్యూ లోటు ఉన్న ఏపీని పక్కనబెట్టి, ఇతర నగరాలకు పెద్ద పీట వేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆదివారం సమావేశం తర్వాత కేంద్రంపై తాము ఒక నిర్ణయం తీసుకుంటామని సోమిరెడ్డి వెల్లడించారు. బెంగళూరు, ముంబైపై చూపిన ప్రేమను అమరావతిపై కూడా చూపాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల పట్ల కేంద్రం సానుకూలంగా స్పందించకుంటే, ప్రజల ఆకాంక్షలు నెరవేరకుంటే అవసరమైన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఏపీ ప్రయోజనాలు, అభివృద్దే తమ లక్ష్యమని అన్నారు. కేబినెట్ సమావేశంలో, పార్లమెంటరీ పార్టీ భేటీలో బడ్జెట్‌పై పూర్తి స్థాయిలో చర్చిస్తామని మంత్రి సోమిరెడ్డి చెప్పారు. జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో అమరావతి పేరు కూడా ఎత్తలేదని అన్నారు. ఎంపీలు, మంత్రులు తమ అభిప్రాయాలను సీఎంతో పంచుకున్నారని చెప్పారు. ఢిల్లీ నుంచి నిధులు తెచ్చే విషయంలో చంద్రబాబు ఎప్పుడూ రాజీపడలేదని సోమిరెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ చుట్టూ ఎన్ని ప్రదక్షణలు చేసినా న్యాయం చేయలేదని అన్నారు. కేంద్రం ఇప్పటికైనా వెంటనే స్పందించాలని, మిత్రపక్షమైనా తాము పోరాడుతున్నామని సోమిరెడ్డి చెప్పారు.

**వైసీపీ, కాంగ్రెస్‌లకు విమర్శించే అర్హత లేదు**

వైసీపీ, కాంగ్రెస్ పార్టీలకు తమను ప్రశ్నించే అర్హత లేదని సోమిరెడ్డి అన్నారు. వైసీపీ రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోకుండా.. కేంద్రంపై ప్రశంసలు కురిపించిందని అన్నారు. పార్లమెంట్ బయట వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి బీజేపీ ప్రభుత్వం బ్రహ్మాండంగా పనిచేస్తోందని కితాబిచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన కాంగ్రెస్ పార్టీ కూడా తమను విమర్శిస్తోందని మంత్రి సోమిరెడ్డి ఎద్దేవా చేశారు. నాలుగేళ్లగా నిర్విరామంగా కష్టపడుతున్న చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఇష్టమొచ్చినట్లు విమర్శలు చేయడం సరికాదన్నారు. వైసీపీ నేతలు కేంద్ర కాళ్లు పట్టుకుని తమను విమర్శించడం ఏమిటని సోమిరెడ్డి ప్రశ్నించారు.

### బడ్జెట్‌పై ఎంపీ శివప్రసాద్ మౌనదీక్ష

అమరావతి, ఫిబ్రవరి 1 (మనం ప్రతినిధి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి న్యాయం జరగలేదంటూ పార్లమెంట్ ప్రాంగణంలో చిత్తూరు టీడీపీ ఎంపీ శివప్రసాద్ వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. కేంద్రం అన్యాయం చేయడం వల్లే తాను మౌనంగా బాధను వ్యక్తం చేస్తున్నట్లు సంజ్ఞలు చేసి చూపించారు. శివప్రసాద్ తలపాగా, డప్పు, కంజర, కత్తి, గజ్జెలు, బాణం, గద చూపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మౌనంగా ఉండమని తనకు సూచించినందువల్లే తాను బడ్జెట్‌పై ఏమీ మాట్లాడటం లేదని సంజ్ఞలు చేసి, నిరసన వ్యక్తం చేశారు. బడ్జెట్ ఎలా ఉందని విలేకర్లు ప్రశ్నించగా.. తాను ఏమీ మాట్లాడనని నమస్కారం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.



## సంతులిత బడ్జెట్

- తెలంగాణ ఎకనామిక్స్ ఫోరం అధ్యక్షుడు కనకయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంతులిత సమ్మిళిత వృద్ధిని సాధించేలా ఉందని తెలంగాణ ఎకనామిక్స్ ఫోరం అధ్యక్షుడు కనకయ్య అభిప్రాయపడ్డారు. కేంద్ర బడ్జెట్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వికాసానికి, రైతాంగ సంక్షేమానికి, పేదలకు ఆరోగ్య సేవలు అందించేందుకు రూ.5 లక్షల బీమా పథకం కేటాయించడం హర్షదాయకమని అభిప్రాయడ్డారు. అయితే, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఆశించిన నిధులు కేటాయించలేదని, ఉద్యోగుల ఆశలను వమ్ము చేయడం నిరాశకలిగించే చర్య అని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో ఉత్పత్తి, ఉత్పాదకత, ఆదాయం పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్వయం సమృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

# అటు క్లారిటీ..ఇటు కన్‌ఫ్యూజన్


- తెలంగాణలో దిశానిర్దేశమేది?
- బీజేపీ నేతల ఎదురుచూపులు
- టిఆర్ఎస్ ప్రభుత్వంపై పొగడ్తలు వద్దు
- గుజరాత్ నమూనాను అమలు చేస్తాం
- ఎన్నికలను ధీటుగా ఎదుర్కొంటాం
- అమిత్ షాతో భేటీలో తెలంగాణ నేతలు



హైదరాబాద్, ఫిబ్రవరి 1 (మనం ప్రతినిధి): బీజేపీకి ఆంధ్రాలో ఉన్న స్పష్టత తెలంగాణలో లేదు..ముందస్తు ఎన్నికలు ముంగిట్లోకి వస్తున్నాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలోనైనా తెలంగాణపై పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై జాతీయ నాయకత్వం దిశానిర్దేశం చేయకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని బీజేపీ నాయకులు మదన పడుతున్నారు. తమ ఆందోళనను, ఆవేదనను పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా వద్ద వెలిబుచ్చేందుకు వారంతా సిద్ధపడుతున్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ సమగ్ర నివేదికతో ఢిల్లీలో అమిత్ షా నిర్వహిస్తున్న భేటీకి హాజరయ్యారు. లక్ష్మణ్‌తో బండారు దత్తాత్రేయ, కిషన్ రెడ్డి పాటు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఇతర సీనియర్ నేతలు అమిత్ షా నిర్వహిస్తున్న దక్షిణాది రాష్ట్రాల బీజేపీ నేతల సమావేశం కోసం ఢిల్లీకి వచ్చారు. వారంతా తమ అభిప్రాయాలని అమిత్ షా వద్ద స్పష్టంగా చెప్పారు. తెలంగాణలో ఒంటరి పోరు విషయంలో అమిత్‌షా భేటీలో ఈ మేరకు సూచనప్రాయమైన సలహాలు వెల్లడించినట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసుకోవటంలో, పార్టీకి లాభం చేకూరేలా నిధులను సద్వినియోగం చేసుకోవటంలో విఫలమయ్యామన్న అభిప్రాయాన్ని సమావేశంలో వెల్లడించినట్టు సమాచారం. పార్టీ శ్రేణులన్నీ తమతోనే ఉన్నాయనీ, వారిని ఉత్సాహపరిచేలా స్పష్టమైన విధానంతో ముందుకు పోవాల్సి ఉందని సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలిసింది. అధికారపార్టీపై ప్రజల్లో తీవ్రమైన అసంత ప్తి ఉందనీ, కాంగ్రెస్ పార్టీ 2014 కన్నా ఇపుడు బలంగా ఉందని ఒక ముఖ్యనేత చెప్పినట్టు తెలిసింది. రాజకీయ సమీకరణలు వేగంగా మారిపోతున్నాయనీ, ప్రొఫెసర్ కోదండరామ్ పార్టీ పెడితే కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్న విషయం కూడా చర్చకు వచ్చినట్టు తెలిసింది. తెలుగుదేశంకు చెందిన మాజీ మంత్రి ఇ.పెద్దిరెడ్డి, బీజేపీ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డిలు కూడా కాంగ్రెస్‌లోకి వెళ్ళే ఆలోచనలో ఉన్నారనీ, ఈ నేపథ్యంలో బీజేపీలో కూడా రిక్రూట్‌మెంట్ ప్రారంభించాల్సిన అవసరం ఉందనీ, లేదంటే పార్టీ శ్రేణులు నైతికంగా బలహీనపడతారని మరో నాయకుడు తమ అభిప్రాయాన్ని వెల్లడించినట్టు తెలిసింది.

**సీట్లు పెంపెనకు విముఖం..**

తెలంగాణ అసెంబ్లీ స్థానాల పెంపునకు రాష్ట్ర బీజేపీ నేతలు విముఖంగా ఉన్నారు. అసెంబ్లీ స్థానాల పెంపు వల్ల పార్టీకి ఎలాంటి లాభం లేకపోగా, నష్టం జరుగుతుందన్న అభిప్రాయాన్ని అమిత్ షా వద్ద వెల్లడించినట్టు తెలిసింది. అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచటం, కెసిఆర్ తో పొత్తు పెట్టుకుని 2019 ఎన్నికల్లో పోటీ చేయటంపై బిజెపి జాతీయ నాయకత్వం ఆలోచిస్తున్నట్టు జరుగుతున్న ప్రచారంపై ఢిల్లీలో ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. ఇపుడున్న 119 సీట్లను 153కి పెంచటం ద్వారా బిజెపికి లాభం చేకూరకపోగా, మరింత నష్టం చేసే అవకాశం ఉందని ఒక నాయకుడు క్షేత్రస్థాయిలో గతంలో వచ్చిన ఓట్ల వివరాలు, సీట్ల సంఖ్య పెరిగితే గెలుపు ఓటములపై అవి చూపించే ప్రభావంపై నివేదిక సమర్పించినట్టు తెలిసింది.




రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎస్‌కే జోషికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న ట్రాన్స్‌కో-జెన్‌కో సీఎండీ డి. ప్రభాకర్‌రావు

## గాంధీభవన్‌లో మల్ రెడ్డి అనుచరుల ఆందోళన

హైదరాబాద్, ఫిబ్రవరి 1(మనం న్యూస్): మాజీ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికే ఇబ్రహిం పట్నం టికెట్ ఇవ్వాలని కోరుతూ ఆయన అనుచరులు గురువారం నాడు గాంధీభవన్‌లో ఆందోళన చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు క్యామ మల్లేష్ తనకే టికెట్ వచ్చిందని అసత్య ప్రచారం చేసుకుంటున్నారని పీసీసీ ఇంఛార్జ్ రామచంద్ర కుంతియాకు , పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌కు మల్ రెడ్డి ఫిర్యాదు చేశారు. గతంలో ఆయనకు టికెట్ ఇవ్వడంవల్లే భువనగిరి పార్లమెంట్ సీటు ఓడిపోయామని మల్ రెడ్డి ఆరోపించారు. వచ్చే ఎన్నికలో గెలిచే వారికే టికెట్ ఇస్తామని ఉత్తమ్ తమకు హామీ ఇచ్చారని చెప్పారు.

## సెన్సెక్స్ ఫిబ్రవరి 1 2018


35,906.66




| పెరిగినవి | % | తగ్గినవి | % |
|---|---|---|---|
| ఎం అండ్ ఎం | 4.44 | ఓఎన్‌జీసీ | -4.06 |
| లార్సెన్ టూబ్రో | 2.77 | సన్ ఫార్మా | -3.07 |
| ఇండస్ఇండ్ | 2.44 | డాక్టర్ రెడ్డీస్ | -2.30 |
| బజాజ్ ఆటో | 2.13 | ఎస్‌బీఐ | -2.04 |
| ఏసియన్ పెయింట్స్ | 1.89 | ఐసీఐసీఐ బ్యాంకు | -1.77 |

## నిఫ్టీ ఫిబ్రవరి 1 2018

11016.90




| పెరిగినవి | % | తగ్గినవి | % |
|---|---|---|---|
| ఎం అండ్ ఎం | 4.68 | సన్ ఫార్మా | -4.41 |
| ఐషర్ మోటార్స్ | 4.17 | ఓఎన్‌జీసీ | -4.20 |
| బజాజ్ ఫైనాన్స్ | 3.08 | డాక్టర్ రెడ్డీస్ | -3.03 |
| లార్సెన్ | 2.76 | అరబిందో | -2.91 |
| ఇండస్ఇండ్ | 2.42 | లుపిన్ | -2.64 |

## టాప్ లూజర్స్ 1 ఫిబ్రవరి

35,906.66


| పాయింట్లు | బి.ఎస్.ఇ సెన్సెక్స్ | % |
|---|---|---|
| 195.10 | ఓఎన్‌జీసీ | -4.06% |
| 556.25 | సన్ ఫార్మా | -3.99% |
| 2156.95 | డాక్టర్ రెడ్డీస్ | -3.07% |
| 305.55 | ఎస్‌బీఐ | -2.30% |
| 345.75 | ఐసీఐసీఐ బ్యాంకు | -2.04% |
| 944.10 | రిలయన్స్ | -1.77% |
| 696.30 | టాటా స్టీల్ | -1.24% |
| 9402.95 | మారుతి సుజుకి | -1.17% |
| 394.65 | టాటా మోటార్స్ | -1.15% |
| 301.25 | విప్రో | -1.12% |

-58.36

## బులియన్| గత 7 రోజులు




## రూపాయి వర్సెస్ డాలర్




# చీర్స్ చెప్పని స్టాక్ మార్కెట్లు

## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీలు






ముంబయి: స్టాక్ మార్కెట్లు గురువారం తీవ్ర హెచ్చు తగ్గులను చవి చూశాయి. ఈక్విటీలపై దీర్ఘకాల క్యాపిటల్ గెయిన్స్ పన్ను వంటి బడ్జెట్ ప్రతిపాదనలకు మార్కెట్లు విముఖత ప్రదర్శించాయి. ఫలితంగా, బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బి.ఎస్.ఇ) 30 షేర్ల సున్నిత సూచి 'సెన్సెక్స్' 58 పాయింట్లు నష్టపోయిన స్థితిలో ముగిసింది. 2017-18 సంవత్సరపు కోశ సంబంధ లోటు లక్ష్యాన్ని ఇంతకుముందు పేర్కొన్న 3.2 శాతంగా కాక, జి.డి.పి.లో 3.5 శాతానికి పెంచడం కూడా దేశీయ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. సానుకూల దృక్పథంతో 36,048.99 పాయింట్ల వద్ద మొదలైన 'సెన్సెక్స్' బడ్జెట్ సమర్పణ సమయంలో 36,256.83 పాయింట్లకు పెరిగింది. కానీ, అరుణ్ జైట్లీ దీర్ఘకాలిక మూలధన లబ్ధి పన్ను ప్రకటించిన తర్వాత ప్రతికూలంగా మారింది. 35,501.74 పాయింట్ల కనిష్ఠ స్థాయికి చేరుకుంది. అయితే, తర్వాత పుంజుకుని 35,906.66 పాయింట్ల వద్ద ముగిసింది. అప్పటికీ అది 58.36 పాయింట్లు కోల్పోయినట్లు లెక్క.

నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' కూడా ఉత్థాన పతనాలు చూసింది. మొత్తంమీద 10.80 పాయింట్లు క్షీణించి గురువారం 11,016.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రా-డేలో అది 11,117.35 పాయింట్లు, 10,878.80 పాయింట్ల మధ్య ఊగిసలాడింది.

### కోశ సంబంధ లోటు

మార్చి 31తో ముగుస్తున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కోశ సంబంధ లోటు తొలుతటి అంచనా 3.2 శాతం నుంచి 3.5 శాతానికి పెరగగలదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. 2018-19 సంవత్సరానికి ఆ లక్ష్యాన్ని 3.3 శాతంగా నిర్ణయించారు. ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్.ఆర్.బి.ఎం) చట్టం ప్రకారం అది 3 శాతంగానే ఉండాలి. కోశ సంబంధ లోటు ను తగ్గించడానికే ప్రభుత్వం కట్టుబడి ఉందని జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. 2014- 15లో 4.1 శాతంగా ఉన్న కో శ సంబంధ లోటును ఆ తదుపరి సంవత్సరంలో 3.9 శాతానికి, 2016-17లో మరింతగా 3.5 శాతానికి తగ్గించగలిగానని ఆయన చెప్పుకున్నారు. కోశ సంబంధ లోటు దేశ సార్వభౌమాధికార రేటింగ్‌పైన, రుణ మా ర్కెట్‌పైన కూడా ప్రభావం చూపిస్తుంది. మాజీ రెవిన్యూ కార్యదర్శి ఎన్.కె. సింగ్ నేతృత్వంలోని ఎఫ్.ఆర్.బి.ఎం సమీక్షా ప్యానెల్ 2023 నాటికి రుణం, జి.డి.పి మధ్య నిష్పత్తి 60 శాతంగా, వచ్చే 3 ఏళ్ళకు కోశ సంబంధ లోటు 3 శాతం మించకుండా ఉండేట్లు చూడాలని సిఫార్సు చేసింది.

### ఇమాందారీ కా ఉత్సవ్

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2016 నాటి పెద్ద నోట్ల రద్దును నిజాయతీకి పట్టం కట్టే ఉత్సవంతో పోల్చారు. నిజాయతీపరులైన పన్ను చెల్లింపుదార్లు దాన్ని గుప్త ధనాన్ని బహిరంగపరచే 'ఇమాందారీ కా ఉత్సవ్'గా స్వాగతించారని ఆయన చెప్పారు. రిటర్నుల దాఖలులో కొత్తవారి సంఖ్య 2015-16లో 66.26 లక్షలు కాగా, 2016-17లో వారి సంఖ్య 85.51 లక్షలకు పెరిగిందని ఆయన తెలిపారు. 2014-15 ప్రారంభంలో 6.47 కోట్లుగా ఉన్న ప్రభావశీల పన్ను చెల్లింపుదార్ల సంఖ్య 2017 మార్చి అంతానికి 8.27 కోట్లకు పెరిగిందని ఆయన చెప్పారు. బి.జె.పి నేతృత్వంలోని ప్రభుత్వం 2014 మేలో అధికారంలోకి వచ్చింది. పెద్ద నోట్ల రద్దు అనంతరం భారతీయ ఆర్థిక వ్యవస్థ మరింత నియతంగా రూపుదిద్దుకుంటోందని, డిజిటల్ లావాదేవీల సంఖ్య పెరుగుతూ వస్తోందని జైట్లీ వెల్లడించారు.

### ఈక్విటీ ప్రతిఫలాలపై పన్ను

ఈక్విటీ ఓరియంటెడ్ మ్యూచువల్ ఫండ్ల నుంచి పంపిణీ అయిన ఆదాయంపై బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం మదుపరులు 10 శాతం పన్ను చెల్లించవలసి ఉంటుంది. స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయడానికి ఇటీవలి కాలంలో మ్యూచువల్ ఫండ్లే కీలక మార్గంగా ఆవిర్భవించాయి. లక్ష రూపాయలు మించిన దీర్ఘకాలిక మూలధన లబ్ధిపై 10 శాతం పన్ను ప్రవేశపెట్టడం వల్ల మొత్తంమీద ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. దేశీయ మ్యూచువల్ ఫండ్లు గత ఏడాది స్టాక్ మార్కెట్లలోకి ఏకంగా లక్ష కోట్ల రూపాయలను ప్రవహింపజేశాయి. ఆ మొత్తం 2016లో రూ. 48,000 కోట్లకు పైన, 2015లో రూ. 70,000 కోట్లకు పైన ఉంది. నిజానికి, గత కొద్ది సంవత్సరాలుగా, ఈక్విటీలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్.పి.ఐలు) పెడుతున్న మొత్తంకన్నా మ్యూచువల్ ఫండ్లు పెడుతున్న మొత్తం ఎక్కువగా ఉంది. ఈక్విటీ ఓరియంటెడ్ ఫండ్లు, డివిడెండ్ పంపిణీ ఫండ్లు, గ్రోత్ ఓరియంటెడ్ ఫండ్ల మధ్య సమాన పోటీ అవకాశాలు కల్పించడానికి పంపిణీ ఆదాయంపై 10 శాతం పన్ను ప్రతిపాదన తీసుకువస్తున్నట్లు జైట్లీ ప్రకటించారు. షేర్లు, బాండ్లు, డిబెంచర్లు, డెరివేటివ్ యూనిట్లు, సెక్యూరిటీలలో వడ్డీ, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో




లావాదేవీలపై ఇప్పటికే ఉన్న సెక్యూరిటీల లావాదేవీ పన్ను (ఎస్.టి.టి) ఉంది. ప్రస్తుతం ఒక ఏడాది తర్వాత అమ్మిన ఈక్విటీలపై వచ్చిన లాభానికి క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఉంది.



వ్యవసాయ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరచడంపై 2018-19 బడ్జెట్ దృష్టి కేంద్రీకరిస్తుందని అరుణ్ జైట్లీ ప్రకటించిన తర్వాత, వ్యవసాయ సంబంధిత షేర్ల ధరలు 10 శాతం వరకు పెరిగాయి. బి.ఎస్.ఇ.లో ఎన్.ఏ.సి.ఎల్ ఇండస్ట్రీస్ షేర్ ధర ఏకంగా 9.64 శాతం పెరిగింది. పి.ఐ ఇండస్ట్రీస్ (6.49 శాతం), శక్తి పంప్స్ ఇండియా (5.89 శాతం), యాక్షన్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ (5.66 శాతం), మోన్‌శాంటో ఇండియా (4.84 శాతం) షేర్ల ధరలు కూడా పెరిగాయి. షేర్ ధరలు పెరిగిన మిగిలినవాటిలో, ఏరీస్ ఆగ్రో (4.99 శాతం), ధనుక అగ్రిటెక్ (3.89 శాతం), కావేరి సీడ్ కంపెనీ (3.4 శాతం), యు.పి.ఎల్ (2.61 శాతం) కూడా ఉన్నాయి.

## అగ్రి షేర్లలో జోష్

ధాన్యం వంటి ఖరీఫ్ పంటల మద్దతు ధరను వాటి ఉత్పాదక వ్యయంకన్నా కనీసం 50 శాతం ఎక్కువగా నిర్ణయించనున్నట్లు జైట్లీ రైతులకు పెద్ద వరం ప్రకటించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ రుణ లక్ష్యాన్ని 10 శాతం పెంచి రూ. 11 లక్షల కోట్లకు చేరుస్తున్నట్లు కూడా ఆయన ప్రకటించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని 2018-19 కేంద్ర బడ్జెట్‌ను సమర్పిస్తూ జైట్లీ పునరుద్ఘాటించారు. రైతులకు హెచ్చు ఆదాయం లభించేట్లు చేయడానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. రైతుల ఆదాయం 2022 నాటికి రెండింతలు పెరగాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన సంగతిని ఆయన గుర్తు చేశారు. మొక్కజొన్న, సోయాబీన్, కాయధాన్యాలతో సహా వచ్చే ఖరీఫ్ (వేసవిలో నాటిన)పంటల కనీస మద్దతు ధరను వాటి ఉత్పత్తి ధరకన్నా కనీసం ఒకటిన్నర రెట్లు ఎక్కువగా నిర్ణయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు జైట్లీ చెప్పారు. చాలా భాగం రబీ (శీతాకాలంలో నాటిన) పంటల మద్దతు ధరలను ఇదివరకే పెంచినట్లు ఆయన చెప్పారు.

# వృద్ధి-విద్యుత్ వినియోగం పెరుగుతాయి


న్యూఢిల్లీ: భారతదేశ ఆర్థిక వ్యవస్థ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 8.5 శాతం వృద్ధి చెందుతుందని, ఆర్థికవేత్తలు వేస్తున్న 7.5 శాతం అంచనా ''సంప్రదాయబద్ధంగా ఉంది'' అని విద్యుత్ శాఖ మంత్రి ఆర్.కె. సింగ్ చెప్పారు. '' వచ్చే ఆర్థిక సంవత్సరంలో మన వృద్ధి రేటు 7.5 శాతాన్ని తాకగలదని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. వారు మరీ సంప్రదాయబద్ధంగా ఉన్నారనిపిస్తోంది. వృద్ధి కనీసం 8.5 శాతంగా ఉంటుంది'' అని గురువారం నాడిక్కడ 7వ ఇండియా ఎనర్జీ కాంగ్రెస్ నుద్దేశించి సింగ్ చెప్పారు. ''భారత్ గొప్ప సంపన్న దేశంగా పరిణమించే దశలో ఉంది...వేగం మొదలైంది. గత త్రైమాసిక ఫలితాలు దాన్ని వెల్లడించాయి. వస్తువులు, సేవల పన్ను వ్యవస్థకు అలవాటుపడ్డాం. జి.ఎస్.టి. వసూళ్ళలో వృద్ధి నమోదైంది. జి.ఎస్.టి. పన్ను పునాది 50 శాతం పెరుగుదల కనిపించింది. జి.ఎస్.టి. వ్యవస్థ కుదుటపడ్డ తర్వాత, పన్ను వసూళ్ళు పెరగవచ్చు. కనుక, వృద్ధి 7.5 శాతంగానే ఉంటుందని నేను అనుకోవడం లేదు. అది కనీసం 8.5 శాతంగా ఉండవచ్చు. మనం ఆ స్థాయిలో వృద్ధి చెందవలసిన అవసరం ఉంది'' అని ఆయన అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 6.75 శాతంగా ఉన్న ఆర్థిక వృద్ధి రేటు 2018-19లో 7-7.5 శాతం ఉండగలదని ఈ వారం మొదట్లో పార్లమెంట్ ముందుంచిన ఆర్థిక సర్వే వెల్లడించింది.



పెరగనున్న విద్యుత్ వినియోగం

దేశంలో ప్రస్తుతం తలసరి విద్యుత్ వినియోగం 1020 యూనిట్లుగా ఉందని, అది మూడు లేదా నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉందని సింగ్ చెప్పారు. ''దేశంలో 2030 నాటికి, విద్యుదుత్పాదన సామర్థ్యంలో 40 శాతం పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే ఉంటుంది. ఆ లక్ష్యాన్ని మించి సాధించగల బాటలో మనం పయనిస్తున్నాం'' అని నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖను కూడా నిర్వహిస్తున్న సింగ్ అన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల సామర్థ్య లక్ష్యాన్ని 175 గిగా వాట్లుగా పెట్టుకున్నాం, కానీ, భారత్ 2022 నాటికి 200 గిగా వాట్లకు చేరుకోవచ్చునని ఆయన తెలిపారు. ''మనకు ఇప్పటికే 62 గిగా వాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఉంది. దాదాపు 30 గిగా వాట్ల (పునరుత్పాదక ఇంధన సామర్థ్యం) ఏర్పడుతున్న స్థితిలో ఉంది. దాంతో 92 గిగా వాట్లు అవుతాయి. మనం సుమారు 14 గిగా వాట్లను బయట నుంచి తెచ్చుకుంటున్నాం. దానితో 106 మెగావాట్లు అవుతాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 40 గిగా వాట్లు, ఆ తర్వాత (2019-20లో) మరో 40 గిగా వాట్లు బయట నుంచి తెచ్చుకుంటాం'' అని ఆయన చెప్పారు. భారత్‌లో 2030 నాటికి విద్యుత్ బ్యాటరీలతో నడిచే వాహనాల నిష్పత్తి గణనీయంగా ఉంటుందని, అది శిలాజ ఇంధనాల దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గిస్తుందని ఇ-మొబిలిటీ గురించి ప్రస్తావిస్తూ ఆయన చెప్పారు. ''ఇంధన వినియోగం రానురాను విద్యుచ్ఛక్తి ద్వారానే ఎక్కువగా ఉంటుంది. వాస్తవానికి వినిమయంలో 90 నుంచి 95 శాతం విద్యుచ్ఛక్తి ద్వారానే ఉంటుంది. ఆ విద్యుచ్ఛక్తిలో అత్యధికంగా 75 శాతం పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే ఉండవచ్చు. మొత్తం వినియోగానికి సరిపడినంతా వాటి ద్వారానే వస్తుందని నేను అనడం లేదు. ఎందుకంటే, స్టోరేజీ ఇంకా స్వయంభరణ శక్తి కలిగిన ప్రతిపాదనగా లేదు. పునరుత్పాదక ఇంధన వనరులకు, జల విద్యుచ్ఛక్తి లేదా గ్యాస్ ఆధారిత విద్యుచ్ఛక్తికి మధ్య సమతూకం తీసుకురావడం వివేకం అనిపించుకుంటుంది. స్టోరేజీ స్వావలంబన కలిగినదిగా తయారైన తర్వాత, పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే 80-90 శాతం శక్తిని వాడుకోవచ్చు'' అని సింగ్ అన్నారు.

## వయో వృద్ధులపై వరాల జల్లు



న్యూఢిల్లీ: సీనియర్ సిటిజన్ల వడ్డీ ఆదాయంపై మినహాయింపు పరిమితిని ఐదు రెట్లు పెంచి ఏడాదికి రూ. 50,000 చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. ఆయన 2018-19 కేంద్ర బడ్జెట్‌లో సీనియర్ పౌరులకు పలు ప్రయోజనాలు ప్రకటించారు. ఆరోగ్య బీమా ప్రీమియం, వైద్య ఖర్చులకు సెక్షన్ 80 డి కింద ఇప్పుడున్న మినహాయింపు పరిమితిని రూ. 30,000 నుంచి రూ. 50,000లకు పెంచుతున్నట్లు కూడా ఆయన తెలిపారు. వారు ఈ ఖర్చుల కింద ఆదాయ పన్నులో రూ. 50,000 వరకు మినహాయింపు కోరవచ్చు. కొన్ని ప్రాణాంతక అనారోగ్యాలకు గురైనప్పుడు సీనియర్ పౌరులందరూ 80డిడిబి కింద లక్ష రూపాయల వరకు వైద్య వ్యయంపై మినహాయింపు కోరవచ్చు. ''పన్నుల్లో ఈ రాయితీలతోపాటు, ప్రధాన్ మంత్రి వయ వందన యోజనను 2020 మార్చి వరకు పొడిగించాలని కూడా ప్రతిపాదిస్తున్నాను. ఆ పథకం కింద భారత జీవిత బీమా సంస్థ 8 శాతం వార్షిక ప్రతిఫలాలను తప్పనిసరిగా అందిస్తుంది'' అని జైట్లీ చెప్పారు. ఈ పథకం కింద సీనియర్ పౌరులు ప్రస్తుతం రూ. 7.5 లక్షల వరకు మదుపు చేసే అవకాశం ఉంది. దాన్ని రెట్టింపు చేసి రూ. 15 లక్షలకు పెంచుతున్నట్లు జైట్లీ తెలిపారు. గౌరవ ప్రదమైన జీవితం గడిపే హక్కు సర్వ సాధారణంగా అందరికీ ఉంది. సీనియర్ పౌరులకు అది మరింత ఎక్కువ వర్తిస్తుందని జైట్లీ అన్నారు. ''మనల్ని పెంచి పెద్ద చేసినవారి ఆలనపాలన చూడడం వారికిచ్చే ఉన్నత గౌరవాలలో ఒకటి...ఈ రాయితీలు సీనియర్ పౌరులకు రూ. 4,000 కోట్ల మేర లబ్ధి చేకూరుస్తాయి'' అని ఆర్థిక మంత్రి తెలియజేశారు.

## క్రిప్టో కరెన్సీలు నిర్మూలిస్తాం




న్యూఢిల్లీ: బిట్‌కాయిన్లతో సహా క్రిప్టో కరెన్సీలన్నీ చట్ట విరుద్ధమైనవేనని, వాటి వినియోగాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని అరుణ్ జైట్లీ గురువారం ప్రకటించారు. ''క్రిప్టో కరెన్సీలను, కాయిన్‌లను ప్రభుత్వం చట్టబద్ధమైనవిగా పరిగణించడం లేదు. క్రిప్టో ఆస్తుల ఉపయోగాన్ని నిర్మూలించడానికి అన్ని చర్యలు తీసుకుంటుంది'' అని ఆయన లోక్ సభలో 2018-19 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ చెప్పారు. భారతదేశంలో వర్చువల్ కరెన్సీలను పాలించే నిబంధనలు ఏవీ లేవని, అటువంటి కరెన్సీలు నిర్వహించడానికి ఏ సంస్థ/కంపెనీకీ ఆర్.బి.ఐ. ఎటువంటి లైసెన్సూ మంజూరు చేయలేదని జైట్లీ గత ఏడాది పార్లమెంట్‌కు తెలియజేశారు. వర్చువల్ కరెన్సీల పెరుగుతున్న వినియోగంపై అడపాదడపా వివిధ వేదికలపై వ్యక్తమవుతున్న ఆందోళనలను, నియంత్రణా పరంగా ఎదురవుతున్న సవాళ్ళను పరిగణనలోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఫైనాన్షియల్ సర్వీసుల శాఖ, దేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆర్.బి.ఐ, నీతి ఆయోగ్, ఎస్.బి.ఐ, డి.ఇ.ఏలకు చెందిన ప్రతినిధులతో ఆర్థిక వ్యవహారాల శాఖ (డి.ఇ.ఏ) ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆ కమిటీ నివేదికను సమర్పించిందని, అది పరిశీలనలో ఉందని జైట్లీ గురువారంనాడు లోక్‌సభకు తెలిపారు.

## పెరుగుతున్న ఎగుమతులు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ ఎగుమతులు సుమారు 15 శాతం పెరగవచ్చని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. ''మన ఎగుమతులు 2017-18లో సుమారు 15 శాతం వృద్ధి చెందవచ్చు'' అని ఆయన 2018-19 కేంద్ర బడ్జెట్‌ను సమర్పిస్తూ చెప్పారు. దేశ వస్తువుల ఎగుమతులు 2017 డిసెంబర్‌లో 12.36 శాతం పెరిగి 27.03 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువైనవిగా నమోదయ్యాయి. 2017-18 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ కాలంలో సమష్టి ఎగుమతులు 12.05 శాతం పెరిగి 223.512 అమెరికన్ డాలర్ల విలువైనవిగా నమోదయ్యాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎగుమతుల విలువ 274.64 బిలియన్ డాలర్లుగా వెల్లడైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో అది 262.29 అమెరికన్ డాలర్లుగా ఉంది. భారతదేశం నుంచి ఎగుమతి పథకం కింద వస్తువులు, సేవల రంగాలకు ప్రభుత్వం ప్రస్తుతం ఎగుమతి ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. ప్రధానంగా సిబ్బంది ఎక్కువ సంఖ్యలో ఉన్న రంగాల నుంచి వస్తువులు, సేవల ఎగుమతులు పెంపొందించేందుకు ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో రూ. 8,450 కోట్ల విలువైన ప్రోత్సాహకాలను ప్రకటించింది.

## సామాన్య గృహాలకు ప్రత్యేక నిధి



న్యూఢిల్లీ: చౌక ధరలకు గృహ నిర్మాణ రంగానికి ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు. ఈ నిర్ణయం సరసమైన ధరలతో కూడిన గృహ నిర్మాణ రంగానికి ఆనందోత్సాహాలు తేగల అవకాశం ఉంది. వివిధ వస్తువులు, సేవలపై జి.ఎస్.టి.రేట్ల హేతుబద్ధీకరణకు జి.ఎస్.టి. కౌన్సిల్ గత వారం సిఫార్సు చేసింది. ఆ జాబితాలో చౌక ధరలకు గృహ నిర్మాణాలు కూడా ఉన్నాయి. నిర్మాణంలో ఉన్న ఆస్తుల మొత్తం విలువపై 8 శాతం జి.ఎస్.టి వసూలు చేస్తారు. ఇంతకుముందు అమలులో ఉన్న 12 శాతంకన్నా అది 4 శాతం తక్కువ. సామాన్య గృహ నిర్మాణ విభాగానికి గత ఏడాది బడ్జెట్‌లో పరిశ్రమ హోదా కల్పించారు. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజనలో కొత్తగా ప్రవేశపెట్టిన నిబంధన కింద దానికి కేంద్రం నుంచి మద్దతు కూడా లభించింది. ఇన్వెస్టర్ల దృక్కోణం నుంచి చూసినప్పుడు, బడ్జెట్ అపార్ట్‌మెంట్లు సులభమైనవి, లాభదాయకమైనవి. అమ్మడానికైనా, అద్దెకివ్వడానికైనా తేలిక. పెట్టుబడిపై ప్రతిఫలం కూడా మరీ ఏమంత తోసిపుచ్చదగినదిగా ఉండదు. దేశంలోని పట్టణాల్లో గృహ వసతికి తీవ్ర కొరత ఉంది. అయినా, ఈ పరిస్థితికి పూర్తి విరుద్ధంగా, భారతీయ నగరాల్లో అనేక గృహాలు ఖాళీగా ఉన్నాయి. భారతదేశ జనాభా లెక్కల సేకరణ (2011) ప్రకారం 9 కోట్ల గృహాలలో కోటి పది లక్షల యూనిట్లు ఖాళీగా ఉన్నాయి.

మనం టెక్నాలజీ
శుక్రవారం, 2 ఫిబ్రవరి 2018
www.manamnews.com

**పండుగుల సంబరాలు ఎలా జరుపుకుంటామో! కొత్త టెక్నాలజీ వస్తే కూడా ప్రియులకూ అదో సంబరం. ఈ మధ్య ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ కంపెనీలన్నీ ఓ చోట చేరి సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చాయి. చూసేందుకు వచ్చిన టెక్ ప్రియులు ఒకటే సందడి. మరి టెక్ పండగలో ఆకట్టుకున్న టెక్నాలజీ సంగతులు మనం తెలుసుకుందాం...**



# టెక్నాలజీ అదుర్స్

## టెక్ ప్రియులకు సందడే.. సందడి



## సూపర్ స్పీకర్

ఫోన్‌ని జేబులో పెట్టుకున్న మాదిరిగానే స్పీకర్‌ని పెట్టుకుని మ్యూజిక్ మస్తీ చేయాలంటే ఈ 'సూపర్ స్లిమ్ బ్లూటూత్ స్పీకర్-ఎస్‌టీ150 ఉంటే సరి. దీని బరువు ఎంతంటే 450 గ్రాములే. దుమ్ము చేరకుండా 'డస్ట్‌ప్రూఫ్', కిందపడినా పగలకుండా 'షాక్‌ప్రూఫ్' రక్షణ కవచాలతో తీర్చిదిద్దారు. 10 మీటర్ల దూరం వరకూ నాణ్యమైన 'బాస్' క్వాలిటీతో మ్యూజిక్ వినిపిస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 4 గంటల పాటు పని చేస్తుంది. బ్యాటరీ సామర్థ్యం 700ఎంఏహెచ్. ధర రూ.1,770.




## ఎరుపెక్కిన వన్‌ప్లస్

ట్రెండీగా ఎరుపు రంగులో వన్‌ప్లస్ కొత్త మోడల్ దేశీయ మార్కెట్‌లో సందడి చేస్తోంది. మోడల్ పేరు '5టీ లావా రెడ్ ఎడిషన్'. ర్యామ్ 8జీబీ. స్టోరేజ్ సామర్థ్యం 120జీబీ. వెనక డ్యూయల్ (16 మెగాపిక్సల్, 20 మెగాపిక్సల్) కెమెరాలు ఉన్నాయి. ముందు భాగంలో 16 మెగాపిక్సల్ కెమెరా ఉంది. 4కే రిజల్యూషన్‌తో వీడియోలు తీయొచ్చు. ఆండ్రాయిడ్‌ని పోలి ఉండే ఆక్సిజన్ ఓఎస్‌తో పని చేస్తుంది. ధర రూ.37,999.



## ఇన్‌స్టాగ్రామ్ యాక్టివ్

వాట్సాప్‌లో మాదిరిగా మిత్రులు ఎంతసేపటికి ముందు ఆన్‌లైన్‌లో ఉన్నారో (ఆన్‌లైన్ స్టేటస్) తెలుసుకునేందుకు ఇన్‌స్టాగ్రామ్‌లోనూ ఆప్షన్ అందుబాటులోకి వచ్చేసింది. దీంట్లో ప్రత్యేకత ఏంటంటే... మిమ్మల్ని ఫాలో అవ్వనివారి స్టేటస్‌ని చూడొచ్చు. మొబైల్ ఆప్‌లో ఈ సౌకర్యాన్ని ఎనేబుల్ చేసి వాడుకోవచ్చు. మీ స్టేటస్ ఇతరులకు తెలియక్కర్లేదు అనుకుంటే ఆప్షన్‌ని డిసేబుల్ చేయవచ్చు. అంతేనా... 'టైప్' పేరుతో మరో సరికొత్త సౌకర్యాన్ని పరిచయం చేసేందుకు సిద్ధం అవుతోంది. ఇప్పటి వరకూ ఫొటోలు, వీడియోలకు మాత్రమే పరిమితమైన ఇన్‌స్టాగ్రామ్‌లో పలు టెక్స్ట్ ఫార్మెట్స్‌తో మెసేజ్‌లనూ షేర్ చేయవచ్చేమో!!



## ఒకే దాంట్లో... మూడు ఫోన్లు

వేలు పోసి ఫోన్ కొనడం. దాంట్లో ముఖ్యమైన డేటాని సేవ్ చేయడం. ఇతరులు, ఇంట్లో పిల్లలకు ఫోన్ ఇవ్వాల్సివస్తే భయంతో సందేహించడం. ఇది ఎక్కువ మందికి ఎదురయ్యే సమస్య. మరేంటి దీనికి పరిష్కారం? వాడుతున్న ప్రైమరీ ఫోన్‌కి మరో రెండు ఫోన్లు జత చేస్తే సరి. త్రీడి ప్రింట్ సహాయంతో రూపొందించిన ఓ కేస్‌లో మూడు ఫోన్లను అమర్చుకొనే వెసులుబాటు ఉంది. చూడటానికి ఒక ఫోన్‌లానే కనిపించినా దీంట్లో మరో రెండు ఉంటాయి. నిత్యం వాడే ప్రైమరీ ఫోన్‌తో అనుసంధానమై ప్రత్యేక 'ఆండ్రాయిడ్ కస్టమ్ మేడ్ షేరింగ్' ఓఎస్‌తో పని చేస్తాయి. అవసరం మేరకు స్లైడ్ పద్ధతిలో వీటిని బయటికి తీసి వాడుకోవచ్చు. ఇందులో ఒకటి మీడియం సైజులో, రెండోది బాగా చిన్నదిగా ఉంటుంది. ఫోన్ కావాలని పిల్లలు మారం చేస్తే వారికి కావాల్సిన ఆప్స్‌ని ప్రైమరీ ఫోన్ ద్వారా మరో ఫోన్‌లోకి షేరింగ్ చేసి ఇవ్వొచ్చు. అంటే... మీరు ఇచ్చిన రెండో ఫోన్‌ని ప్రైమరీ ఫోన్‌తో మానిటర్ చేయవచ్చన్నమాట. ఇదే మాదిరిగా అవసరం మేరకు ఇతరులకూ ఫోన్‌ని ఇవ్వాల్సివస్తే వారి అవసరానికి సరిపడేలా సెకండరీ ఫోన్‌ని సెట్ చేసి ఇవ్వొచ్చు. దీంతో ప్రైమరీ ఫోన్, దాంట్లో ముఖ్యమైన డేటా సురక్షితంగా ఉంటుంది. 'ఎన్ఎఫ్‌సీ' టెక్నాలజీతో ప్రైమరీతో అనుసంధానమై మిగతా రెండు ఫోన్లూ పని చేస్తాయి.

### తోక ఊపే ఐబో



దీని పేరు ఐబో. సోనీ కంపెనీ తయారు చేసిన బుజ్జి పప్పీ. సీఈఎస్ షో అంతా కలియతిరుగుతూ.. అందర్నీ చూస్తూ తోకూపుతూ... తలాడిస్తూ కనిపించింది. అచ్చంగా ఇంట్లో పెంచుకునే బుజ్జి కుక్కపిల్లలానే అబ్బురపరిచింది. తలపై నిమిరితే తన్మయంతో దగ్గరైంది. దీనంతటికీ కారణం దీని బుర్రలోని కృత్రిమ మేధస్సు. స్పర్శకు స్పందించడమే కాదు. చెప్పిన మాట వింటూ కుటుంబసభ్యులతో కలిసిపోతుందట. ఇంతకీ 'ఐబో' అంటే అర్థమేంటో తెలుసా? తోడు. 1999లోనే ఇది ప్రపంచానికి పరిచయమైనా ఇప్పుడు తెలివిగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో ముందుకొచ్చింది.

### ముడుచుకునే టీవీ



ఎంత నాజూకు టీవీ అయినా టేబుల్‌పైన పెట్టాలి.. లేదా గోడకు తగిలించాల్సిందే. చూసినా... చూడకపోయినా... అలా నిత్యం కనిపిస్తూనే ఉంటుంది. పిల్లలు ఉన్న ఇంట్లో అయితే.. అందకుండా... ఏదీ తగలకుండా... జాగ్రత్త పడాల్సిందే. ఇలాంటివి ఏమీ లేకుండా టీవీని చుట్టచుట్టి ఓ బాక్స్‌లో పెట్టేస్తే. చూద్దాం అనుకున్నప్పుడు రిమోట్‌ని తాకగానే బాక్స్‌లో నుంచి బయటికి టీవీ పొడుచుకొస్తే! ఎల్‌జీ కంపెనీ తయారు చేసిన 'ఎల్‌జీ డిస్‌ప్లే' టీవీతో ఇది సాధ్యమే. ఓఎల్ఈడీ హెచ్‌డీ టీవీ తెర పరిమాణం 65 అంగుళాలు. చూడ్డానికి దళసరి కాగితంలా తెర కనిపిస్తుంది.

### డెలివరీ బాయ్ అక్కర్లేదు



అమెజాన్‌లో ఏదో వస్తువుగానీ.. లేదంటే వేడిగా తిందామాని ఓ పిజ్జానో ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే! మామూలుగా అయితే, వాహనంపై డెలివరీ బాయ్ తెచ్చి ఇస్తాడు. ఇది ఇప్పుడు. సమీప భవిషత్తులో డ్రైవరుతోగానీ... డెలివరీ బాయ్‌తోగానీ అక్కర్లేదు. టయోటా కంపెనీ అందుబాటులోకి తేనున్న 'ఈ-ప్యాలెట్' స్మార్ట్ వాహనం ఒక్కటి చాలు. దీన్ని నడిపేందుకు డ్రైవర్ అక్కర్లేదు. మిని వ్యానులా ఉండే దీంట్లో ఆర్డర్లు, అడ్రస్‌లను లోడ్ చేస్తే చాలు. మెరుపు వేగంతో డెలివరీ చేస్తుంది. అంతేనా... కార్యాలయాలకు ఉద్యోగుల్ని చేరవేస్తుంది.

### ఇదో కెమెరా కన్ను



కంటి చూపు లేనివారు లేదా చూపు పాక్షికంగా కోల్పోయినవారు పుస్తకాలు, పత్రికలు చదవడం కష్టమే కాదు... కొందరికి అసాధ్యం కూడా. అలాంటి వారికి చదివి వినిపించే కెమెరా కన్ను త్వరలోనే పరిచయం కానుంది. అదే 'ఆర్‌కామ్ మైఐ2.0'. చూపుడు వేలంత ఉన్న దీన్ని చిత్రంలో మాదిరిగా కళ్లజోడుకి అమర్చుకుని చదవాలనుకున్న వాటిని వేలితో చూపితే చాలు. శ్నాప్ తీసుకుని చక్కగా చదివి వినిపిస్తుంది. అంతేకాదు... షాపింగ్‌కి వెళ్లినప్పుడు కెమెరాకి చూపిన వాటిని గుర్తించి చెప్పడంతో పాటు రేటెంతో కూడా చెబుతుంది. కృ త్రిమ మేధస్సుతో మనుషుల ముఖాల్ని గుర్తించి వచ్చింది ఎవరనేది చెబుతుంది. ముఖ్యమైన 100 మంది వ్యక్తుల ముఖాల్ని గుర్తించేలా సెట్ చేసుకోవచ్చు.

### కారుకి ఓనరు తెలుసు



ఎప్పుడైనా కారు తాళాలు పోగొట్టుకుంటే వచ్చే ఇబ్బంది అంతా ఇంతా కాదు. ప్రత్యామ్నాయం చాలా కష్టం. మరైతే, ఇప్పుడొస్తున్న స్మార్ట్‌ఫోన్ మాదిరిగా కారు దగ్గరికి వెళ్లగానే మీ కారు మిమ్మల్ని గుర్తిస్తే! డోరు తెరుచుకుంటే! భవిష్యత్ కార్లలో ఇది సాధ్యమే. కావాలంటే చైనాకి చెందిన బైటన్ కంపెనీ తయారు చేసిన ఈ నమూనా కారుని చూడండి. ఇదో ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారు. దీంట్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ'తో యజమానిని గుర్తించి కారు డోరు తెరుచుకుంటుంది. కారు మొత్తాన్ని స్మార్ట్‌గా మేనేజ్ చేసేందుకు ముందు భాగంలో పెద్ద టచ్‌స్క్రీన్‌ని ఏర్పాటు చేశారు. ప్రత్యేక సెన్సర్లు నిత్యం డ్రైవరు హార్ట్‌రేట్, బీపీలను ట్రాక్ చేస్తాయి కూడా.




### గోడ లాంటి టీవీ

హాల్లోని గోడని చూస్తే టీవీ కనిపించడం మామూలే. కానీ, శ్యామ్‌సంగ్ తయారు చేసిన 'ద వాల్' టీవీని గోడకి పెడితే గోడ కనిపించకపోడం ఓ అద్భుతం. ఎందుకంటే టీవీ పరిమాణం ఎంతో తెలుసా? 146 అంగుళాలు. అంటే సుమారు... 34 అంగుల మిని సినిమా డిస్‌ప్లే అన్నమాట.



మైక్రోఎల్ఈడీ ప్యానల్స్‌తో ఇంత పెద్ద తెరని తీర్చిదిద్దారు. 4కే రిజల్యూషన్‌తో వీడియోలు చూడొచ్చు.

### ఇక అన్నీ స్మార్ట్!



స్కూల్... కాలేజీ... కార్పొరేట్ ఆఫీస్‌ల్లో ఎక్కడికి వెళ్లినా స్టాండ్‌పైనో... గోడకో వైట్‌బోర్డ్, బ్లాక్ స్కెచ్ లేదంటే బ్లాక్‌బోర్డ్, వైట్ స్కెట్ కనిపిస్తాయి. మీకు తెలుసా? ఇక మీదట వీటి స్థానంలో శామ్‌సంగ్ తయారు చేసిన 'ద శామ్‌సంగ్ ఫ్లిప్' కనిపిపంచొచ్చు. ఎందుకంటే... ఇదో బహుళ ప్రయోజనాల డిజిటల్ డిస్‌ప్లేగా 'వైట్‌బోర్డ్'గా పరిచయం కానుంది. నిలువు, అడ్డంగా తిప్పుకుని అవసరానికి అనువుగా వాడుకోవచ్చు. స్టైలస్‌తో బోర్డుపై రాసిన కంటెంట్‌ని ఎన్ఎఫ్‌సీ టెక్నాలజీతో ఫోన్, ట్యాబ్, ల్యాపీల్లోకి చిటికెలో కాపీ చేసుకోవచ్చు.

### 3డీ స్కానింగ్

ఫోన్ కెమెరాకి జూమింగ్ లెన్స్‌ని పెట్టుకుని డీఎస్ఎల్ కెమెరా మాదిరిగా ఫొటోలు తీసుకోవడం తెలుసు. కానీ, ఎప్పుడైనా స్మార్ట్ ఫోన్ వాడుకుని 3డీ స్కానింగ్ చేశారా? అయితే, మీరు 'బెల్లుస్3డీ ఫేస్ కెమెరా' గురించి తెలుసుకోవాల్సిందే. చిత్రంలో మాదిరిగా స్కానింగ్ పరికరాన్ని ఫోన్‌కి కనెక్ట్ చేసి ఎవరికివారే ముఖాన్ని స్కాన్ చేసుకోవచ్చు. క త్రిమ మేధస్సు (ఏఐ) సపోర్ట్‌తో స్కానర్ ముఖాన్ని అన్ని కోణాల్లో చిత్రీకరిస్తుంది. ఇలా చిత్రీకరించి 3డీ ఇమేజ్‌తో మోడళ్లు సరిపడే యాక్సరీస్, 3డీ ఫేస్ మాస్క్‌లను రూపొందించడం సులభం అవుతుంది.

### అత్యంత నాజూకు ల్యాపీ

ఫోన్లు, ట్యాబ్‌లతో పాటు ల్యాప్‌టాప్‌లూ నాజూకుగా మారిపోతున్నాయ్. అందుకు ఎసర్ పరిచయం చేసిన 'స్విఫ్ట్ 7' ఉదాహరణ. ప్రపంచంలోనే ఇది అత్యంత పల్చటి ఆల్ట్రాబుక్. మందం ఎంతంటే 8.98ఎంఎం. వచ్చే ఏప్రిల్ నాటికల్లా మార్కెట్‌లోకి తేనుంది. దీని తాకేతెర పరిమాణం 14 అంగుళాలు. రిజల్యూషన్ 1920లి1080 పిక్సల్స్. ఐ7 ప్రాసెసర్‌ని వాడారు. ఒక్కసారి ఛార్జ్ చేస్తే సుమారు 10 గంటల వరకూ వాడుకోవచ్చు.



## బొమ్మ శబ్దం

టీవీ తెర ఇప్పటి వరకు బొమ్మ మాత్రమే చూపిస్తోంది... శబ్దం వినిపించడానికి స్క్రీన్ వెనుకో లేక కిందో స్పీకర్లు ఉంటాయి. త్వరలో స్పీకర్లు కనిపించని టీవీలు రాబోతున్నాయి. చక్కనైన బొమ్మ చూపిస్తూ, వినసొంపైన శబ్దం వినిపించేలా సోనీ కొత్త తరహా స్క్రీన్లతో టీవీని రూపొందించింది. సోనీ ఏ1ఈ టీవీ పేరుతో త్వరలో లాంచ్ కానున్న ఈ టీవీ తెర ప్రత్యేకంగా ఉండబోతోంది. ఓఎల్ఈడీ తరహాలో ఉండే వీటిలో స్పీకర్లు కూడా ఉండబోతున్నాయి. ఓఎల్ఈడీ తెరకు లైట్ల అవసరం లేకపోవడంతో వాటి స్థానంలో స్పీకర్‌ను ఇమిడ్చి కొత్త టీవీలు రూపొందించారు. '4కె హెచ్‌డీఆర్ ప్రాసెసర్ ఎక్స్ 1 ఎక్స్‌ట్రీమ్' ప్రాసెసర్ వల్ల ఇది సాధ్యమవుతుంది. డాల్బీ విజన్ హెచ్‌డీఆర్ సాంకేతికతతో రూపొందే ఈ టీవీ తెరలు చాలా పలుచగా ఉంటాయి. ఇందులో 55, 65, 77 అంగుళాల వెర్షన్లున్నాయి. వీటి ధర, విడుదల తేదీల విషయాల్ని త్వరలో ప్రకటిస్తారు.



## సూట్‌కేస్ ఫాలోయింగ్

దూర ప్రాంతాలకు వెళ్లేప్పుడు ఒకటే ఇబ్బంది. సూట్‌కేస్‌ని మోసుకెళ్లడం. లేదంటే లాక్కెళ్లడం. ఇదేం లేకుండా మనం నడుస్తూ వెళ్తుంటే... మనల్ని సూట్‌కేస్ ఫాలో అయితే! ఏదో ఫాంటసీ సినిమాలో అయితే సాధ్యమే అనుకోవక్కర్లేదు. ఈ ఏడాదిలో ఇది సాధ్యమే. చైనా కంపెనీ తయారు చేసిన 'ఫార్వార్డ్‌ఎక్స్ సీఎక్స్-1' స్మార్ట్ సూట్‌కేస్ అందుకు సాక్ష్యం. హోటళ్లు, ఎయిర్‌పోర్టుల్లో వెళ్లేటప్పుడు మిమ్మల్నే చూస్తూ ఫాలో అయిపోతుంది. అందుకు దీంట్లో కృత్రిమ మేధస్సుతో కూడిన కెమెరాల్ని నిక్షిప్తం చేశారు. ఒకవేళ యజమాని సూట్‌కేస్ గుర్తించలేనంత దూరం వెళ్తున్నా... బ్యాటరీ శాతం తగ్గుతున్నా వెంటనే మేసేజ్ ద్వారా తెలుపుతుంది.



మనం స్పోర్ట్స్
శుక్రవారం, 2 ఫిబ్రవరి, 2018
www.manamnews.com

# క్రీడలకు రూ. 258 కోట్లు హైక్

- ఖేలో ఇండియాకు రూ. 520.09 కోట్లు
- సాయ్ నిధుల్లో కోత
- గురువారం బడ్జెట్ ప్రవేశపెట్టిన అరుణ్ జైట్లీ

**న్యూఢిల్లీ:** కేంద్ర బడ్జెట్ 2018-19కి క్రీడలకు రూ. 258.2 కోట్లు హైక్ లభించింది. గురువారం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో బడ్జెట్ సమర్పించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం వరకు క్రీడలకు ఆర్థిక మంత్రి రూ. 2196.36 కోట్లు కేటాయించారు. అంతే గత సంవత్సరం రూ. 1936.16 కోట్లతో పోలిస్తే ఈ ఏడాది రూ. 258.2 కోట్లు అదనంగా కేటాయించారు. అయితే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు నిధుల కేటాయింపులో కోత పడింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను సాయ్ రూ. 495.73 కోట్లు అందుకుంది. కానీ 2018-19కి రూ. 429.56 కోట్లు కేటాయించారు. అంటే రూ. 66.17 కోట్లు కోత పడింది. అయితే కేంద్ర ప్రభుత్వం ముద్దు బిడ్డ 'ఖేలో ఇండియా'కు ఆర్థిక మంత్రి వీలైనంత ఎక్కువ నిధులు కేటాయించారు. గతేడాది ఈ కార్యక్రమానికి రూ. 350 కోట్లు ఇవ్వగా.. ఈ ఏడాది రూ. 520.09 కోట్లు కేటాయించారు. అంటే ఈ ఏడాది మొత్తం స్పోర్ట్స్ బడ్జెట్‌లో ఖేలో ఇండియా భాగం 23.67 శాతం. అయితే జమ్మూ, కాశ్మీర్‌లో క్రీడల అభివృద్ధి నిధులకు కూడా కోత పడింది. గతేడాది రూ. 75 కోట్లు కేటాయించగా.. ఈ ఏడాది రూ. 50 కోట్లు మాత్రమే కేటాయించారు. త్వరలో జరగనున్న కామన్వెల్త్ గేమ్స్, ఆసియా గేమ్స్‌కు సిద్ధపడుతున్న అథ్లెట్ల ఆర్థిక సహాయానికి అరుణ్ జైట్లీ ప్రత్యేక ప్యాకేజీ అంటూ ఏదీ ప్రకటించలేదు. వివిధ నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్స్ (ఎన్ఎస్ఎఫ్)కు రూ. 40 కోట్లు హైక్ ఇచ్చినట్టు మంత్రి ప్రకటించారు. గతేడాది ఎన్ఎస్ఎఫ్‌కు రూ. 302.18 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ. 342 కోట్లు కేటాయించారు. అంటే రూ. 41.82 కోట్లు మాత్రమే అదనంగా వచ్చాయి. నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎన్ఎస్‌డీఎఫ్) నిధుల కేటాయింపులో ఎటువంటి మార్పూ లేదు. అదే రూ. 2 కోట్లు కేటాయించారు. కాగా వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (వాడా) కంట్రిబ్యూషన్ కింద రూ. 1 కోటి కేటాయించారు. అయితే క్రీడాకారులకు ప్రోత్సాహకాలను రూ. 18.13 కోట్ల (2017-18) నుంచి రూ. 23 కోట్లకు (2018-19) పెంచారు. హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్ స్పోర్ట్స్‌లో 50 శాతం కోత పడింది. రూ. 10 కోట్ల నుంచి రూ. 5 కోట్లకు తగ్గించారు.



# ఇండియానే ఫేవరెట్

- ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్‌పై గంగూలీ
- రేపు ఆస్ట్రేలియాతో తుది పోరు



**కోల్‌కతా:** ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్‌లో ఇండియానే ఫేవరెట్ అని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నారు. ఇండియా, ఆస్ట్రేలియా మధ్య ఫైనల్ మ్యాచ్ శనివారం జరగనుంది. మంగళవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇండియా 203 పరుగుల భారీ తేడాతో పాకిస్థాన్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. 'ఇండియానే గెలుస్తుంది. అండర్-19 జట్టు అద్భుతంగా ఆడుతోంది. పృథ్వీ షా, శుభ్‌మన్ గిల్, కమలేష్ నగర్‌కోటి, శివం మవి, ఇషాన్ పోరెల్ వంటి ప్రతిభావంతులైన యువ క్రికెటర్లు మనకున్నారు. వీళ్లంతా బీసీసీఐ రూపొందించిన సిస్టమ్‌తో అభివృద్ధి చెందారు. క్రికెటర్ల అభివృద్ధికి జూనియర్, అండర్-19 స్థాయి నుంచి సీనియర్ లెవెల్ వరకు మా బోర్డు సభ్యులు ఎంతో సమయాన్ని వెచ్చించారు. నిర్మాణాత్మకైన విధానం లేకపోతే ప్రతిభావంతులను తయారు చేయలేం. వీళ్లంతా అటువంటి సిద్ధాంతంలోంచి వచ్చినవారే. రాబోయే ఐదేళ్లలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో పాటు ఇండియా కూడా ప్రపంచంలో అత్యుత్తమ జట్టుగా నిలుస్తుంది' అని గంగూలీ అన్నారు. బెంగాల్ కుర్రాళ్లు ఇషాన్ పోరెల్, కనిష్క్ సేథ్‌లపై గంగూలీ ప్రశంసలు గుప్పించారు.

# ఇబ్బందుల్లో ఎడుల్జీ



**న్యూఢిల్లీ:** కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీఓఏ) సభ్యురాలు, భారత మాజీ మహిళా క్రికెటర్ డయానా ఎడుల్జీ ఇబ్బందుల్లో పడ్డారు. మహిళా క్రికెటర్లకు వన్ టైమ్ బెనిఫిట్ ఎక్స్‌గ్రేషియాను చెల్లించడంపై ఎడుల్జీపై బీసీసీఐ కోశాధికారి అనిరుధ్ చౌదరి ప్రశ్నల వర్షం కురిపించారు. ఎక్స్‌గ్రేషియా తీసుకున్న వారిలో ఎడుల్జీ సోదరి బెహ్రోజ్ కూడా ఉండడంతో ఇది ద్వంద్వ ప్రయోజనాల కిందికి వస్తుందని చౌదరి అన్నారు. 70 దశకంలో బెహ్రోజ్ ఇండియాకు ఏకైక టెస్టు మ్యాచ్ ఆడారు. ఈ ఎక్స్‌గ్రేషియా తీసుకున్న వారి జాబితాలో బెహ్రోజ్ కూడా ఉన్నారు. దీనిపై ఇప్పటి వరకు బోర్డు సభ్యులెవ్వరూ నోరు మెదపలేదు. కానీ ఎడుల్జీకి చౌదరి లేఖ రాసిన తర్వాత అందరూ ఈ చర్యపై బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. సీఓఏ, సీఈఓ (రాహుల్ జొహ్రీ) వ్యతిరేకిగా పేరు తెచ్చుకున్న చౌదరి తన లేఖలో ఎడుల్జీ చర్యను ఎండగట్టారు. ట్రెజరీ పవర్‌ను తన నుంచి లాగేసుకున్నారన్న దానికి నిరసనగా బీసీసీఐ స్టేట్‌మెంట్ ఆఫ్ అకౌంట్‌పై సంతకం చేశానని చౌదరీ తన లేఖలో స్పష్టం చేశారు. స్పెషల్ జనరల్ మీటింగ్‌లో చర్చించకుండా వన్ టైమ్ బెనిఫిట్ పేమెంట్ ఎలా చేస్తారని చౌదరి ప్రశ్నించారు.

# క్వార్టర్స్‌లో సింధు, సైనా



శ్రీకాంత్‌కు చుక్కెదురు • ఇండియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్

**న్యూఢిల్లీ:** ఇండియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ స్టార్ షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. గురువారమిక్కడ జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో సింధు 21-10, 21-14తో బల్గేరియాకు చెందిన లిండా జెట్చెరిని వరుస సెట్లతో ఓడించింది. తొలి గేమ్‌లో సునాయా సంగా ఓటమిని అంగీకరించిన లిండా రెండో సెట్‌లో కొంత మేరకు ప్రతిఘటించింది. రెండో సెట్‌ను కైవసం చేసుకునేందుకు ప్రయత్నించి విఫలమైంది. మరో మ్యాచ్‌లో సైనా నెహ్వాల్ 21-12, 21-11తో డెన్మార్క్‌కు చెందిన లైన్ హౌమార్క్ జెర్స్‌ఫెల్ట్‌పై సునాయాస విజయం సాధించింది. తొలి గేమ్‌లో అంతో ఇంతో ప్రతిఘటించిన జెర్స్‌ఫెల్ట్ రెండో గేమ్‌లో ఆ మాత్రం కూడా పోటీ ఇవ్వలేకపోయింది.

పురుషుల విభాగ ంలో భారత్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. గతేడాది నాలుగు సూపర్ సరీస్ టైటిళ్లు గెలిచి రికార్డు సృష్టించిన తెలుగు తేజం, గుంటూరు కుర్రాడు కిదాంబి శ్రీకాంత్ ఇంటి ముఖం పట్టాడు. రెండో రౌండ్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 19-21, 17-21తో మలేసియాకు చెందిన ఇస్కందర్ జుల్కర్‌మైన్ చేతిలో వరుస సెట్లలో ఓటమిపాలయ్యాడు. తొలి గేమ్‌లో గెలిచేందుకు పోరాడిన శ్రీకాంత్ రెండో గేమ్‌లో ఆ మేరకు ప్రతిఘటించలేదు.

పురుషుల సింగిల్స్‌లోనే ఇతర మ్యాచ్‌ల్లో కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్ పారుపల్లి కశ్యప్, సమీర్ వర్మతోపాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, అశ్వినీ పొన్నప్ప జోడీ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. వరుస గాయాలతో సతమతమవుతున్న కశ్యప్ తొలి రౌండ్ దాటేందుకు కూడా ఇబ్బంది పడేవాడు. కానీ ఈ టోర్నీలో ఎట్టకేలకు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. గురువారమిక్కడ జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో కశ్యప్ 21-19, 19-21, 21-12తో సహచరుడు శ్రేయాన్ష్ జైస్వాల్‌పై పోరాడి గెలిచాడు. భుజం నొప్పి గాయం నుంచి కోలుకున్న సమీర్ వర్మ 21-18, 19-21, 21-17తో ఇండోనేషియాకు చెందిన ప్రపంచ 3వ ర్యాంక్ షట్లర్, 2014 వరల్డ్ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత టామ్మీ సుగియార్తోను ఓడించాడు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో అన్‌సీడెడ్ జోడీగా బరిలోకి దిగిన సాత్విక్, పొన్నప్ప 21-16, 15-21, 23-21తో మలేసియాకు చెందిన మూడో సీడ్ జంట టాన్ కియాన్ మెంగ్, లై పీ జింగ్‌పై పోరాడి నెగ్గింది. మరో మ్యాచ్‌లో ప్రణవ్ చోప్రా, ఎన్. సిక్కిరెడ్డి జంట 21-10, 21-19తో భారత్, మలేసియా ద్వయం ప్రజక్తా సావంత్, యోగేంద్రన్ కృష్ణన్‌ను వరుస సెట్లలో ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. పురుషుల డబుల్స్‌లో మను అత్రి, బి. సుమీత్ రెడ్డి జోడీ 21-11, 21-15తో మన దేశానికే చెందిన తుషార్ శర్మ, చంద్రభూషణ్ త్రిపాఠి జంటపై సునాయాస విజయం సాధించింది. అంతకుముందు జరిగిన మ్యాచ్‌ల్లో ముగ్ధా అగ్రేపై 12-21, 16-21తో యూఎస్ఏకు చెందిన బీవెన్ ఝూంగ్, రుత్విక శివాణిపై 19-21, 16-21తో స్పెయిన్‌కు చెందిన బీట్రిజ్ కొర్రాలెస్ గెలుపొందారు.



# మేరీకోమ్ 'బంగారం'

- భారత పురుషులకు చుక్కెదురు
- ఇండియా ఓపెన్ బాక్సింగ్



**న్యూఢిల్లీ:** ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత స్టార్ మహిళా బాక్సర్ ఎంసీ మేరీకోమ్ ఇండియా ఓపెన్ బాక్సింగ్ టోర్నీలో స్వర్ణ పతకం గెలిచింది. కాగా పురుషుల విభాగంలో భారత బాక్సర్లను క్యూబా, ఉజ్బెకిస్థాన్ బాక్సర్లు అడ్డుకున్నారు. గురువారమిక్కడ జరిగిన మహిళల 48 కిలోల కేటగిరి ఫైనల్లో మేరీకోమ్ 4-1తో ఫిలిప్పినోకు చెందిన జోసీ గబుకొను చిత్తు చేసింది. గురువారం చివరి రోజు మహిళల విభాగంలో అస్సాంకు చెందిన విలావో బసుమతరి (64 కిలో) 3-2తో థాయ్‌లాండ్‌కు చెందిన సుడపోర్న్ సీసండీపై గెలిచి తొలి బంగారు పతకాన్ని చేజిక్కించుకుంది. అస్సాంకే చెందిన లవ్లీనా బొర్గోహైన్ వెల్టర్‌వెయిట్ (69 కిలో) విభాగంలో సహచరురాలు పూజాను చిత్తు చేసి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. అయితే ఎల్. సరితా దేవి (60 కిలో) ఫిన్లాండ్‌కు చెందిన మీరా పెట్కొనన్ చేతిలో ఓటమిపాలై రజతంతో సంతృప్తి చెందింది. పురుషుల విభాగంలో సంజీత్ (91 కిలో) ఉజ్బెకిస్థాన్‌కు చెందిన సంజర్‌పై నెగ్గి పసిడి పతకాన్ని చేజిక్కించుకున్నాడు.

# వికాస్ యాదవ్‌కు స్వర్ణం

ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్

**న్యూఢిల్లీ:** ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్‌లో మహారాష్ట్రకు చెందిన జావెలిన్ త్రోయర్ చిన్నారి వికాస్ యాదవ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. గురువారం రెండో రోజు జరిగిన పోటీల్లో వికాస్ 75.02 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరి స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. అయితే తమిళనాడుకు చెందిన సి. ప్రవీణ్ డబుల్ గోల్డ్ ఆశలు నీరుగారాయి. ప్రవీణ్ ట్రిపుల్ జంప్‌లో మాత్రమే స్వర్ణం గెలిచాడు. లాంగ్ జంప్‌లో రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే కేరళకు చెందిన 16 ఏళ్ల బాలిక ఆన్సీ సొజన్ లాంగ్ జంప్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆరు ప్రయత్నాలకు గానూ నాలుగింటిలో ఫౌల్ చేసినప్పటికీ 5.08 మీటర్లతో ఆమె అగ్రస్థానంలో నిలిచింది. 200 మీటర్ల పరుగు పందెంలోనూ ఆమె రజతం గెలిచింది. పంజాబ్‌కు చెందిన చన్వీర్ కౌర్ పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. బాలుర 200 మీటర్ల పరుగు పందెంలో కర్ణాటకకు చెందిన శశికాంత్ 21.82 సెకన్లతో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు.

# 'ఖేలో ఇండియా'పై ప్రముఖుల ప్రశంసలు



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న 'ఖేలో ఇండియా' స్కూల్ గేమ్స్‌పై ప్రముఖ క్రీడాకారులు పీటీ ఉష, బైచుంగ్ భుటియా, విజేందర్ సింగ్ ప్రశంసలు గుప్పించారు. భారత క్రీడలపై గొప్ప ప్రభావాన్ని చూపుతుందుని వారన్నారు. 'ఖేలో ఇండియా నిర్మాణం అట్టడుగు స్థాయి నుంచి దృఢమైన ప్రభావాన్ని చూపుతుంది. చిన్నారుల వరకు క్రీడలను తీసుకెళ్లగలగడం, వాళ్లు క్రీడల్లో పాల్గొనేలా చేయడం చాలా ముఖ్యం. చాలా మంది తాజా ప్రతిభావంతులను తయారు చేయడంలో ఇది ఉపయోగపడుతుంది' అని భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ భుటియా అన్నాడు. ఈ కార్యక్రమం భవిష్యత్తులో దేశానికి ఎంతో ఉపయోగపడుతుందని ఒలింపిక్స్ పతక విజేత విజేందర్ చెప్పాడు. 'ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంది. భారత ఒలింపిక్ ఆశావహులకు మరింత బలాన్నిస్తుంది. ఖేలో ఇండియాకు నా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాను' అని విజేందర్ పేర్కొన్నాడు. ఇక రియో ఒలింపిక్స్ పతక విజేత దీపా మాలిక్ మాటాడుతూ.. 'భారత్‌కు క్రీడా దేశంగా మార్చేందుకు ఖేలో ఇండియా ఉపయోగపడు తుంది. ఆరోగ్యకరమైన వాతావరణంలో చిన్నారుల్లోని ప్రతిభను వెలికి తీస్తుంది. అంతేకాకుండా ఇండియా ముఖచిత్రాన్ని మార్చివేయడమే కాకుండా స్పోర్టింగ్ పవర్ హౌస్‌గా నిలుపుతుంది' అని పేర్కొంది. పీటీ ఉష మాట్లాడుతూ చిన్న వయసులోనే ప్రభుత్వం మద్దతు లభించడం నిజంగా అథ్లెట్ల అదృష్టమని పేర్కొన్నారు. 'పతకాలు గెలిచిన తర్వాతే మాకు ప్రభుత్వ మద్దతు లభించేది. చిన్న తనంలోనే ప్రతిభను వెలికి తీసే ఖేలో ఇండియా లాంటి సిస్టమ్ మాకు లేదు. ప్రభుత్వం నుంచి ఇటువంటి మద్దతును పొందుతున్న మన చిన్నారి అథ్లెట్లు నిజంగా అదృష్టవంతులు' అని ఆమె అన్నారు. ఖేలో ఇండియా ద్వారా భవిష్యత్తులో భారత్‌కు పతకాల సంఖ్య పెరుగుతుందని జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ చెప్పింది. '2024, 2028 ఒలింపిక్స్‌లో పతకాల సంఖ్యను పెంచుకునేందుకు భారత్‌కు ఇదొక గొప్ప అవకాశం. ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన చిన్నారులు మంచి శిక్షణ తీసుకుని, షెడ్యూల్‌ను అనుసరించాలి. అర్థిక సహాయం గురించి చింతించాల్సిన పనిలేదు. ఖచ్చితంగా భారత్ మరిన్ని పతకాలను గెలుస్తుంది' అని కర్మాకర్ పేర్కొంది. రియో ఒలింపిక్స్‌లో కర్మాకర్ తృటిలో మూడో స్థానాన్ని కోల్పోయిన సంగతి తెలిసిందే.



### కోహ్లీకి గాయం

సౌతాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ దారుణంగా గాయపడ్డాడు. ఏడో ఓవర్లో కిందికి జారి బంతిని ఫీల్డింగ్ చేసే క్రమంలో కోహ్లీ షూ గడ్డిలో ఇరుక్కుపోయి తుంటి కీలు, మోకాలు పట్టేసినట్టయింది. బుధవారం రాత్రి పడిన వర్షం కారణంగా అవుట్ ఫీల్డ్ అంతా చిత్తడిగా ఉండింది. ఐదు ఓవర్లు కవర్స్‌లో ఫీల్డింగ్ చేసిన కోహ్లీ తర్వాత స్లిప్స్‌లో నిలబడ్డాడు. తర్వాత 14వ ఓవర్ తర్వాత మైదానం విడిచి వెళ్లాడు. వెంటనే ఫిజియో కోహ్లీ మోకాలికి ఐస్ ప్యాక్ పెట్టాడు. కానీ కెప్టెన్ పరిస్థితిపై ఎటువంటి సమాచారం లేదు.

# స్పిన్నర్ల మాయాజాలం

కుల్‌దీప్‌కు 3, చాహల్‌కు 2 వికెట్లు • ప్లెసిస్ సెంచరీ • టీమిండియాతో తొలి వన్డే

**డర్బన్:** సౌతాఫ్రికాతో గురువారమిక్కడ జరిగిన తొలి వన్డేలో భారత మణికట్టు స్పిన్నర్లు మణికట్టు మాయాజాలంతో సౌతాఫ్రికా జట్టు భారీ స్కోరు చేయకుండా కట్టడి చేశారు. కుల్‌దీప్ యాదవ్ కీలకమైన 3 వికెట్లు, యజ్వేంద్ర చాహల్ 2 వికెట్లు తీసుకున్నారు. ఆరంభం నుంచి కట్టుదిట్టమైన బౌలింగ్ చేసినప్పటికీ సౌతాఫ్రికా కెప్టెన్ సెంచరీతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. తర్వాత బరిలోకి దిగిన టీమిండియా కూడా ఆరంభంలోనే తొలి వికెట్ కోల్పోయింది. 33 పరుగుల వద్ద రోహిత్ శర్మ అవుటయ్యాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లీ మరో ఓపెనర్ శిఖర్ ధావన్‌తో కలిసి స్కోరు బోర్డును ముందుకు కదిలించాడు. కడపటి వార్తలందే సమయానికి టీమిండియా 2 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికా జట్టుకు కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్ అండగా నిలిచాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా మరో ఎండ్‌లో సహనంతో ఆడి సెంచరీ చేశాడు. భారత స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్ సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్ భరతం పట్టారు. ఆరంభంలో భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా కట్టుదిట్టమైన బౌలింగ్ చేశారు. అయినప్పటికీ సౌతాఫ్రికా తొలి ఓపెనర్ క్వింటన్ డి కాక్ ఆచితూచి ఆడగా.. మరో ఓపెనర్ హాషీం ఆమ్లాలను అదను చూసి షాట్లు కొట్టాడు. దీంతో ఆమ్లా వికెట్ల వద్ద నిలదొక్కుకున్నాడనుకుంటున్న సమయంలో బుమ్రా బౌలింగ్‌లో ఎల్‌బిడబ్ల్యూగా వెనుదిరిగాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ డు ప్లెసిస్ తమపై ఉన్న ఒత్తిడిని తగించే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో హార్దిక్ పాండ్యా బౌలింగ్‌కు దిగాడు. మూడు ఓవర్లలో పాండ్యా 28 పరుగులిచ్చాడు. దీంతో చాహల్‌ను బరిలోకి దించారు. డికాక్ కూడా ఎల్‌బిడబ్ల్యూగా పెవిలియన్ చేరుకున్నాడు. కానీ రీ ప్లేలో చూస్తే బంతి ఆఫ్ స్టంప్‌ను మిస్సవుతున్నట్టు కనిపించింది. టీమిండియా ఫీల్డర్లు అప్పీల్ చేయగానే డికాక్ స్వచ్ఛందంగా వెనుదిరిగాడు. గాయపడిన ఏబీ డివిలియర్స్ స్థానంలో జట్టులోకి వచ్చిన ఐడెన్ మార్‌క్రమ్.. కుల్‌దీప్ బంతికి బలయ్యాడు. మరో ఓవర్లో జేపీ డుమినిని కుల్‌దీప్ పెవిలియన్ పంపాడు. ఆ తర్వాతి ఓవర్లో కుల్‌దీప్ బౌలింగ్‌లోనే డేవిడ్ మిల్లర్ ఇచ్చిన క్యాచ్‌ను కోహ్లీ డైవ్ చేసి పట్టాడు. మణికట్టు స్పిన్నర్ల దెబ్బకు సగం మంది పెవిలియన్ చేరుకున్నారు. కానీ ప్రతిఘటించిన ప్లెసిస్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. క్రిస్ మోరిస్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను కొనసాగించాడు. మోరిస్ తన సహజ సిద్ధమైన దూకుడు బ్యాటింగ్‌ను ఆడాడు. ఇద్దరూ తమపై ఉన్న ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేశారు. అయితే కుల్‌దీప్ వేసిన లో ఫుల్‌టాస్ బంతిని మిస్సయిన మోరిస్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత చివరి ఐదు ఓవర్లలో ప్లెసిస్ అటాకింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. 101 బంతుల్లో 100 పరుగులు పూర్తి చేసిన ప్లెసిస్ తర్వాత భువనేశ్వర్, బుమ్రా బౌలింగ్‌ల్లో భారీ సిక్సర్లు కొట్టాడు. చివరికి 50వ ఓవర్లో రెండో బంతికి ప్లెసిస్ (120) అవుటయ్యాడు. ఐదో బంతికి రబాడ రనౌట్ కాగా.. పెహ్లువాయో, మోర్కెల్ నాటౌట్‌గా నిలవడంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.